ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి గాయత్రి





ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ మాతృ దేవోభవ ! పితృ దేవోభవ ! ఆచార్య దేవోభవ ! అతిథి దేవోభవ ! సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
డా॥ ప్రణవ్‌పండ్యా
సంపాదకులు
బి.సి.హెచ్.వి. సుబ్బారావు
(అశ్విని)
ఉప సంపాదకులు
ముక్కామల రత్నాకర్
సంపాదక మండలి
సాధన నరసింహాచార్య
శ్రీమతి లక్ష్మీరాజగోపాల్
డి.వి.ఆర్. మూర్తి

సంపుటి 21 - సంచిక 05
అక్టోబర్ 2016

పత్రిక అందనివారు మరియు
పత్రికకు సూచనలు, సలహాలు
ఇవ్వదలచినవారు ఈ క్రింది
ఫోన్ నంబర్లలో సంప్రదించగలరు
040-23700722
94407 69798
99491 11175


## దీపరహస్యం

అత్యంత ఆనందోత్సాహాలతో దీపావళి పండుగను జరుపుకుంటున్నాము. దీపం జడచేతనాలను ఏకం చేసి చూపుతుంది. దీపం యొక్క శరీరం ఒక మట్టి ప్రమిద. అయితే ఏం? దాని ప్రకాశం మాత్రం చైతన్యవంతమైంది. దేవసంస్కృతి విశ్వ విద్యాలయ పరిసరాల్లో కూడా ఒక దీపం వెలిగించబడింది. దీపం ఎప్పుడు ఊర్ధ్వ ముఖంగానే ప్రకాశిస్తూ ఉంటుంది. ప్రపంచంలో ఎక్కడ చూసినా జ్యోతి వెలిగించడం అంటే మామూలు విషయం. కానీ దాని వెలుగు, శక్తి, కోట్లాది ప్రజలకు ప్రేరణను అందిస్తూ ఉంటాయి.

దీపకాంతులను విశ్వవిద్యాలయాలలోని యువతతో పోల్చవచ్చు. దేవసంస్కృతి విశ్వవిద్యాలయ సమీపంలో వెలిగించబడ్డ జ్యోతి అఖండజ్యోతి నుండి తీసుకొనబడింది. డివైన్ ఇండియా యూత్ అసోసియేషన్ (భారత ఆధ్యాత్మిక యువ సంస్థ) అని నామకరణం చేయడం జరిగింది. ఈ సంస్థ యొక్క శరీరం మాతృభూమి యొక్క మట్టితో చేయబడింది. యువత యొక్క ప్రాణశక్తి, బలం, మనోబలం, ఆత్మబలం కలసి తయారైన శక్తియే దాని తైలం. యువత యొక్క దృఢ సంకల్పమే దానిలో వేయబడిన వత్తి. వారి ఆత్మ చేతనయే ఆ జ్యోతి నుండి ప్రసరించే ప్రకాశం. ఆ ప్రకాశమే నేడు ప్రపంచ యువతకు సన్మార్గాన్ని చూపిస్తూ ఉంది.

శారీరికంగా చూస్తే దీపం చాలా చిన్నదే. కానీ దానిలో నిండి ఉన్న విశ్వవిద్యాలయ యువ చైతన్యాన్ని కొలిచి చూపగల సామర్థ్యం ఎవరికీ లేదు. అది ఒక పెద్ద అగ్నిశిఖ. నిరంతరం పైకి చూస్తున్న దాని దృష్టియే ఆత్మ. ఆ ప్రకాశమానమైన ఆత్మయే లేకపోతే మిగిలినదంతా మట్టిముద్దయే. ఈప్రకాశమే కనుక పూర్తిగా విస్తరించితే భారతదేశంలో యువశక్తి విజయాన్ని సాధించి తీరుతుంది. ఈ జ్యోతి యొక్క ప్రభావాన్ని, దానివల్ల జరగబోయే మార్పుల్ని ఊహించడం మేధావులకు అంత కష్టమైన పని కాదు. జ్యోతిని పరిశీలనగా చూస్తే చాలు మనస్సులలో ఉన్న అంధకారం అంతరించిపోతుంది. దేశ యువత యొక్క సంకల్పాలు, యుగదేవత అయిన మహాకాలుని రూపురేఖలు కన్నుల ముందుకదలాడుతూ ఉంటాయి.

# విషయసూచిక


1. **సంపాదకీయం:** దీపరహస్యం 3
2. **విషయసూచిక** 4
3. **యుగనిర్మాణ చిత్రావళి-18:** ప్రాపంచిక సుఖములను త్యాగం చేసిన సమర్థగురు రామదాస్ 5
4. **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-52:** స్వచ్ఛ భారత్ 6
5. **సూక్ష్మీకరణ సాధన-11:** పురుషార్థము - విరాట్ పురుషునితో సంబంధం పెట్టుకునే ప్రయత్నం 7
6. **దేవి నవరాత్రుల ప్రత్యేకం:** 10 సంయమనం ఉంటేనే సాధన సిద్ధిస్తుంది
7. **నవరాత్రి అనుష్ఠానం:** 12 ఆత్మబల అభివృద్ధికి అద్భుత అవకాశం
8. **దీపావళి పండుగ ప్రత్యేకం:** వేర్పాటువాదమనే చీకట్లను తొలగించే విధంగా ఒక దీపమును వెలిగిద్దాం రండి! 13
9. **సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గాయత్రీ సాధనలు** 16
10. **సమాజ నిర్మాణం:** 19 వేరుని తడిపితేనే మొక్క చిగురిస్తుంది
11. **ఈ శతాబ్దానికి అధిష్ఠాత సూర్యుడు** 21
12. **రంగుల విజ్ఞానం:** 24 రంగులలో అందమే కాదు శక్తి కూడా ఉన్నది
13. **మనము - మన ఆరోగ్యం:** యోగసాధన ద్వారా రోగముల నిర్మూలన 26
14. **జీవించే కళ:** త్యాగమే జీవామృతం 28
15. **వ్యక్తి నిర్మాణం:** 30 నాలుగు ఆదర్శములు-యుగ ధర్మము
16. **స్వామిరామతీర్థ జయంతి ప్రత్యేకం:** భారతీయ ఆత్మను వెలికితీసే వేదాంతం 32
17. **బోధ కథ:** ఒక మాతృమూర్తి ఆవేదన 35
18. **విద్య స్వావలంబనను, వివేకాన్ని పెంపొందించాలి** 37
19. **పూజ్య గురుదేవుల అమృతవాణి:** 39 ఆధ్యాత్మికత అంటే రొక్కబేరమే - 2
20. **నా వారితో నా మాట:** 42 యువక్రాంతి సంవత్సరం 2016 - వృక్షగంగా అభియానానికి వివిధ ప్రయోగాలు
21. **ఆయుర్వేద వైద్యం-19:** 45 అనేక రోగాలకు ఒకే ఔషధము 'జిల్లేడు'
22. **స్ఫూర్తిదాయక గాయత్రీపరివార్ సభ్యులు-29** 47
23. **వార్తలు:** ఉభయ తెలుగు రాష్ట్రాలలో జరిగిన వివిధ కార్యక్రమాలు 49



## యుగశక్తి గాయత్రి

విడి ప్రతి రూ॥ **15/-** సం॥ చందా రూ॥ **150/-**
**3** సం॥ చందా రూ॥ **420/-** **10** సం॥ చందా రూ॥ **1300/-**

చందా రుసుమును ఎట్ పార్ చెక్ ద్వారా (at par cheque) లేక డి.డి.ద్వారా కాని పంపగలరు. యం.ఒ. ద్వారా కూడా పైకం పంపించవచ్చు. కానీ యం.ఒ. ద్వారా వచ్చినప్పుడు పూర్తి అడ్రస్సు ఉండుట లేదు. అందువలన యం.ఒ. ద్వారా పైకం పంపినప్పుడు క్రింద ఇచ్చిన ఫోన్ నంబర్లను సంప్రదించి మీ వివరాలు అన్నీ ఇవ్వ ప్రార్థన. రూ. 5,000 లేక అంతకన్నా ఎక్కువ పంపదలచుకున్నప్పుడు ఆన్‌లైన్ ద్వారా పంపవచ్చును. దీనికన్నా తక్కువ పంపే వారు, రూ. 50/- అదనంగా చేర్చి పంపాలి.

ఖాతాపేరు: **శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు**
బ్యాంకు పేరు: **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
**ఎర్రగడ్డ శాఖ, హైదరాబాద్**
ఖాతా నెం.: **32506416087**
IFSC Code: **SBIN-0013272**

ఆన్‌లైన్‌లో పంపినప్పుడు బ్యాంక్ చలానా జిరాక్సు కాపీని మీ చిరునామా తెలుపుతూ తప్పక మాకు పంపించాలి.

**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**
**గాయత్రీ చేతనా కేంద్రము,** హెచ్.పి. రోడ్, మూసాపేట
అశ్విని హౌస్ దగ్గర, హైదరాబాదు - 500 018.
ఫోన్: 040-23700722, సెల్: 9949111175


## పండుగలు

**అక్టోబర్ 2016**

| | |
|---|---|
| 02-10-2016 | మహాత్మాగాంధీ జయంతి<br>లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి |
| 09-10-2016 | దుర్గాష్టమి |
| 11-10-2016 | విజయదశమి (దసరా) |
| 30-10-2016 | దీపావళి |

**నవంబర్ 2016**

| | |
|---|---|
| 03-11-2016 | నాగుల చవితి |
| 14-11-2016 | కార్తీక పౌర్ణమి<br>గురునానక్ జయంతి<br>నెహ్రూ జయంతి |

**సలహాలు వినేవాడికి సమస్యలకు సమాధానం దొరుకుతాయి**

# ప్రాపంచిక సుఖములను త్యాగం చేసిన సమర్ధగురు రామదాస్



ఇంట్లో రామదాస్ యొక్క వివాహానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. కానీ రామదాస్ అంతఃకరణలో ఆత్మ యొక్క సాక్షాత్కారం, లోకమంగళ ఆలోచనల మథనం జరుగుతున్నది. పరమార్థం లేక ప్రాపంచిక సుఖములలో ఏది శ్రేష్ఠమైనది, దేనికి ప్రముఖస్థానం ఇవ్వాలి అనే దానిని నిర్ణయించుకోలేకపోయాడు.

మిత్రులు, బంధువులు ఇలా అన్నారు – "రామదాస్! సిద్ధాంతపరంగా ఎన్నో విషయాలు చెప్పవచ్చు. కానీ వాటిని పాటించడం చాలా కష్టం, వివాహం చేసుకొని ఆనందంగా జీవించు"

మిత్రులు వెళ్ళిన తరువాత రామదాస్ ఆత్మ ఇలా అన్నది" – సిద్ధాంతములను పాటించడానికి కావలసిన సాహసం మనుష్యులకు కూడా లేకపోతే, లోకకళ్యాణం వంటి భగవంతుని కార్యక్రమం చేయడానికి కావలసిన శక్తి మరి దేనిలో ఉంటుంది? వివాహం చేసుకుని నీ శక్తిని విషయ వాసనలపై నాశనం చేసుకోకు. ఈ ప్రక్రియ సృష్టి యొక్క అతి చిన్న జీవులు, పురుగులు కూడా చేస్తాయి. మనిషి కూడా అలాగే జీవిస్తే అతనికి భగవంతుడు ఇచ్చిన అసంఖ్యాక సామర్థ్యముల దైవీ విభూతుల ఉపయోగం ఏమిటి?

వివాహం యొక్క సమయం దగ్గర పడుతున్నది కానీ రామదాస్ అంతిమ నిర్ణయం తీసుకోలేకపోయాడు. ముహూర్త సమయం ఆసన్నమైనది. వరునిగా రామదాస్. వధువు ఇద్దరు మండపం పైకి వచ్చారు. ఆ సమయంలో మహారాష్ట్రలో ఉన్న ఆనవాయితి ప్రకారం ఇలా అన్నాడు – "అబ్బాయి, అమ్మాయి సావధాన్" (జాగ్రత్త) ఈ శబ్దములలో ఆయనకు భావిజీవితం యొక్క మార్గం లభించింది. రామదాస్‌కు పురోహితుని శబ్దములలో మహా పురుషుల ఆదేశాలు కనిపించాయి ఇంద్రియ సుఖాలలో ప్రాపంచిక కామనలలో ఆసక్తుడైన వ్యక్తి పుణ్య పరమార్థములను గురించి ఏమి ఆలోచించగలడు? రామదాస్‌లో సాహసం ఉప్పొంగింది, వివాహ మండపంలో అదృష్టం కలసి వచ్చింది. లోకుల ప్రయత్నాలు వ్యర్థమయ్యాయి, ఇక మంగళమయ జీవితం నుంచి వెనుకకు తిరిగి చూడలేదు.

తపశ్చర్య ద్వారా ప్రప్రథమంగా తన ఆత్మిక సామర్థ్యాలు జాగృతం చేసుకుని తరువాత సమాజం యొక్క అప్పటి పరిస్థితులను బాగుచేసే పనిలో నిమగ్నమయ్యాడు. ఆయన శివాజీకి స్వాధీనతా సంగ్రామం కొరకు శిక్షణ ఇచ్చాడు. ఆ సమయంలో మహారాష్ట్రలోని ప్రజలు తుచ్ఛమైన ఇంద్రియ భోగములలో నిమగ్నమయి ఉండేవారు. ఆయన సమయం యొక్క మహత్వం వివరించి, అనేకచోట్ల వ్యాయామశాలలు స్థాపించి, శివాజీకి కావలసిన సమర్థవంతమైన సైనికులను తయారుచేశాడు. శివాజీ యొక్క త్యాగము, కౌశలము, ధర్మనిరతి ఇదంతా సమర్ధ సద్గురు రామదాస్ చలువే. ఆత్మిక క్షమతలు ఉన్న వ్యక్తి పరసువేదివలే ఇనుమును తాకి బంగారంగా మార్చగలడు, సామాన్యవ్యక్తులలో మహాపురుషుల యోగ్యతలు ఉత్పన్నం చేయగలడు.

*– అనువాదం: ముక్కామల రత్నాకర్.*

**ఒక్కొక్కసారి 'మాట' చేసిన సాయం మరేది చేయకపోవచ్చు**

## పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-52

# స్వచ్ఛ భారత్



ఠాకుర్ మాటలు శ్రీరామ్‌కి కూడా వినపడ్డాయి. ఆయన కృపానిధి వంక చూసారు. కృపానిధి కూడా కళ్ళు తెరిచారు. ఆ చూపులో ఆహ్లాదంతోపాటు శ్రీరామ్‌పట్ల అభినందన కూడా ఉంది. ఊరు చాలా చిన్నది. రోడ్లు శుభ్రపడడానికి గంట కూడా పట్టలేదు. చీపురుకట్ట పడగానే వాతావరణం మెరిసిపోయింది. ఠాకుర్ మాట ప్రకారం అందరు గుళ్ళో గుమిగూడారు. అక్కడికొచ్చిన వారంతా దుమ్ముధూళితో మట్టికొట్టుకపోయి ఉన్నారు.

వచ్చినవారి ముందు నిలబడి శ్రీరామ్ వారి అవతారాల ప్రస్తావనతోనే ఉద్బోధన మొదలు పెట్టారు. ఊరు కూడా దేవుని ఆలయమే అని చెప్పారు. గుళ్ళోని దేవుని స్థానమే వ్యాపించి ఊరి రూపంగా మారిందన్నారు. 'దాని శుభ్రంగా ఉంచడం అందరి కర్తవ్యం. అందరం కలసి ఈరోజు చేసిన పని ప్రతిరోజు జరిగేట్టు చూసుకోవాలి, అప్పుడే భగవంతుడు ప్రసన్నమవుతాడు. గుడిలో రోజు ఊడుపు, తుడుపు జరిగినట్టే ఊళ్ళో కూడా రోజు జరగాలి.

కృపానిధి కుతూహలంతో ప్రశ్నించారు, "గుడిలో శుభ్రతకు ప్రసన్నమై దేవుడు కోరికలు తీరుస్తాడు. ఊరిలో శుభ్రత వల్ల మనకేం లభిస్తుంది?"

"ఊళ్ళో రోగాలు వ్యాపించవు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు. మనసు ప్రసన్నంగా ఉండి బుద్ధి నిర్మలంగా ఉంటుంది" అంటూ శ్రీరామ్ స్వచ్ఛత వల్ల లాభాలను చెప్పుకొచ్చారు. వాటంతటవే వచ్చే లాభాల గురించి శ్రీరామ్ చాలా విస్తృతంగా వ్యాఖ్యానించారు.

మర్నాడు ఇళ్ళ బైట కాలువలు తవ్వేపని మొదలైంది. చెత్తచెదారం రోడ్లమీద పారేయకూడదని అందరికీ తెలియ చెప్పడం జరిగింది. ఇంటిలోపలే ఒకచోట అంట్లు తోముకునే ఏర్పాటు చేసుకుని, ఆ మురికి నీళ్ళు కాలువల్లోకి పారేట్టు చూసుకోవాలి. దాదాపు ఎనిమిది రోజుల్లో కాలువల పని పూర్తైంది. కాలువలు తవ్వి ఇటుకలతో కాలి బాట కట్టే విధానం శ్రీరామ్ స్వయంగా నేర్పించారు.

కరావల్‌ను సవరించడానికి శ్రీరామ్ రోజూ ఉదయం తొమ్మిదిన్నరకల్లా అక్కడ ఉండేవారు. శుభ్రత, వ్యవస్థల గురించిన శిక్షణ ఇవ్వడానికి రెండు వారాలు కూడా పట్టలేదు. ఠాకుర్ గారు స్వయంగా ఈ పనిలో అభిరుచిని చూపించడం మొదలుపెట్టారు. మిగిలిన వాళ్ళు కూడా ఆయన వల్ల ముందుకు రాసాగారు. ఆ తరువాత ఇది వారి దైనందిన కార్యం అయిపోయింది. ఇంటి వాకిటి బైట రోడ్డు, పెరటి వైపు భూమిని కూడా కుటుంబాలు తమ బాధ్యతగా భావించడం మొదలుపెట్టాయి.

దీపావళికి ఒకరోజు ముందు శ్రీరామ్ రోజంతా కరావల్‌లోనే గడిపారు. రెండువారాలలోపే ఊరికి కాయకల్పం జరిగింది. శ్రీరామ్ ఠాకుర్‌గారితో, "ఈసారి మేము ఇక్కడే దీపావళి జరుపుకుంటాం, ఠాకుర్ గారింటి నుండి ఊరందరికీ మిఠాయిలందుతాయి. సాయంత్రం పూజ పూర్తయ్యాక ఒక విషయం చాటిస్తాం" అన్నారు.

"ఏ విషయమై చాటింపు వేస్తారు" అడిగారు ఠాకుర్ గారు. "సాయంత్రమే ప్రకటన జరుగుతుంది. దాని బాధ్యత కూడా ఖచ్చితంగా మీదే" అని శ్రీరామ్ అనడంతో ఠాకుర్‌గారిలో ఉత్సుకత పెరిగింది. ఆత్రుతతో "ఇప్పుడే చెప్పండి, ఇప్పుడే చెప్పండి" అన్నారు.

"శ్రీరామ్ నవ్వారు. కృపానిధితో సాయంత్రం వాపసు బయలుదేరారు. దారిలో అతను కూడా ఠాకుర్‌లాగానే జిజ్ఞాసతో అడిగాడు. "ఠాకుర్‌తో గదుల వ్యవస్థ చేయమని చెప్తా. అక్కడ ఊళ్ళోని పిల్లల చదువు కొనసాగాలి. పాఠశాల నడుపుదాం." అని జవాబిచ్చారు.

"ఈమాట ఠాకుర్‌తో అంటే అయిపోయేది. రాత్రికి హాయిగా నిద్రపోయేవాడు కదా" అన్నాడు కృపానిధి "ఈ రెండు వారాల్లో ఠాకుర్‌కు చాలా మనశ్శాంతి లభించింది. అప్పుడప్పుడు ఒకటి రెండు రోజుల ఆత్రుత కూడా ఆరోగ్యానికి మంచిదే" అంటూ శ్రీరామ్ నవ్వారు.

– అనువాదం: శ్రీమతి జయలక్ష్మి

**మనోబలానికి ప్రార్థన దివ్యౌషధం**

# పురుషార్థము - విరాట్ పురుషునితో సంబంధము పెట్టుకునే ప్రయత్నం

ఆత్మసత్త ఏవిధంగా అయితే చేతనాశక్తి, పదార్థసంపదల సమన్వితరూపంలో గుర్తించబడుతున్నదో అదేవిధంగా సమిష్టిగత బ్రహ్మాండవ్యాపి సత్తాకూడా... ప్రకృతి బ్రాహ్మీచేతన యొక్క సమన్వయము (combination)గా గుర్తించవచ్చు. ఈ పరోక్షజగత్తు ఆ విరాట్పురుషుని అనుకృతియే. దీని దిగ్ దర్శనమే రాముడు కౌలస్యకు, కాకభుంసుడికి; కృష్ణుడు - యశోదకు, అర్జునుడికి చేయించారు. ఈ సువిశాల ప్రపంచములో అపరిమితమైన పదార్థ సంపద, చేతనత్వ సంపద ఉన్నది. సమస్త సృష్టి కార్యకలాపాలు, వృష్టి-సమిష్టి యొక్క పరస్పర సంబంధాలే. పరమాణువు యొక్క సూక్ష్మతమ కణాలు, తరంగ-క్వాంటముల సముచ్చయముల నుండి బ్రహ్మాండము లోని అనేక సౌరమండలములు కలసి ఉన్న ఈ విశాల జగత్తు స్రష్టయొక్క స్థూలశరీరంగా గుర్తించవచ్చు. ఇది భౌతికక్షేత్ర పరిధి. విధాతయొక్క సూక్ష్మశరీరంలో కార్యకారణ, క్రియా-ప్రక్రియ సంఘటనలు, ప్రత్యక్ష క్రియాకలాపాలకు ఆధారము. సృష్టిలో అప్పుడప్పుడు జరిగే సంఘటనలకు, హఠాత్తుగా జరిగే మార్పులకు, రాబోయే పరిస్థితుల స్వరూపమునకు సూక్ష్మ శరీరమే కారణము. దానిని సూక్ష్మదర్శి దృష్టితో చూడగలరు. మనిషి తన ఆత్మసత్తా ఉనికిని ఏవిధంగా గుర్తించలేకపోతున్నాడో ప్రకృతిలో చేతనత్వము యొక్క అవిజ్ఞాతపక్షము (side) తెలుసు కోలేదు.

ఈ పరోక్షజగత్తులోనే సూక్ష్మీకృత దివ్యాత్మలు, ప్రేతములు, పితరులు, విషాణువులు నివసిస్తూ ఉంటాయి. ఇది ఒక అద్భుతమైన ప్రపంచము. శరీరాన్ని వదలి క్రొత్త జన్మ ఎత్తేవరకు వ్యక్తి ఈ లోకంలోనే సూక్ష్మరూపంలో పరిభ్రమిస్తూ ఉండాలి. లోకలోకాంతరములు, స్వర్గం-నరకం యొక్క చర్యలు, మరణించిన తర్వాత అనుభూతులు, పునర్జన్మ సంఘటనలు, ఈ అదృశ్యజగత్తుయొక్క లీలాసందోహమే. ఇది ఎవరు చూడగలరు? ఈ సందర్భంలో మహాభారత అశ్వమేధపర్వంలో ఇలా చెప్పబడింది.

**'యథాంధకారే ఖద్యోతం లీయమానం**
**ఇత స్తతః చక్షుష్మంతం ప్రపశ్యన్తి తథాచ జ్ఞాన చక్షుషః ।**
**పశ్యన్త్యేవం విధం సిద్ధా చేవం దివ్యేన చక్షుషాః**
**త్యజన్తి జాయమానం చ యోని చాను ప్రవేశితం ॥"**

తాత్పర్యము: ఏవిధంగా కళ్ళు ఉన్న వ్యక్తులు చీకటిరాత్రిలో అక్కడక్కడ ఎగురుతూ ఉన్న మిణుగురుపురుగులను చూస్తారో అదేవిధంగా దివ్యదృష్టిసంపన్న సిద్ధపురుషులు తమ దివ్య చక్షువుల ద్వారా జీవులు శరీరాన్ని వదలడము, పునః శరీరమును ధరించుట, రెండవ యోనిలో ప్రవేశించుట చాలా స్పష్టంగా తెలుసుకొనగలుగుతారు.'

దీనినే ఆత్మపరిభాషలో 'దర్శనం' అంటారు. అనగా స్థూల చక్షువులతో చూడటంగాక, సూక్ష్మనేత్రములతో, పరోక్షజగత్తులో జరిగిన, జరుగుచున్న, జరుగబోయే ఘటనాక్రమములను అవలోకించుట. దానినే అనుశీలన అని కూడా అంటారు. అందువల్లనే ఈ శరీర రూప ప్రయోగశాలలో అనుసంధానము చేసే వైదిక ఋషి సముదాయము యోగసాధనలు తప-తితీక్షల ద్వారా పరోక్షజగత్తు యొక్క సంపూర్ణజ్ఞానము సాధించేవారు. ఊహామీదకాక దివ్యచక్షువుల ద్వారా ప్రత్యక్ష జ్ఞానాన్ని ఉంచుకుంటూ, వారు సృష్టి వ్యవస్థలో ఏవిధమైన వ్యతిక్రమము ఏర్పరచకుండా స్వయంగా లాభాన్వితము అగుటయేగాక జనసముదాయములకు కూడా దానియొక్క చమత్కారపూర్ణ ఫలితార్థములను అవగతము చేస్తుండేవారు. సూక్ష్మీకరణ సాధన వస్తుతః పరోక్షజగత్తు యొక్క దిగ్దర్శనము. దీనితో పరిభ్రమణ చేస్తూ, తద్వారా విరాట్ సముదాయమునకు లాభమును అందించే ఉచ్చస్థరీయ ప్రక్రియ.

ఉపనిషత్కారుని కథనం ఇలాగ ఉన్నది. **హిరణ్మయేన పాత్రేన సత్యస్యాపిహితం ముఖమ్, తత్త్వమ్ పూషన్న పావుణు సత్యధర్మాయ దృష్టయే.** 'ఆ స్వర్ణమయ పాత్రతో సత్యము యొక్క ముఖము కప్పబడి ఉన్నది. హే జగత్పోషక! మీరు దానిని దూరం చేయండి. అందువల్ల సత్యనిష్ఠుడనైన నేను మీ దర్శనము

**తల్లిప్రేమకు సాటి మరేదిరాదు**

చేయగలుగుతాను. ఎందువల్లనంటే – **యోఽ సాదసౌ పురుషః సోఽమస్మి** – ఏ విరాట్ పురుషుడు నాతో ఉన్నాడో అతడే నేను.

వేదాంతము యొక్క ఈ మాన్యతయే ప్రత్యక్ష పరోక్షముల యొక్క ఘనిష్ఠ ఏకాత్మతను స్థాపిస్తుంది. స్థూలమైనది కంటికి గోచరించేది మాత్రమే సత్యము కాదు అనే తథ్యము పురుషులకు తెలుసు. అందువల్లనే వారు భావపరవశులై ఈవిధంగా ఉచ్చరిస్తారు. 'హే విరాట్పురుషుడా! నేను జీవితపర్యంతము వస్తువుల బాహ్యసౌందర్యము మాత్రమే చూస్తూ వచ్చాను. ఇప్పుడు సాధ్యపురుషార్థముల ద్వారా వస్తువులలో నిబిడీకృతమై ఉన్న ఆ చిరస్థాయి మీ కృతియే అయిన అక్షర సౌందర్యమును దర్శనము చేసుకునే ఇచ్ఛ కలవాడిని అయ్యాను'. సత్యాన్వేషణ విరాట్ యొక్క అనుసంధానము. పరోక్షము యొక్క పరిశోధన, అంతః సూక్ష్మదృష్టి ప్రాప్తియే వారి చరమ లక్ష్యము.

సూక్ష్మీకరణ సందర్భములో పరోక్షజగత్తు గురించి చర్చ మొదలుపెట్టినప్పుడు దాని సంరచన గురించి కూడా ఆలోచించడము తప్పనిసరి. ఇంద్రియాలు అందరికి తెలిసినట్లు నాడీస్పందన (తంత్రిక ఆవేగము) (Nervous impulses) ద్వారా సంచాలితమౌతాయి. మానవుని చక్షువులకు అతి సూక్ష్మ తరంగములు చూసే సామర్థ్యము లేదుకదా! కేవలము గణితీయ ఆధారముగా వానిగురించి ఊహించుకుంటారు. ఇదివరకు భౌతికశాస్త్రములో కాంతియొక్క వేగము తీవ్రతమముగా భావించేవారు. కాని అంతకంటే ఎక్కువ వేగము గల కణ–ప్రతికణములు ఈనాడు కనుగొనబడ్డాయి. సాపేక్ష సిద్ధాంతము తరువాత కూడా భౌతికశాస్త్రములో త్వరితగతిలో మార్పులొచ్చాయి. 'Relativity revisited' అనే పుస్తకములో రచయిత మనస్సు లేక ఆలోచనా తరంగాల వేగము అన్నింటి కంటే తీవ్రతరము అని తెలిపాడు. ఇది ఇంద్రియాతీతమైనది. అందువల్ల వాటిని చూడగలుగుట, వాటి వేగమును కొలుచుట, మానవుని బుద్ధి ద్వారా సంభవము కాదు. స్నాయువైజ్ఞానికులు (Neurologist) స్పర్శేంద్రియం (skin) ద్వారా మస్తిష్కమునకు పంపించబడ్డ ఆవేగములు సంపర్క స్థానము నుంచి మస్తిష్కము వద్దకు చేరుటకు 0.07 సెకండ్లకాలము తీసుకుంటుంది. కానీ ఈ గతి జెట్‌విమానము యొక్క వేగం కంటే తక్కువ. ఆలోచనాతరంగముల శక్తి (Motive force) సూక్ష్మతరము. అతి శక్తివంతము. భావనల శక్తి, సంవేదనలు అన్నింటికంటే తీవ్రమైనవి. దీనిని ఈవిధంగా అర్థము చేసుకొనవచ్చు. ఎలా ఎలా జీవాత్మ యొక్క సూక్ష్మీకరణ అవుతుందో దాని వేగము క్రమక్రమముగా ఇంద్రియాలకంటే, కాంతి కంటే, మనస్సు కంటే తీవ్రతరమవుతూ వెళ్తుంది. ఇటువంటి పరిశుద్ధ చిత్స్వరూప ఆత్మకోసమే ఆది శంకరా చార్యులవారు ఇలా అన్నారు.

**"తస్మిన్ మనసి బ్రహ్మలోకాదిన్ ధృతః గచ్ఛతి సతి ప్రథమ ప్రాప్త ఇవ ఆత్మ చైతన్య భా సౌ గృహ్యతే అతో మనసా జయాయ ఇత్యాహ"**

అనగా బ్రహ్మలోకము లాంటి దూరంగా ఉన్న లోకముల వైపు వెళ్ళినప్పుడు మనస్సు శుద్ధ చైతన్య రూపమైన ఆత్మను అంతకంటే ముందే అక్కడ ఉండటము గమనిస్తుంది. అందువల్లనే సూక్ష్మీకృత ఆత్మ మనస్సు కంటే తీవ్రతమమైనది.

సర్ జేమ్స్ జీన్స్ ఈ ఆప్తవచనములనే ఈవిధంగా చెప్పారు. 'జీవాత్మ తరంగ సముచ్చయముతో నిండి ఉన్న బ్రహ్మాండ సముద్రములో నివశిస్తుంది. అందులోనే పరమసత్తా యొక్క ఉనికి కూడా ఉన్నది. ఈ రెండింటిమధ్య అతి సూక్ష్మ రూపములో పరస్పరము ఇచ్చి–పుచ్చుకునే క్రమము నిరంతరము జరుగుతుంది'. నిజానికి బ్రహ్మాండీయశక్తి లేక బ్రహ్మచేతన ఎందులో అయితే అన్ని శక్తులు ఉన్నాయో, అదే ఆత్మ తనలో తాను జరిపించుకునే అతి సూక్ష్మ విలాసము. దీనిని తనమీదే ఉపయోగించుకొని ఒక విరాట్ స్వరూపముగా మార్చుట యోగులస్థాయికి ఎదిగిన మహా మానవులకు అసంభవము కానేకాదు.

మనస్సు యొక్క ఈ సామర్థ్యము గురించే ఉపనిషత్కారుల స్వరములో స్వరము కలుపుతూ అనేకమంది దార్శనికులు–వైజ్ఞానికులు తమతమ అభిప్రాయములను తెలిపారు. సర్ జులియన్ హక్స్లే ఇలా అన్నారు. ' తన వద్ద మనస్సు ఉండటం వల్లనే మనిషి ఈ జగత్తుయొక్క భవిష్య వికాసము కొరకు బాధ్యుడౌతాడు. ఈ స్థితి అన్య ప్రాణులకు వర్తించదు. సమిష్టిలో ఇమిడి ఉన్న ఈ వ్యష్టి మనస్సును సర్వవ్యాపకము చేయగలిగినప్పుడు వ్యక్తి తన బాధ్యతను సక్రమముగా నిర్వర్తించుకొనగలుగుతాడు'.

**అమ్మపాలు అంటే అమృతమే**

Biochemist పిమర్ టేలహార్ట్-ద-శార్దిన్ ఇలా అన్నారు. 'ఒకప్పుడు విజ్ఞానము ప్రపంచమును బహిరంగ దృష్టితో మాత్రమే చూడటానికి ప్రయత్నించినది'. పదార్థము యొక్క ప్రతికణములోను, బాహ్యముతోపాటు ఒక 'అంతస్' కూడా ఉన్నది. వేదాంతములో వర్ణించబడిన బ్రహ్మ, ప్రత్యక్షములో పరోక్షమును తెలుసుకొనే ప్రయత్నాలకు ఉచితమైన జవాబు'.

పదార్థవైజ్ఞానికుల దృష్టిలో పరోక్షము యొక్క సంరచన తెలుసుకొన్న తరువాత దానియొక్క క్రియాకలాపాలను కొంచెము తెలుసుకొనుట మంచిది. పూర్వార్ధ దర్శనానుసారము ఈ బ్రహ్మాండములో ఏడు లోకములు ఉన్నవి. అవి క్రమముగా క్రింది నుండి పైకి, స్థూలమైన భౌతికజగత్తు, శక్తి ప్రధానమైన కామజగత్తు, మనోమయజగత్తు, బుద్ధి, నిర్వాణ, అనుపాదక, ఆది జగత్తులు. వాటిగురించి ఆప్తవచనములలో ఉల్లేఖించ బడినది. వాటిలో ప్రతి లోకమునకు ఏడు ఉపలోకములు, అందుండు ప్రతి ఉపలోకము ఏడు ఏడుగా పునర్విభజన చేయబడతాయని చెప్పాడు. ఆది మరియు అనుపాదక లోకాలు మాత్రము అతిమానవీయ శక్తుల పరిధిలోనికి వస్తాయి. మిగతా ఐదులోకములు అంతరిక్షముయొక్క అంగములే కనుక మానవునికి అందుబాటులో ఉన్నాయి. ద్రష్టలైన ఋషుల ద్వారా రచింపబడిన సాహిత్యానుసారము ప్రతి లోకములో ఒక విశిష్టస్థాయి ప్రాణులు నివసిస్తూ ఉంటారు. వారి శారీరక సంరచన వేరువేరుగా వుంటుంది. ఈ లోకాలలో దివంగత ఆత్మలు, సూక్ష్మరూపములో తమ కాలాన్ని గడుపుతూ, సాధ్యమైనపుడల్లా ప్రత్యక్షజగత్తులోని జీవధారులకు సహాయము చేస్తూ వాతావరణ పరిశోధన చేస్తాయి.

పూర్వార్ధ దర్శనానుసారము జీవించి ఉన్న, దివంగత ఆత్మలు ఇరువురికి పరస్పరము ఎలా సంపర్కము స్థాపించు కోవాలో తెలియదు. ఇటువంటి ప్రయత్నాలు అసఫలమైనప్పుడు అనేక ప్రేతాత్మలు సూక్ష్మశరీరంలో ఉన్నప్పటికిని పనికిరాని లక్ష్యహీనమైన క్రియాకలాపాలలోనే నిరంతరము సంలగ్నమై ఉంటాయి. వారికి భయపడక, వారితో సంపర్కము సాధించ టానికి తత్పరత చూపించుటయే అధిక శ్రేయస్కరము. మరణోత్తర జీవితానికి సంబంధించిన భారతీయ దర్శనములోని కర్మ కాండలన్నీ ఈ ఉద్దేశ్యముతోనే చేయబడతాయి. అంతేకాక ఆధ్యాత్మిక విజ్ఞానము ద్వారా ఆత్మబలము సంపాదించుకున్న వ్యక్తికి రెండు లోకాలకి మధ్య సద్భావన, సహకార ద్వారములను తెరువగలిగే సామర్థ్యము ఉంటుంది. శరీరములోనే ఉన్నప్పటికీ సూక్ష్మలోకాలలో పరిభ్రమిస్తూ సహాయము చేయగలిగే శ్రేష్ఠ ఆత్మల ద్వారా అందరికీ మేలు కలిగే పనులు చేయించగలుగు తారు. గుహ్యవిద్యావిశారదుల మతానుసారము ప్రతివ్యక్తికీ సూక్ష్మజగత్తుతో సంపర్కము ఏర్పరచుకొని, పరస్పర సహాయ సహకార కార్యక్రమాలు సాధించగలిగే సామర్థ్యమున్నది. వారి ప్రకారము ప్రతివ్యక్తిలోను ఐదు కాదు, ఏడు జ్ఞానేంద్రియాలు ఉన్నాయి. కానీ ఆ రెండు అతిరిక్త ఇంద్రియములు. ఇవి అసామాన్యమైన యోగపురుషార్థము ద్వారానే వికసిస్తాయి.

విరాట్‌బ్రహ్మతో సంపర్కము సాధించగలిగితే సామన్య స్థాయి మనుష్యుడుకూడా అసామాన్యస్థితికి చేరుకుంటాడు. మహాపురుషుల వ్యావహారిక జీవనము పవిత్రత, ప్రఖరత, ఔదార్యము అనే గుణాల బలము మీద రూపొందుతుంది. వీరికంటే ఉచ్చస్థాయిలో ఉన్న ఋషికల్పయోగులు తమ అంతః చేతనను వికసింపచేసి దాని స్థాయిని పరబ్రహ్మశక్తి అవతరించగలిగే వీలు ఏర్పరచి అంతఃశక్తిని పెంచి, ఆయన ప్రతినిధులవలె సూక్ష్మీకృత భూమికను నెరవేరుస్తుంటారు. ఇది భౌతికశరీరము ధరించి ఉన్నప్పుడు కూడా సంభవమే. దీని కొరకు శరీరము విడుచుట అనివార్యము కాదు. అందువల్లనే మనస్వీ బ్రహ్మతేజ సమన్విత తపస్వీ వ్యక్తులు భూసురులు అనబడేవారు. వారియొక్క ఈ ఉపలబ్ధి ఆత్మయొక్క విజ్ఞాన సమ్మత విధానాల ఆధారముమీదే సంభవమౌతుంది. పరోక్షముతో సంపర్కము స్థాపించుకొని రోమాంచకరమైన రహస్యమైన ఆటలు ఆడేవారి అవసరము ఈనాడు లేదు. తమ తపఃశక్తితో సూక్ష్మీకరణ చెంది సూక్ష్మము నుండి విరాట్ స్వరూపులుగా అవగలిగే వ్యక్తుల అవసరము ఈనాడు ఉన్నంతగా ఇదివరకు ఎన్నడూ లేదు. నా యొక్క సాధన ప్రయోజనము కూడా ఇదే.

(సశేషం)

**ప్రపంచంలో అన్నింటికన్నా తల్లి గొప్పది**

దేవి నవరాత్రుల ప్రత్యేకం

# సంయమనం ఉంటేనే సాధన సిద్ధిస్తుంది

అక్టోబరు ఒకటవ తేదీ నుండి శరన్నవరాత్రులు ప్రారంభం కానున్నాయి, శారదీయ నవరాత్రులు సమయం చాలా మహత్వ పూర్ణమైనది. సాధనకు చాలా విశిష్టమైన సమయం. ఈ సాధనా తకాలంలో మనస్ఫూర్తిగా చేసిన కొంచెం సాధన కూడా అత్యంత ఫలప్రదమైనది. ఈ సమయంలో భగవతీదేవి కృప, వరాల అనుగ్రహం రెండూ లభిస్తాయి. అందుకే దీనిని శక్తి సాధనా పర్వంగా కూడా చెప్తారు. ఇవన్నీ కాక గాయత్రీ సాధన నిమిత్తమై ప్రత్యేకమైన అనుష్ఠానాల ఏర్పాటు చేస్తుంటారు, దాని మహత్తు అందరికీ తెలిసినదే.

శరన్నవరాత్రుల్లో జగన్మాత, ఆదిశక్తి స్వయంగా పరా స్వరూపంలో ప్రతిష్ఠితమై సర్వశ్రేష్ఠమైన మానవజీవితానికి గౌరవాన్ని ప్రసాదిస్తుంది. ఆ అమ్మపై ప్రేమ ఉన్నవారు. అమ్మపట్ల ఉన్ముఖులైనవారు, అమ్మ లేకుండా తమ అస్తిత్వమే లేదనుకున్న వారి పిలుపు కూడా మంత్రమే అవుతుంది. ఈ పిలుపులోని గాంభీర్యాన్ని బట్టి పరిణామం కూడా వ్యాపిస్తుంది. ఎందుకంటే నిర్మలమైన మనస్సుతో పిలిచే పిలుపు ఒకరకంగా భగవతీమాతకు ఆహ్వానమే అవుతుంది, తన పిల్లల దగ్గరకు తప్పనిసరిగా రావలసివస్తుంది.

నవరాత్రుల్లో ఇలా పిలిస్తే సాధకుని సాధన ఖచ్చితంగా పూర్తయినట్టే. ఒక్కోసారి సాధకుల సాధన అసంపూర్ణంగా మరియు ఫలితం లేకుండా ఉండిపోతుంది. సాధన చేశాము కానీ సిద్ధి లభించలేదు అని ఫిర్యాదు చేస్తారు. తపస్సు చేసినా తృప్తి మిగలదు. ఎన్ని సంవత్సరాలు సాధన చేసినా ఏదీ చేతికి అందలేదు అనే చాలామంది సాధకులు ఫిర్యాదు చేస్తుంటారు. అంటే సాధనా విజ్ఞానం మిథ్యేనా?

సాధనామార్గంలో పయనించాలనుకునే సాధకుడు ముందు అందుకుగాను ఉన్న షరతులు, అవసరాల గురించి విస్తారంగా తెలుసుకుని, అర్థం చేసుకోవడం చాలా అవసరం. సాధన మొదలుపెట్టేముందు సంయమనం అవసరం. సంయమనం సాధించాకనే సాధన ముందుకు కొనసాగుతుంది. సాధన చేస్తున్నప్పుడు సంయమనం పాటించకపోతే సాధకుడు తప్పుదోవ పట్టినట్టే.

సాధనలో సంయమనం ఎంత ముఖ్యమో తెలియచెప్పే ఒక గొప్ప ఐతిహాసిక సంఘటన గురించి చదువుదాం. నైమిషారణ్యంలో ఒక గొప్ప సాధువు ఉండేవారు. ఒకసారి ఆయన శిష్యులు ఒక ప్రశ్న అగిగారు. "గురుదేవా! మనిషి ఎంతో ప్రతిభాసంపన్నుడు. సాధారణ మనుషుల్లోంచే కొందరు ప్రసిద్ధ సాధువులుగా, సాధకులుగా, అవతార పురుషులుగా జన్మిస్తుంటారు. మరి అలాంటి మానవజాతిలో కొందరు మనుషులు జీవితం మాత్రం నికృష్టంగా, అంధకారమయంగా ఎందుకుంటుంది?"

ఈ ప్రశ్నకు జవాబుగా ఆయన శిష్యులను రెండు బాల్టీలను తెమ్మన్నారు. ఒక దాంట్లో నీళ్ళు నింపించారు. మరొక దాని అడుగు తీయించేసారు. తరువాత శిష్యులతో అన్నారు, "ఇప్పుడు మీరొక పని చేయండి, ఈ నీళ్ళున్న బాల్టీలోంచి నీళ్ళు తీసుకుని రెండవ దానిని నింపి చూపించండి." కుతూహలంగా చూస్తూ వారంతా, గురువుగారు! అలా ఎలా కుదురుతుంది? ఏ ఆధారం లేకుండా నీళ్ళు బాల్టీలో ఎలా నిల్వ ఉండలేవుగా." అన్నారు.

సాధువు – "సాధారణ మానవుల్లోను, మహామానవుల్లోను ఇదే తేడా. సాధారణ మానవుడు ఆర్జించిన దానికన్నా ఎక్కువ ఖర్చు చేస్తుంటాడు. ఆహారం మరియు ఇతర మాధ్యమాల ద్వారా శరీరంలోని వచ్చే శక్తి సంయమనం అనే ఆధారం లేనందువల్ల బైటకు వెళ్ళిపోతుంది. సంయమం ఉంటే ఆ శక్తి లోపలే ఉండి ఓజస్సుగా, తేజస్సుగా మరియు వర్చస్సుగా కనిపిస్తుంది. సంయమనం లేకుండా ఏ సాధనా కూడా సిద్ధిగా మారలేదు."

ఏవిధంగా అయితే సాధన మొదలుపెట్టే ముందు సంయమనం అనే ఆధారం అవసరమో, అలాగే సాధనా కాలంలో భక్తిపూర్వకమైన పిలుపు అవసరం. భక్తి అంటే పారవశ్యంతో భజనలు చేయడం కాదు, నిష్కల్మషమైన నిష్పాపమైన హృదయంతో భగవంతుని పిలవడం మరియు ఆయన ద్వారా నిర్ధారింపబడ్డ ఆదర్శాలు, మూల్యాల కోసం

**పాలకుడి తెలివితేటలను అంచనా వేయాలంటే అతని చుట్టూ ఉన్న మనుష్యులను చూస్తే చాలు**

తనకు తాను సమర్పించుకోవడం. సాధకుడు ఆధారం సంయమనం అయినప్పుడు, సాధకుని మనస్సులో భక్తి ఉన్నపుడు ఫలితాలు వస్తాయి.

అసంయమనం వల్ల మనస్సులో ఈర్ష్య, ద్వేషం, కామ, క్రోధ, లోభాలు మొదలైన లెక్కలేనన్ని చిల్లులు పడతాయి. జల్లెడలో పాలు నిలవనట్టుగానే, అసంయమనం వల్ల చిల్లులున్న మనస్సుతో ఎంత సాధన చేసినా సిద్ధి లభించదు, ఎంత తపస్సు చేసినా, తృప్తి మిగలదు. సాధనతో సిద్ధి పొందాలంటే సంయమనంతో మనస్సుకున్న చిల్లులను పూడ్చి మనలోని దోష దుర్గుణాలను దూరం చేసుకోవాలి. కానీ సంయమనం అంటే అర్థం ఇంద్రియదమనం కాదు.

నిజమైన సాధన భోగంలోను ఉండదు, దమనంలోను ఉండదు. ఆత్మజాగరణలో ఉంటుంది. ఈ రెండిటి ద్వంద్వం నుండి బయటపడి, తనను తాను పరమేశ్వరునిలో కలుపుకోవడంలో ఉంటుంది. సాధన అంటే ఏదో ప్రత్యేకమైన దుస్తులు, కుతూహలాన్ని రేకెత్తించే ప్రదర్శ నలు లేదా శరీరం మీద చూపించే కఠోరత కాదు. నరుడి నుండి నారాయణుడిగా మారే అంతర్యాత్ర. పశుత్వాన్ని దమనం చేయకుండా, దానిని పూర్తిగా విడిచిపెట్టి పరమాత్మభావంలో ప్రతిష్ఠించడంతోనే పరిపూర్ణమవుతుంది. అసురత్వానికి ప్రతీకమైన మహిషాసురుడిని మహాదుర్గ వధించలేదు, తన శరణులో తీసుకుంది. అణిచివేయడం (suppression) వల్ల గుణాలు పూర్తిగా నాశనం కావు. అనుకూలమైన సమయాన్ని చూసి మళ్ళీ లేచి నిల్చుంటాయి. కాబట్టివాటి రూపాంతరం చాలా అవసరం.

ఈ శరన్నవరాత్రుల పవిత్ర కాలంలో నిజమైన సాధన యొక్క మర్మాన్ని అర్థం చేసుకుని అందుకు అనుగుణంగా అడుగులు ముందుకు వేయాలి. నవరాత్రుల్లోని తొమ్మిది రోజులు ఈ శక్తి పూజకు ముఖ్యమైన రోజులు. ఈ తొమ్మిది రోజుల్లో మన సంచిత శక్తితో భగవతీమాతను పూజించాలి. ఈ తొమ్మిది రోజులకు సంబంధించిన లెక్కలేనన్ని రహస్యాలున్నా, వాటిలోని ముఖ్యరహస్యం తొమ్మిది అనే సంఖ్య గాయత్రీ మహామంత్రంలోని తొమ్మిది పదాలలో – 1.తత్, 2.సవితు, 3.వరేణ్యం, 4.భర్గో, 5.దేవస్య, 6.ధీమహి, 7.ధియో, 8.యోనః , 9.ప్రచోదయాత్‌లో నిహితమై ఉన్నాయి. మనం భక్తి పూర్వకంగా విశ్వవ్యాపిని, జగదంబ గాయత్రీని అర్చించి, ఆరాధిస్తే తన కృపను పొందుతారు. శరన్నవరాత్రుల లాభం తప్పక లభిస్తుంది.

*– అఖండజ్యోతి, అక్టోబరు 2015*

*అనువాదం: శ్రీమతి జయలక్ష్మి*

## పరిమిత సంతానం

*జాన్ ఎట్రిన్ యొక్క రెండు సంవత్సరాల పాప మెదడు పక్షవాతంతో బాధపడుతూ ఏ పని చేయలేకపోయేది. అంతటి దుర్భర స్థితిలో ఉన్న పిల్ల పెంపకం తమ విధి నిర్వహణగా భావించి తల్లిదండ్రులు తమ బిడ్డను ఎలాగైనాసరే బాగా పెంచి, శిక్షితురాల్ని చేసి స్వావలంబన కల్పించాలని నిశ్చయించుకొన్నారు. అందువలన మరో సంతానానికి అవకాశం ఈయక, డాక్టర్లు ఈ జబ్బు నయం కావటం అసాధ్యమని అంటున్నా లెక్కచేయక కర్మ బంధాలను తప్పించుకొనే ప్రయత్నంగాని, బాధ్యతను ఎగవేసే ఆలోచనగానీ దరిచేరనీయలేదు. కుటుంబ పోషణకు చాలినంత ధనార్జనకోసం కొంత సమయాన్ని కేటాయించి, మిగిలిన కాలాన్నంతటినీ ఆ పాప ఉద్ధరణకు, సంస్కరించటానికి వినియోగించేవారు. వారు చేయించే అభ్యాసాల వలన క్రమక్రమంగా ఆమె స్థితి చక్కబడింది. జబ్బు నయమవ్వటమే అసాధ్యమనుకున్న పిల్ల క్రమంగా తన దైనందిన కార్యక్రమాలను చక్కగా చేసికోవటమేగాక పట్టభద్రురాలైంది కూడా. ఈ విషయం పాఠకులకు చమత్కారంగా అనిపించవచ్చు కానీ ఎంతమాత్రం గాదు. ఈ మార్పు తల్లిదండ్రుల శ్రమ, వివేకం, ప్రేమ యొక్క ఫలితమే. సాధారణ వ్యక్తులు పుట్టినపిల్ల మానసిక వికలాంగురాలు అయ్యేటప్పటికి పనికిరాదని ఉపేక్షించి మరోబిడ్డను కనాలనుకుంటారు. అటువంటప్పుడు వారు బిడ్డకు పూర్తి న్యాయం చేయలేరు. కాబట్టి పరిమిత సంతానాన్ని దృష్టిలో ఉంచుకోవటం గృహస్థుల ప్రథమ కర్తవ్యం.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీసావిత్రి*

**ఎప్పటికీ ఆరోగ్యంగా ఉండాలంటే పనిచేస్తూనే ఉండాలి**

నవరాత్రి అనుష్ఠానం

# ఆత్మబల అభివృద్ధికి అద్భుత అవకాశం

రాత్రి, పగలు కలిసే సమయాలు ఉదయ సంధ్య సాయం సంధ్య. ఇవి ఉపాసనకు మహత్తరమైనవి. శుక్ల పక్ష, కృష్ణ పక్షములు, పూర్ణిమ, అమావాస్య, దీపావళి, హోలి, గురు పూర్ణిమ, శ్రావణి, శరత్పూర్ణిమవంటి పండుగలు ఈ సంధి సమయాలలోనే వస్తాయి. శీత, గ్రీష్మ ఋతువుల సంధికాలం సంవత్సరంలో రెండుసార్లు వస్తుంది. చైత్రమాసంలో, ఆశ్వీయుజ మాసంలో శరీర క్షాళనకు, కాయకల్పచికిత్సకు ఈ సంధి కాలాలు ఉత్తమమైనవని ఆయుర్వేద శాస్త్రం చెప్తోంది. అలాగే చైత్ర నవరాత్రులు, ఆశ్వీయుజ నవరాత్రులు అనుష్ఠానాలకు ఉత్తమమైనవి. నవరాత్రులు ప్రకృతి జగత్తులో ఋతువులకు ఋతు కాలములు. ఈ సమయాలలో వేడి, చలి సమతూకంలో ఉంటాయి. పృథ్వీ యొక్క వేగం తగ్గుతుంది.

నవరాత్రులు దేవత్వం భూమిపై దిగివచ్చే సమయాలు; జాగృతఆత్మలలో దైవీప్రేరణను నింపే సమయాలు. ఈ తొమ్మిది రోజులలో ప్రకృతి యొక్క సూక్ష్మ అంతరాళం, మానవ శరీరంలోని సూక్ష్మభాగం విశిష్టమైన పరివర్తన ప్రక్రియకు లోనవుతాయి. శరీరంలో సుడిగుండాల వంటి సంచలనాలు కలుగుతాయి. శరీరంలో పేరుకుపోయిన వికారాలను, మానసిక వికృతులను తొలగించడానికై జీవశక్తి తుఫానులా తీవ్ర సంఘర్షణ జరుపుతుంది. ఆత్మికప్రగతికై ఆంతరిక ప్రేరణలు సహజంగా ఉత్పన్నం అవుతాయి.

నవరాత్రులలో సూక్ష్మజగత్తు నుండి దైవీప్రేరణలు వర్షిస్తాయి. సంస్కరించబడిన ఆత్మలు తమలోపల సముద్ర మథనం వంటి సంచలనాలు కలగడాన్ని దర్శిస్తాయి. ఈ సంచలనాలను సద్వినియోగపరచుకునే సాధకులు అదృశ్యమైన ప్రేరణాశక్తి ద్వారా ప్రోత్సహించబడి, ఆత్మకళ్యాణ, లోకకళ్యాణ కర్యకలాపాలలో పాల్గొంటారు; అమూల్యములైన రత్నరాశులను సంపాదిస్తారు; కృతకృత్యులు అవుతారు.

ఈ సంధికాలంలో సాధకులకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి. ఊహకందని ఫలితాలు అందుతాయి. నవరాత్రులకు గూఢార్థం ఉన్నది. మానవశరీరం అనే అయోధ్యలో నవద్వారాలు అనగా తొమ్మిది ఇంద్రియాలు ఉన్నాయి. అజ్ఞానం వల్ల దుర్వినియోగపరచిన కారణంగా వాటిపై ఆవరించిన అంధకారాన్ని అనుష్ఠానం ద్వారా తొలగించవలసి ఉంది. ఒక్కొక్క రాత్రి ఒక్కొక్క ఇంద్రియంపై ఆలోచన చేయాలి. వాటిపై సంయమనాన్ని సాధించాలి. వాటిలో ఇమిడి ఉన్న సామర్థ్యాలను వెలికితీయాలి. వాస్తవానికి ఇదే నవరాత్రి సాధన. రాత్రి అంటే చీకటి. ఈ నవద్వారాల పట్ల, తొమ్మిది ఇంద్రియాల, విషయాలపట్ల మెలకువ వహించే సాధకుడు వాటిలో మునిగి పోడు; వాటిని దుర్వినియోగపరచి, తన ఓజస్సును, తేజస్సును, వర్చస్సును వృథా చేయడు, అజ్ఞాన అంధకారం నుండి వెలుగులోనికి తీసుకురావడమే నవరాత్రి జాగరణ.

నవరాత్రి నవదుర్గ ఉపాసనతో ముడిపడి ఉంది. దోష, దుర్గుణాలను, కషాయ కల్మషాలను నిర్మూలించే మహాశక్తి దుర్గను తొమ్మిదిరూపాలలో ఉపాసన చేస్తాము. ఈ రకమైన సాధన మన ఇంద్రియ చేతనత్వమును ఆవరించిన దుర్గుణాలను నశింపజేస్తుంది. మనిషిలోని పాపప్రవృత్తులే మహిషాసురుడు. నవరాత్రులలో మానసిక సంకల్పం ద్వారా ఆ ప్రవృత్తులపై అంకుశాన్ని ప్రయోగిస్తాము. సంయమ శీలమయిన ఆత్మనే దుర్గగా, మహాకాళిగా, గాయత్రిగా అభివర్ణిస్తారు. ప్రాణచేతన సంస్కరించబడినప్పుడు ఈ శక్తియే మహిషాసురమర్దిని అవుతుంది.

గాయత్రీ ఆదిశక్తి. దుర్గ మహాకాళి, మహాలక్ష్మి మున్నగునవి ఆ మహాశక్తికి వివిధరూపాలు కనుక నవరాత్రులలో గాయత్రీ అనుష్ఠానం యొక్క ప్రాముఖ్యత అన్నింటినీ మించినది కనుకనే, 24వేల గాయత్రీమంత్ర అనుష్ఠానానికి నవరాత్రిలో విశేష ప్రాధాన్యత ఉన్నది.

నవరాత్రి అనుష్ఠానం వల్ల శరీరంలో, మనస్సులో నిండి ఉన్న వికారాలు క్షాళన అవుతాయి. ఎందుకంటే నవరాత్రి పర్వం ఆత్మచేతన యొక్క సంస్కరణకు, క్షాళనకు అనువైన పర్వం.

★★★

**ఎంత తింటున్నామనే లెక్కతోపాటు ఏమి తింటున్నాము అనేది కూడా చూడాలి**

# వేర్పాటువాదమనే చీకట్లను తొలగించే విధంగా ఒక దీపమును వెలిగిద్దాం రండి!

దీపాలతో జరిపే మహోత్సవమే దీపావళి పండుగ! ఆనాడు వెలిగించబడిన లెక్కలేనన్ని దీపములు తమ సంపూర్ణ మైన కాంతులను వెదజల్లుతాయి మరియు ఆశ్వయుజ అమావాస్యనాడు తమస్సుతో నిండిన దట్టమైన చీకటిని పారద్రోలుతూ అంతటా వెలుగులను నింపుతాయి. దీపము వెలుగుతూనే కారుచీకటిలో ప్రకాశమును నింపివేస్తుంది. తనను తాను జ్వలింపజేసుకుంటూ ఇతరులకు వెలుగునిస్తుంది. అంతటా వెలుగును పంచుతుంది. స్వయంగా జ్వలించబడకుండా కాంతులను వెదజల్లుట అసాధ్యము. వాతావరణములో ఉల్లాసం-ఉత్సాహం-ఆనందములు నింపివేసే రీతిలో రంగురంగుల శోభితకాంతులను వెదజల్లుతాయి దీపావళినాటి దీపములు. బయటైతే ఎలాగూ వెలుగులు విరజిమ్ముబడుతుంటాయి. అయితే అంధకారమనే కారుమేఘములతో ఆవరించబడిన మదిలో ప్రకాశ కిరణములు తళుక్కుమన్నప్పుడే అసలైన దీపోత్సవం యొక్క లోతైన మర్మము విశదమౌతుంది.



దీపావళికి సంబంధించిన పలు పౌరాణిక గాథలు ప్రాచుర్యంలోనున్నాయి. పాఠకులకు ఈ గాథలన్నీ సుపరిచితములే! కానీ ఈ సుదీర్ఘ కథా ప్రసంగములో మనకు తెలియనిది ఏమైనా ఉన్నదీ అంటే అది 'ఈ మహాపర్వమునకు సంబంధించిన లోతైన-నిజమైన అర్థము.' ప్రతీ సంవత్సరము లాగానే ఈ సంవత్సరం కూడా దీపావళి పండుగ అట్ట హాసముగా, ఘనంగా జరుపుకోబడుతుంది. దీపములు బారులుగా వెలిగించబడతాయి. మిఠాయిలు పంచుకో బడతాయి. అలంకరణ తన చరమసీమలను తాకుతుంది. క్రొత్తక్రొత్తగా సింగారము చేసుకుని, నూతన వస్త్రములను ధరిస్తారు. ఉల్లాసం పరవళ్ళు త్రొక్కుతూండగా, కాంతులు వెదజల్లబడే ఈ మహోత్సవములో ఇదంతా ఇంత శోభాయ మానముగా జరగటమన్నది సమృద్ధికి ప్రతీక!

దీపావళి సంపద-వైభవముల పండుగ! ఇది శ్రీమహాలక్ష్మిని పూజించే పండుగ! అందుచేతనే ఈ పర్వములో వైభవం యొక్క అపారమైన సాగర మథనము జరుగుట స్వాభావికమే! గత కొన్ని దశాబ్దములుగా సమాజములో సమృద్ధి, వికాసములకు సంబంధించిన ఎన్నో క్రొత్త నిర్వచనములు ఊపందుకున్నాయి. సంపద, అభివృద్ధి యొక్క అంచులు అంబరమును స్పృశించి నాయి. ఇక ఇప్పుడు మట్టిదీపములతో పాటు బంగారు దీపములు స్వర్ణిమకాంతులను వెదజల్లుతున్నాయి. ఇదంతా సమృద్ధికి సంకేతము! సమాజమునకు మరియు మనుష్యులకు అంతులేని సుఖసౌకర్యములు, వైభవము మరియు సమృద్ధి ఉపలబ్ధమైనది. దీపావళిపండుగనాడు దీపపు కాంతులకు వైభవము యొక్క జిలుగు వెలుగులు కూడా తోడయ్యాయి. సర్వతోముఖి వికాసము యొక్క ఈ శోభ అత్యంత సుఖప్రదమైనది.

వీటన్నింటి మధ్యన ఒకవేళ ఏదైనా విషయం కను మరుగయ్యిందీ అంటే, కన్నులు మిఱుమిట్లు గొలిపే ఈ ప్రకాశ మహోత్సవం నడుమ ఒకవేళ ఏదైనా వస్తువు దృగ్గోచరం కాకున్నదీ అంటే అది అంతరంగములోని మోహం, తమస్సు మాత్రమే! దీపప్రభలతో మనస్సు నుండి అవి తొలగిపోవాలి. దీపపుకాంతి బయటంతటా జిగేల్‌మనే వెలుగును ప్రసరింప జేస్తున్నది. కానీ ఈ ప్రకాశముతో మన లోతుల లోలోపలి అంధకారము మీద ఎంతోకొంత మార్పు జరుగుట అన్నది మాత్రము కనిపించడం లేదు. బయట ప్రకాశోత్సవం అట్టహాసముగా సాగుతున్నది. అయితే అంతరమున మాత్రం అంతేస్థాయిలో మోహాంధకారము వ్యాపించి ఉన్నది. ఈ దశలో బాహ్యముగా ఐశ్వర్యము, వైభవములు ఎంతటి పరాకాష్ఠ నందుకొన్నప్పటికీ; మనము లోలోపల అంతే డొల్లగా, గుల్లగా ఉంటున్నాము. సరోవరములో స్నానము చేసినప్పటికినీ-నోరు మాత్రము దాహముతో ఎండిపోతున్న రీతిగా ఉన్నది మన అంతరంగములోని పరిస్థితి. దీపావళినాటి మిఱుమిట్లు గొలిపే వన్నెవన్నెల కాంతుల జిలుగుల వలన మన మనస్సులోని గాఢాంధకారములో మాత్రము ఎట్టి మార్పు రాకున్నది.

ఉల్లాసము మరియు హర్షములతో కూడిన ఈ మహా

**సమస్యలను అటకెక్కించి సుఖంగా నిద్రపోవాలి**

పర్వములో కాంతి-వృష్టి కురుస్తుంది. ఈ వెలుగుల వర్షంతో కాళరాత్రి యొక్క దట్టమైన చీకట్లు పటాపంచలైపోతాయి. అన్ని వైపులా, కేవలము ప్రకాశము మాత్రమే దృగ్గోచరమవు తుంది. దీపావళినాడు కాంతి-సముద్రము ఉవ్వెత్తున ఎగసిపడు తుంటుంది. అందుచేతనే దీనిని 'కాంతి మహోత్సవము' నకు ప్రతీకగా చెప్పటం జరిగింది. దేవతలు సైతం ఈ పండుగను చూడటానికి ఉవ్విళ్లూరుతుంటారు. శ్రీమహాలక్ష్మీదేవి దీపావళి నాటి రాత్రి తన సంపూర్ణ వైభవమును ఆవిష్కరిస్తుంది. చర్మ చక్షువులతో చూసినప్పటికీ లేదా అంతర్‌దృష్టితో వీక్షించినను ఈ పండుగ మహాద్భుతమైనది. బయట ఎంత ఐశ్వర్యము మరియు వైభవము ఉట్టిపడుతుందో; దానికంటే ఎన్నోరెట్లు అంతర్జగత్తులో తొణికిసలాడుతుంది. బాహ్యముగా కనిపిస్తున్న దంతా చూసి మనం పులకాంకితులమౌతున్నాము కానీ అంతర్ దృష్టి లేనందున అంతర్జగత్తులో ఆవిష్కృతమైన ఐశ్వర్యము మనలను రోమాంచితులను గావించలేకున్నది.

దీపావళిరాత్రి ఆధ్యాత్మిక దృష్టితో చూస్తే ఎంతో మహత్త్వ పూర్ణమైనది. తాంత్రికులు మరియు యోగులు తమదైన ప్రత్యేక శైలితో ఈ విశిష్టమైన నిశిరాత్రినాడు అద్భుత ప్రయోగములు, సాధనలు చేయుటలో మునిగిపోతుంటారు. ఆ సాధనాశక్తితో వారి అంతరంగమున దివ్యలోకపు కాంతులు ఆవిష్కృతమవు తుంటాయి. దీపావళినాటి రాత్రిని 'కాళరాత్రి' అని పిలుస్తారు. ఉదయం చతుర్దశి ఉండి; రాత్రివేళ అమావాస్య ఉన్నప్పుడు దీపావళీ పండుగ విశిష్టత మరింత అద్భుతముగా ఉంటుంది. ఆ ఘడియలే కాళరాత్రి యొక్క నిజమైన మరియు దుర్లభమైన యోగముగా ఉంటాయి. చతుర్దశి-అమావాస్య ఘడియలు రెండూ ఉండే యోగం ఏ దీపావళినాడు వస్తుందో ఆనాడు యక్షులు, దేవతలు, ఋషులు మనుష్య-శరీరము ధరించి ఈ మర్త్యలోకపు కాంతులను అనంతానంతముగా పెంచుతారు. ఋషుల యొక్క జీవనకాంతి వేలాది సూర్యుల ప్రకాశముతో సమానముగా వెలుగొందుతూ ఉంటుంది. ఈ దివ్యాత్ములు ఎప్పుడైతే స్వయంగా శరీరధారులై ఈ మానవలోకమును పావనము చేయుటకు వేంచేస్తారో అప్పుడు ఈ భూమిమీద వెల్లివిరిసే కాంతి, వెలుగును ఊహించుట సాధ్యము కాని పని.

కాళరాత్రి అనగా దీపావళినాటి రాత్రిలో స్థూల-సూక్ష్మ లోకముల మధ్య నుండే ఛేదింపవీలులేని మరియు బలమైన గోడలు సన్నని రేఖామాత్రముగా మార్పుచెందే దివ్య అంతర్ గ్రహీయ యోగము ఆవిష్కరించబడుతుంది. వీటి నడుమన ఉండే అనేక ద్వారములు తెరుచుకుంటాయి. ఈ కారణముగానే దివ్యాత్ములు ఇతర లోకములలోకి సహజముగాను మరియు సరళముగాను రాకపోకలు సాగించే వెసలుబాటు కలుగు తుంది. ఇందుచేతనే పలుకోణములలో దీపావళి నాటి రాత్రి దుర్లభము మరియు అమూల్యము అయినదని భావించ బడుతుంది. కొన్ని రహస్యమయమైన మరియు తాంత్రికమైన ప్రయోగములు ఎటువంటివంటే వాటిని ఆచరించే నిమిత్తము యోగులు మరియు తాంత్రికులు సంవత్సరముల తరబడి ఈ మహాయోగము కొరకు నిరీక్షిస్తుంటారు. ఎందుచేతనంటే అట్టి ప్రయోగములు కేవలము కాళరాత్రి యొక్క చతుర్దశి-అమావాస్య కలిసివచ్చే విశిష్ట ముహూర్తములోనే సుసంపన్నము కావించ బడతాయి. ప్రత్యేక సాధకులు సాధన కొరకు ఎప్పుడైతే ఈ విశేషమైన దివ్యక్షణములను ఎన్నుకుంటారో అప్పుడు వారి నాడీమండలము జాగృతమై వారు విభిన్న లోకములలోనికి చేరుకుని దివ్యానుభూతులను పొందుతారు.

యోగిజనుల అభిప్రాయము ప్రకారము హృదయలోకము యొక్క చిట్టచివరి కొన దేవలోకమును స్పృశిస్తూ అక్కడ వికసిస్తుంది. సామాన్యముగా హృదయలోకము-దేవలోకముల నడుమ ఒక అభేద్యమైన ఆవరణ ఉంటుంది. ఐతే కాళరాత్రి యొక్క ఈ పావనమైన, దివ్యమైన ముహూర్తములో సాధకుడు, సిద్ధుడు అత్యంత సహజముగా దేవలోకమున కాలుపెట్టగలిగే సిద్ధిని ప్రాప్తించుకుంటాడు. ఈ అద్భుత క్షణములలో దివ్యమగు లోకాంతరములలో సంచరించగలిగే విధముగా నాడులలో చైతన్యము ఏర్పడుతుంది. కాళరాత్రి మహత్యమును తేటతెల్లము చేయుట కొరకు తథ్యములు ఉల్లేఖించబడినాయి. అయితే దాని మాహాత్మ్యము లెక్కలేనన్ని రెట్లు అధికమైనది. అది అపరిమితమైన రహస్యములతో కూడినటువంటిది. అందువలన దీపావళి అనగా బాహ్యమైన వైభవము యొక్క వెలుగు జిలుగుల పండుగ మాత్రమే కాదు. మీదు మిక్కిలి ఆంతరిక ఐశ్వర్యము పొందే వీలున్న దుర్లభమైన యోగమయమైన అద్భుత క్షణము! జాగృతినొందిన సాధకులు-సిద్ధులు ఈ కాళరాత్రి యొక్క దివ్యజ్యోతి స్సాగరమున మనసారా మునకలేసి రిద్ధి-సిద్ధుల యొక్క విభూతులను తమ హస్తగతం చేసుకుంటారు. దీపావళి నాటి దివ్యక్షణములను మాధ్యమముగా చేసుకొని వారంతా

**నిద్రపోవడమంటే శరీరాన్ని రీఛార్జ్ చేసుకోవడమే**

ప్రజల అంతరంగమున జ్ఞానదీపాల కాంతులను ఉద్భవింప జేస్తారు.

దీపావళి ఎన్నెన్నో రీతుల దివ్యమైనది మరియు అలౌకిక మైనది. సాధనయందు అనురక్తి కలిగిన సాధకులు ఈ కాళరాత్రిని ఉపయోగించుకోవటము మాత్రము మరచిపోవద్దు సుమా! కేవలము పండుగ హడావిడితో, విందు-వినోదాలలో తేలియాడేవారికి లభించేదేమీ ఉండదు. అయితే మంచి నిష్ణాతుడైన గురుసాన్నిధ్యములో తన సాధనను పూర్తిచేసుకునే సాధకుని హృదయములో అనేకానేక దీపముల యొక్క జ్యోతులు కాంతులీనుతాయి. అందుచేత సాధకుడు తన ఆసక్తి మరియు శక్తిసామర్థ్యములను అనుసరించి దీపావళినాటి రాత్రిని ప్రార్థన, సాధన, జపము మరియు ధ్యానములలో గడపవలెను. బయటంతా కూడా దీపావళిపండుగ జరుపుకో బడుతుంది. అటుల చేయుటవలన అంతరంగమున సైతము వెలుగు భాసించగలదు. కనుక ఈ దీపావళినాటి కారుచీకటి రాత్రిలో అనేకమైన దివ్యానుభూతులను ఆస్వాదించండి. **'ఈ దీపావళినాడు నా మదిలో కూడా సద్గుణములు అనే ఒక దీపమును తప్పకుండా వెలిగించుకుంటాను. ఆ ప్రభతో నాలోను, ఇతరులలోను కూడా కాంతులు వెదజల్లుబడుగాక.'** అన్న సంకల్పమును తీసుకోండి.

హృదయమున దీపము వెలిగితే ఆ దీప్తితో జన్మజన్మాంత రముల నుండి వెన్నంటే వస్తున్న కషాయకల్మషములు నశించి పోతాయి. అరిషడ్వర్గములనే ఒక మందపాటిపొర లోపలున్న ఆత్మదీపపు దివ్యజ్యోతి బయటకు ప్రసరింపబడకుండా అడ్డు పడుతుంది. అంతరంగమును ఆవరించి ఉన్న దట్టమైన ఈ చీకటి 'సాధన ద్వారా లభించిన ప్రకాశముతోనే' పటాపంచలు చేయబడుతుంది. చాలామంది ప్రజల మనస్సులలో గూడు కట్టుకుని ఉన్న పెనుచీకటివలననే సామాజిక సమస్వరత మరియు సమానతా భావన లోపించాయి. మన హృదయమున ఘోరాంధకారపు హాహాకారములు భీకరధ్వనులను పుట్టిస్తున్నప్పుడు మరి మనం బయట దీపావళీపండుగను ఉల్లాసముగా ఎలా జరుపుకొనగలము? నిశిరాత్రి చీకటి వలె మనస్సు లోపల వ్యాపించి ఉన్న దోషదుర్గణములు సమాజమునంతటినీ ఆవరిస్తాయి. తత్కారణముగానే ఈనాటి సమాజములో హింస, హత్యలు, ఉగ్రవాదము, ఉపద్రవాలు భీకరరూపును దాల్చి ఇంతటి భయానతను సృష్టిస్తున్నాయి. అది దట్టమైన పొగమంచు వలె సమాజములో వణుకును పుట్టిస్తున్నది.

దీపావళిపండుగ యొక్క అంతరార్థము ఒక్కటే! దీపకాంతి మన లోపల ప్రకాశించాలి, బయట దీప్తులు వెదజల్లాలి. మనము మనలోపల ఒక జ్యోతిని వెలిగించుకున్నచో మన లోపల గూడుకట్టుకుని ఉన్న మాలిన్యము ఆ దీప్తి చేత సమసి పోతుంది. కషాయకల్మషములు మెల్లమెల్లగా నశించిపోతుంటే మనలోపల మనము అంతేస్థాయిలో పులకింతను, ప్రసన్నతను అనుభూతి చెందుతాము. జనుల హృదయములలో వెల్లివిరిసిన ఈ పులకింత ఎప్పుడైతే సమాజములోను ప్రస్ఫుటిస్తుందో అప్పుడు ఒత్తిడి, ఉదాసీనత, శత్రుత్వం వలన చొరబడిన భయా వహ వాతావరణము తగ్గుముఖం పడుతుంది. సమాజములో తిరిగి ఐకమత్యము, సమత, ఉదారత్వము, సహిష్ణత (ఓర్పు), సేవాభావన వంటి దివ్యగుణములు అభివృద్ధి చెందుతాయి. దీపావళినాడు వెలిగించిన దీపములతో పాటు సమాజమున ఆవిష్కృతమైన సద్గుణముల కాంతులు కూడా తళుక్కుమని మెఱుస్తుంటే అప్పుడు దీపావళిపండుగ శోభ మరోలా భాసిస్తుంది. అది మరింత అందముగా గోచరిస్తుంది. దానితో దీపాల పర్వపు స్వరూపమే మారిపోతుంది.

ఈనాడు దీపావళిపర్వమును మనము ఉపద్రవము-భయము నీడలో జరుపుకుంటున్నాము. ఏ దీపజ్యోతి నుండి ఏరకమైన బాంబు ప్రేలుతుందో, ఎంతమంది అమాయక ప్రజలు బలైపోతారో తెలియని దుఃస్థితిలో ఉన్నాము. ఉల్లాసము, ప్రకాశమునకు బదులు బాధతో నిండిన మూల్గులు మరియు మనస్సును కలవరపెట్టే పెద్ద పెద్ద కేకలతో ఆకాశము ఎక్కడ దద్దరిల్లుతుందోనన్న భయము పట్టిపీడిస్తున్నది. **దీపావళి పండుగ యొక్క ఈ పావనమైన వేళ మనందరము 'మానవత్వ మనే కాంతులు వెదజల్లుబడుగాక! ప్రేమ అనే వెలుగులు ప్రసరింపబడుగాక!' అని సంకల్పిస్తూ ఒక దీపమును వెలిగిద్దాము రండి! సత్సంకల్పముతో మనము ప్రజ్వరిలింపజేసిన ఈ దీప కాంతిలో ఏ మూలనైనా సరే మారువేషము వేసుకున్న ఉగ్రవాది దాగి ఉండలేదు. వేర్పాటువాదమనే చీకటిని పారద్రోలుతూ - మానవీయగుణములు వెల్లివిరిసేరీతిలో ఒక జ్యోతిని వెలిగిద్దాము రండి! ఇలా చేయుటలోనే దీపావళి పండుగ యొక్క సార్థకత దాగి ఉన్నది.**

*- అఖండజ్యోతి, నవంబరు 2008*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**ప్రశాంతమైన ఆలోచనలు ప్రశాంతమైన జీవితానికి దారిచూపుతాయి**

# సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గాయత్రీ సాధనలు

గాయత్రీ కల్పవృక్షమని, కామధేనువని, పరసువేదియని పూజ్యగురుదేవులు వర్ణించారు. ఈ గాయత్రీ సాధన ప్రతినిత్యం చేస్తున్నప్పటికి అనేకమందిని కొన్ని రకముల ఇబ్బందులు, బాధలు పీడిస్తుంటాయి. ఇటువంటి సమస్యలను పరిష్కరించు కోవటానికి, కోరికలు తీర్చుకొనుటకు పూజ్యగురుదేవులు కొన్ని ప్రత్యేకమైన, సాధనలు మనకు అందించారు. ఈ సాధనలలో కొన్నిచోట్ల బీజాక్షరములు ఉపయోగించబడ్డాయి. సాధకులు ఈ పద్ధతులను ఉపయోగించుకొని సత్వర నివారణ పొంద గలరు. ముందుగా స్త్రీలకు ఉపయోగపడే సాధనలు ఇవ్వబడ్డాయి.

**మనోనిగ్రహం:**

ఈ సాధన ముఖ్యముగా స్త్రీలకు అవసరమవుతుంది. అనేక కుటుంబాలలో అత్తమామలు, ఆడపడుచులు, భర్త వేధించడం జరుగుతుంటుంది. ఈ సమస్య నివారణ ఇలా చేసుకోవచ్చు. రోజు ఎంత జపం చేసుకుంటారో అంతే ముందుగా చేసి దీని తరువాత వృషభ వాహనంమీద శ్వేత వస్త్రధారిణియై, చతుర్భుజములు కలిగి, ఒక చేతిలో మాల, ఒక చేతిలో కమండలం, ఒక చేతిలో పుస్తకం, ఒకచేతిలో కమలం కలిగి ఉండి ప్రసన్నముఖంతో ఉన్న గాయత్రీదేవిని ధ్యానం చేస్తూ కనీసం 24సార్లు గాయత్రీమంత్ర జపం చేయాలి. ఎప్పుడు వీలయితే అప్పుడు ఈ వృషాభారూఢ, శ్వేతాంబరధారి మాల, పుస్తకం, కమండలం, కమలం ఆయుధములుగా ఉన్న చతుర్భుజిగా గాయత్రీమాత మన ప్రక్కన ఉన్నట్టు భావన చేయాలి. ఈవిధముగా చేసినట్లయితే పరిస్థితులు అనుకూలంగా మారతాయి.

**వివాహము:**

కుటుంబంలో కన్యలుంటారు. వివాహం కావటంలేదు. రాబోయే వరుడు ఎలాంటివాడో ఈ కాలంలో నిర్ణయించడం కష్టం. అందువల్ల ఆస్తికులైనటువంటివారు కన్యలచేత ఈ సాధన చేయిస్తే వాళ్ళ భవిష్యత్తు చాలా శుభప్రదంగా ఉంటుంది. ఈ సాధనలో గాయత్రీమాత ఫోటోగాని ప్రతిమగాని స్థాపించుకుని గంధం, ధూపం, దీపం, అక్షతలు, పుష్పాలు, జలం నైవేద్యం మొదలైన వాటితో అర్చించాలి. కనీసం 24సార్లు గాయత్రీ జపం చేయాలి. వీరు ఏ పని చేస్తున్నా, చదువుకుంటున్నా, ఉద్యోగం చేస్తున్నా ఆ మాత్రం టైముంటుంది. ఇలా చేస్తున్న కన్యల భవిష్యత్తు ఆనందంగా సుందరంగా తీర్చిదిద్దబడుతుంది.

**ఇతర గృహ సమస్యలు:**

ఒక్కొక్కచోట భర్త అనేక వ్యసనాలకు లోనయి ఉంటాడు. ఇంటికి టైముకు రాడు. ఇంటిలో ఒక యుద్ధవాతావరణ పరిస్థితులు నెలకొని ఉంటాయి. సింహ వాహనంపై పసుపు వస్త్రములతో, త్రిశూలం, డమరు ఆయుధములుగా కలిగిన గాయత్రీదేవిని ధ్యానం చేస్తూ, ఆశీర్వాదం లభిస్తున్నట్లు భావన చేస్తూ రోజూ కనీసం 24సార్లు గాయత్రీ మంత్రజపం చేయాలి **"అధికస్య అధికం ఫలం"**. వీలయితే పసుపు రంగు బట్టలు ధరించి సాధన చేయాలి. వీలు కాకపోతే ఒక తెల్లనిబట్ట పసుపులో ముంచి దానిని ప్రక్కన పెట్టుకోవచ్చు. వీలునుబట్టి ప్రతిరోజు ఒక పసుపురంగు పదార్థము ఆహారంగా తీసుకుంటే మంచిది. శనగపిండితో చేసిన పదార్థాలను పసుపు పదార్థాలుగా స్వీకరించవచ్చు. ప్రతిపౌర్ణమినాడు ఉపవాసముండాలి. ఈ పీతవర్ణ గాయత్రీసాధన దాంపత్యజీవన సుఖానికి పరమోత్తమం. ఒక నెలరోజులపాటు చేసుకుంటే మంచి ఫలితాలు లభిస్తాయి.

**సంతానం కొరకు:**

కొంతమంది సంతానం లేక బాధ పడుతుంటారు. డాక్టర్లు అభిప్రాయం ఎలా ఉన్నా ఈ సాధన చేస్తే మంచి ఫలితాలను ఇస్తుంది. సూర్యోదయ సమయంలో సూర్యుడు ఎర్రరంగులో ఉన్నప్పుడు స్నానం చేయాలి. కటి ప్రదేశానికి క్రింది భాగం తడిగా ఉండాలి. ప్రశాంతంగా కొద్దిసేపు కూర్చుని, సూర్యుని తేజస్సు యోనిమార్గంగా గర్భంలోకి ప్రవేశిస్తున్నట్లు, గర్భ ధారణకు అనుకూలమైన పరిస్థితులు కలుగజేస్తున్నట్లు భావన చెయ్యాలి. యద్భావం తద్భవతి. ఇష్టమున్నవారు బీజాక్షర సహితంగా అంటే **'ఓం భూర్భువః స్వః యం యం యం తత్ సవితుర్ వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్'** జపం చేసుకోవచ్చు. ప్రతిరోజు 24సార్లు గాయత్రీ జపం చేస్తే అద్భుతమైన ఫలితాలనిస్తుంది. ఈ సాధన ఒక సంవత్సర కాలం పట్టవచ్చు. మాటిమాటికి గర్భస్రావమవు

**సంపూర్ణ ఆరోగ్యం అనేది పూర్తిగా మన జీవనశైలి మీద ఆధారపడి ఉంటుంది**

తున్నా. పుట్టిన శిశువులు మరణిస్తున్నా, ఈ గాయత్రీ సాధన మంచి ఫలితాన్ని ఇస్తుంది. ఈ సాధన పెళ్ళికాని కన్యలు చేయరాదు.

**పిల్లల ఆరోగ్యం:**

పిల్లల ఆరోగ్యం సవ్యంగా లేనప్పుడు బిడ్డను ఒడిలో ఉంచుకొని, హంస వాహనంపై శంఖచక్ర ధారిణియై, గులాబి పూలతో అలంకరించుకొని ఉన్న గాయత్రీదేవిని ధ్యానిస్తూ గాయత్రీ మంత్రజపం చేయాలి. తల్లి చేసే జపప్రభావం ఒడిలో ఉన్న బిడ్డపై పడుతుంది. బిడ్డలో ఆశ్చర్యజనకమైన మార్పును చూడవచ్చు. చిన్న బిడ్డ అయితే సాధనా సమయంలో పాలిస్తూ ఉండాలి, పెద్ద వాడయినట్లయితే అతని తలపై, శరీరంపై నిమురుతూ ఉండాలి.

**రోగనివారణ:**

శీతాకాలంలో చల్లదనంవల్ల వచ్చే రోగాలకు **'ఐం'** బీజమంత్రంతో కూడిన గాయత్రీ మంత్రం ఉపయోగించాలి. వృషభవాహనంపై ఆకుపచ్చని వస్త్రాలు ధరించి, చేతులలో డమరు, త్రిశూలం ఆయుధాలుగా ధరించిన గాయత్రీమాతను ధ్యానిస్తూ **'ఓం భూర్భువః స్వః ఐం ఐం ఐం తత్ సవితుర్ వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్'** జపం చేయాలి. రోజుకి 24సార్లు చేసిన చాలు. దీనితో పాటు మిరియాలపొడి, తులసి ఆకులు నీళ్ళతోగాని, పాలతోగాని కలిపి రెండు మూడు గంటలకు ఆరోగ్యతీవ్రతను బట్టి ఇస్తూ ఉంటే లాభదాయకం. అజీర్ణం, గ్యాస్ట్రిక్ ట్రబుల్స్, గ్యాస్ట్రిక్ అల్సర్స్ ఉంటే వృషభ వాహనంపై ఆకుపచ్చ వస్త్రాలతో డమరు, త్రిశూలం ఆయుధాలుగా ధరించిన గాయత్రీదేవిని ధానిస్తూ **"హుం"** బీజమంత్రంతో కూడిన గాయత్రీ మంత్రజపం చేయాలి. **'ఓం భూర్భువః స్వః హుం హుం హుం తత్ సవితుర్ వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్** రోజుకు 24సార్లు జపించాలి. ఇక్కడ కూడా పైన చెప్పిన విధంగా మిరియాలు, తులసి ఉపయోగించాలి.

**పిల్లల చదువు కొరకు:**

పిల్లలకు పరీక్షలలో సవ్యంగా మార్కులు రావడం లేదు. అలాంటి పరిస్థితిలో సమస్య నివారణకు రెండు మార్గాలు న్నాయి. 1) నలుచదరపు మామిడి చెక్క తీసుకొని తీసుకొని పిల్లవాని తలమీద పెట్టాలి. దానిపై మామిడిపుల్లతో నెమ్మదిగా కొట్టాలి. నొప్పి పుట్టేటట్లు కొట్టకూడదు. ఆ విధంగా కొన్ని రోజులు చెయ్యాలి. 2) సూర్యోదయపు వేళలో జుట్టు తడిపి, సూర్య కిరణాలు తలపై పడేటట్లు కొద్దిగా తలవంచి, 108సార్లు గాయత్రీ మంత్రం చెప్పించాలి. ఇక్కడ గాయత్రీ మంత్రానికి మూడు ఓంకారాలు చేర్చి జపించాలి. **'ఓం ఓం ఓం భూర్భువః స్వః తత్ సవితుర్ వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్'** ఈ విధంగా చెయ్యడం వల్ల జ్ఞాపకశక్తి పెరిగి, బుద్ధి వికసించి చదువులో మంచి ప్రగతిని సాధించగలుగుతారు.

ఎవరైతే బుద్ధితీవ్రత పెరగాలి అనుకుంటున్నారో వారు రెండు అరచేతులు సూర్యుని వైపు పెట్టి 12సార్లు పైన చెప్పిన మూడు ఓంకారములతో కూడిన గాయత్రీమంత్రాన్ని ఉచ్ఛరించి, అరచేతులను ఒకదానితో ఒకటి వేడిపుట్టేదాక రుద్దు కోవాలి. ఆ వెచ్చని అరచేతులతో ముఖం, నేత్రాలు, నాశికలు, కంఠం, చెవులు మొదలైన సమస్త శిరోభాగాలను స్పృశించాలి.

**రాజకీయ సఫలత:**

రాజకీయ సఫలత అంటే M.L.A.గాని M.P.గాని అవుతాడని కాదు. ప్రభుత్వంతో జరగవలసిన పని అని అర్థం చేసుకోవాలి. ఏదో ఒక ఆఫీసుకి పనిమీద వెళ్తున్నాం. ఒక ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వెళ్తున్నాం. దానిలో విజయం లభించాలి. లోపలికి వెళ్తున్నప్పుడు ఏ స్వరం (శ్వాస) ఆడుతుందో చూసుకోవాలి. ఎడమ స్వరమైతే ఎడమచేతి బొటనవ్రేలుమీద ఆకుపచ్చని జ్యోతిని, కుడి స్వరమైతే కుడిచేతి బొటనవ్రేలు మీద పసుపుపచ్చని జ్యోతిని ధ్యానం చేస్తూ సప్త వ్యాహృతులతో కూడిన గాయత్రీ మంత్రం **'ఓం భూః భువః స్వః మహః జనః తపః సత్యమ్ తత్ సవితుర్ వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్'** అంటూ 12సార్లు జపం చెయ్యాలి. మీ పనిలో విజయం చేకూరుతుంది.

**దారిద్ర్యం:**

దారిద్ర్యం అంటే డబ్బు లేకపోవడం కాదు. అవసరమైనపుడు ఆ వస్తువు లేకపోవడం. కోటీశ్వరులు ఉంటారు. అవసరానికి ఒక 5 లక్షలు కావాలి దొరకదు. అవసరమైనప్పుడు ఆ వస్తువు లేకపోవటమే దారిద్ర్యం. రావలసిన డబ్బు సమయానికి చేతికి రాదు. ఎవరికో కారు ఇచ్చాం. అది తిరిగి సమయానికి రాదు. ఏదో ఇల్లు కొందామనుకుంటాం. డబ్బుంది కానీ బేరం కుదరడం లేదు. అర్హతలు అన్నీ ఉంటాయి. కానీ ఉద్యోగం

**వెలిగిన దీపమే ఇతర దీపాలను వెలిగించగలదు**

రాదు. దారిద్ర్యం అంటే ఇలాంటి ఇబ్బందులే. ఈ దారిద్ర్యం నివారణకు గజవాహనంపై, పీత వస్త్రధారి (పసుపు వస్త్రములు) అయిన గాయత్రీమాతను ధ్యానం చేస్తూ శ్రీం బీజంతో కూడిన గాయత్రీమంత్రాన్ని ప్రతిరోజు 24సార్లు జపించాలి. **'ఓం భూర్భువః స్వః తత్ సవితుర్ వరేణ్యం భర్గో దేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్ శ్రీం శ్రీం శ్రీం.** పసుపువర్ణం లక్ష్మీదేవికి ప్రతిరూపం. భోజనంలో కూడా పసుపురంగు పదార్థాలను ప్రధానంగా తీసుకోవాలి. ఈ సాధనాకాలంలో అంటే ఉద్యోగప్రాప్తి కానీ ఇంకేదైన లక్ష్యం పెట్టుకుంటే ఆ లక్ష్యం నెరవేరేంతవరకు ప్రతి శుక్రవారం నూనెలో పసుపుకలిపి రాచుకొని, తరువాత స్నానం చెయ్యాలి. ఆదివారం ఉపవాసం ఉండాలి. ఈవిధంగా దారిద్ర్యమును దూరం చేసుకోవచ్చు. కోరినవి సాధించుకోవచ్చు.

**ఇతరులను ప్రభావితం చేయుట:**

కుటుంబంలో పరస్పరం అవగాహన లేకపోవడంవల్ల అనేక ఇబ్బందులకు గురి అవుతుంటాము. అత్తగారితో సమస్య రావచ్చు, భర్తతో సమస్య రావచ్చు. వారు మనలను బాధపెడ్తూ ఉండవచ్చు. ఇలాగే ఆఫీసులో పై అధికారి వేధింపులకు గురి కావచ్చు. ఇలాంటి సమస్యలకు – హంసపై కాని, వృషభంపై కాని కూర్చుని, నీలివర్ణ వస్త్రాలతో అభయముద్ర కలిగిన గాయత్రీమాతను ఊహించుకోవాలి. ఆమె అరచేతి అభయ ముద్రలో నీలిరంగు జ్యోతి – అక్కడ నుండి నీలిరంగు కిరణాలు ఎవరైతే మనకు సుముఖముగా లేరో వారిని చుట్టుముట్టినట్లు ఊహించుకోవాలి. ఈ సాధన మీ ఆవేదన, మీ భావాలు వారికి అర్థం అయ్యేటట్టు చేస్తుంది. ఈ విధమైన ధ్యానంతో 24సార్లు గాయత్రీమంత్ర జపం ప్రతిరోజు చేయాలి. సమస్య పరిష్కారమవుతుంది. ప్రతికార్యంలో మన ప్రయత్నంతోపాటు గురువుల ఆశీర్వాదం చాలా ముఖ్యం. మీరు ఏమి కోరుకున్నప్పటికీ ఈ విద్యను మనకు అందించిన పూజ్యగురుదేవులు శ్రీరామశర్మ ఆచార్య గారిని ఒక్కసారి తలచుకుని మనసారా నమస్కరించుకోవాలి. ఈవిధంగా చేసుకోవడం వల్ల సాధన శీఘ్రంగా ఫలప్రదం అవుతుంది.

## భూలోకంలోనే స్వర్గం-నరకం

*ఒకసారి ఒక గురుశిష్యులు పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నారు. హఠాత్తుగా శిష్యుడు ఒక ప్రశ్న వేశాడు. "గురుదేవా! కొందరు భూలోకంలోనే నరకం అనుభవిస్తున్నారు – అని అంటూ ఉంటారు. అదెట్లా సాధ్యం? దయతో వివరించండి," గురువు కొద్ది సమయం కోసం శిష్యునికి జ్ఞాన చక్షువులు ప్రసాదించాడు. లోకాన్ని పరిశీలించి చూడమన్నాడు. శిష్యునికి ధనమదంతో విర్రవీగుతున్న ధనవంతుడు కనిపించాడు. అతడు అంతులేని సుఖభోగాలు అనుభవిస్తూ, ఎవ్వరికీ రవ్వంత కూడ సాయం చేయకుండా జీవిస్తున్నాడు. కానీ అతనితో ఆప్యాయంగా మాట్లాడేవారే కరువయ్యారు. కుటుంబసభ్యులు కూడా విచ్చలవిడిగా ధనాన్ని ఖర్చుపెడుతూ ఆయనను లెక్కచేయడంలేదు. తెలియని ఒంటరితనంతో మానసికంగా యమ యాతన అనుభవిస్తున్నాడు. తరువాత ఆవేశపరుడైన ఒక యువకుడు కనిపించాడు. అతను తన క్రోధస్వభావంవల్ల చీటికి మాటికి ఎవరినిపడితే వారిని కసురుకుంటున్నాడు. ప్రతిచిన్న విషయానికి కోపం తెచ్చుకుంటూ తనలో తానే దహించుకుపోతున్నాడు. అతనికి స్నేహితులు కరువయ్యారు. తరువాత పరమలోభి అయిన వ్యక్తి కనిపించాడు. అతడు తన లోభత్వంవల్ల అయినవాళ్ళకు, పరాయివాళ్ళకు అందరకు విరోధి అయ్యాడు. అందరు చులకనగా చూస్తూ హేళన చెయ్యడం మొదలుపెట్టారు. ఈ నీచమైన పరిస్థితిని అతడు భరించలేకపోతున్నాడు. మానసికంగా కృంగిపోతున్నాడు. ఈ ముగ్గురు కూడా తమకు తెలియకుండానే భూలోకంలోనే, బ్రతికి ఉండగానే నరకం అనుభవిస్తున్నారు. కానీ పాపం వారికా విషయం తెలియడంలేదు. తప్పును మాత్రం ఇతరులపై రుద్ది మరి కొంత వేదన చెందుతున్నారు. వారిని చూసి శిష్యుడు చాలా జాలిపడ్డాడు. గురువు శిష్యునికి మామూలు దృష్టిని ఇచ్చాడు. శిష్యుని మనస్సులో అనేకమైన ఆలోచనలు మెదలసాగాయి. మానవుడు తనకుతానుగా, తన కోసమే బ్రతుకరాదని తెలుసుకున్నాడు. పరోపకారంచేస్తూ, పరులకోసం జీవించడంలోనే ఆనందం ఉందని గ్రహించాడు. లోభత్వం మనిషిని పతనానికి తీసికొని వెళ్తుందని అర్థం చేసుకున్నాడు. పరిస్థితులను తనకు అనుగుణంగా మార్చుకుంటూ భూలోకంలోనే స్వర్గాన్ని అనుభవిస్తూ హాయిగా జీవించాడు. గురువు ప్రేమగా ఆశీర్వదించాడు.*

**నిరంతరం నేర్చుకునేవారే ఇతరులకు నేర్పగలరు**

సమాజ నిర్మాణం

# వేరును తడిపితేనే మొక్క చిగురిస్తుంది

ఈ ప్రపంచంలో వస్తువుల కొరతలేదు. ఉపయోగపడే పరిస్థితులకు లోటులేదు. విపత్తులు కేవలం దుర్బుద్ధుల వల్లనే ఉత్పన్నమౌతున్నాయి. సద్భావనలకు బదులుగా దుర్భావనలు, మంచి ప్రవర్తనలకు బదులు చెడుప్రవర్తనలు చోటు చేసుకుంటున్నాయి. ఫలితంగా సుఖశాంతులకై, ప్రగతికై ఉపయోగించే వస్తువులను విపత్తులను, చిక్కులను పెంచటానికై ఉపయోగిస్తున్నారు. ప్రగతికి బదులుగా అధోగతిని చేతికి చుట్టుకుంటున్నారు.

జీవితంలోని అన్ని రంగాలలోను, అన్ని వర్గాలలోను చెడు ప్రవృత్తులు లోతుగా నాటుకుపోయాయి. ఫలితంగా అన్ని దిక్కులా కష్టాలను కలిగిస్తూ, సర్వాన్ని భక్షిస్తూ రాక్షసులు నగ్ననృత్యం చేస్తున్నారు. దుర్బుద్ధులతో యుద్ధం చేసేందుకు ఆలోచనా విప్లవమనే గాండీవాన్ని ఎత్తి పాంచజన్యాన్ని పూరించాలి. పరశురాముని గొడ్డలితో చెడు ఆలోచనల తలలను నరికివేయాలి. ఆలోచనల్లో మార్పు లేకుండా సమాజానికి ఆధారాన్ని ఏర్పరచలేం. జ్ఞానయజ్ఞం లేకుండా సుఖశాంతులు సర్వోన్నతమైన ప్రగతిని సాధించే నవయుగనిర్మాణం సాధ్యం కాదు.

యుగ నిర్మాణంలోని మూడవచరణం సమాజ నిర్మాణం. ఆత్మ నిర్మాణం, కుటుంబ నిర్మాణంలాగానే సమాజ నిర్మాణం కూడా యుగనిర్మాణంలో ముఖ్యపాత్ర వహిస్తుంది. ఆలోచనా పరిధిని విస్తరింపచేసి, వ్యాపింపచేయుట సంఘటిత సంస్థల వల్లనే సాధ్యమౌతుంది. ఇది అందరూ కలసి చేయవలసిన పని. యుగనిర్మాణ ఆలోచనాధారతో పరిచయం ఉండి, ప్రభావితులైన జనులు సమాజం కొరకు యుగనిర్మాణ సంస్థలను ఏర్పరచాలి.

ఈ సంస్థల ముఖ్యమైన పని ఆలోచనా విప్లవం యొక్క భూమికను తెలియచేయడం. దీనికై పుస్తకాలయాలు, జ్ఞాన రథాలు, గోడలమీద రాయటం, స్టిక్కర్లు అంటించటం, మందిర స్థాపన మొదలైనవి చేయాలి. ప్రతివారం సత్సంగాలు, కథలు, కీర్తనలు, ఆలోచనాగోష్ఠులు, యుగనిర్మాణ సమ్మేళనాలు, కవితా సమ్మేళనాలు సంగీత సమ్మేళనాలు, గాయత్రీ యజ్ఞాలు, పుట్టిన రోజులు, పెళ్ళిరోజులు, సంస్కారాలు, పండుగలు మొదలైన వాటిద్వారా ఈ ప్రచారాన్ని ముందుకు తీసుకువెళ్ళవచ్చు. చదువుకున్న వారికి సాహిత్యం ద్వారా, చదువురాని వారికి ప్రతిపాదనలను వినిపించి ఆలోచనలను తీర్చిదిద్దే ప్రయత్నం చేయవచ్చు.

### మస్తిష్కాన్ని శుభ్రపరచటమే జ్ఞానయజ్ఞం

మన మస్తిష్కాలను శుభ్రపర్చటానికై చేసే పని పేరే జ్ఞాన యజ్ఞం. అజ్ఞానంతోనిండిన యుగాలలోని అనైతికత, చెడు రీతులు, మూఢ భావాలు, అంధవిశ్వాసాలు, సంకుచిత తత్వాలు ఇప్పుడు కూడా మన మస్తిష్కాలలో నిండి ఉంటాయి. మానవులు స్వార్థపరులుగా తయారయ్యారు. లోక కల్యాణం, పరమార్థ ప్రయోజనం, సమాజ ఉద్ధరణకై మనం ఏం చేయాలనేది మరచిపోయారు, చమత్కారం, స్వర్గం, ముక్తి, కోరికలు పూర్తి కావటమనే ఆలోచనలలో చిక్కుకుపోయారు.

ఈ స్థితిని మార్చటానికై ఆలోచనా విప్లవం ఇతరుల మనస్సులలో ప్రవేశపెట్టడం అవసరం. చెడు ఆలోచనలను తీసివేయడంతోపాటు మంచి ఆలోచనలు, ఆదర్శాలు, కర్తవ్యాలను ప్రేరేపించే తత్వజ్ఞానాన్ని స్థాపించడం అవసరం. యుగనిర్మాణ సాహిత్యం ద్వారా ఈ ప్రయోజనాలను పూర్తి చేయవచ్చు. వ్రాయటం, చెప్పటం ఈ రెండింటిని జ్ఞాన యజ్ఞాన్ని పెంపొందించేందుకు ఉపయోగిస్తున్నారు. మనం కూడా ఈ సంస్థల ద్వారా, ప్రచార కార్యక్రమాల ద్వారా ఉత్సాహంతో మన భావాలను వ్యక్తీకరించవచ్చు.

సమాజ నిర్మాణానికి ఆధారభూతమైన సంస్థలు ప్రచారానికి ముందు ఎక్కడ స్థాపించబడ్డాయో తరువాత కూడా అక్కడే పనులను చేపట్టాలి. ప్రణాళికా వ్యవస్థను ఏర్పాటు చేయాలి. సామూహిక శ్రమదానపరంపర ఎక్కడ సాగుతుందో అక్కడ అనేక రచనాత్మక కార్యాలు సహజంగానే వృద్ధి పొందుతాయి.

ఈ ఈ కార్యక్రమాలతో చెడు రీతులను, అనైతికతలను

**మనకు ఉన్న జ్ఞానాన్ని పదిమందికి పంచితే ఎంతోమేలు చేసిన వాళ్ళమవుతాము**

ఖండిస్తూ సమరం సాగించటం అవసరం. పెళ్ళిళ్ళలో జరిగే అనవసర ఖర్చు కట్న-కానుకలను నిరోధించటానికై మనం యుద్ధ ప్రాతిపదికన తీవ్రమైన ఆందోళనలు లేవదీయాలి. దేశాన్ని నిరంతరం పీడిస్తున్న అనైతికతను, దారిద్ర్యాన్ని పెంచుతున్న ఈ అనాచారాలను అన్ని విధాలా ఎదిరించాలి. భిక్షా వ్యవస్థను, భూతప్రేతాలు, అదృష్టాలు, ధర్మం పేరుతో పశుబలులు, బాల్యవివాహాలు, జాతులు, జన్మలపేరుతో ఎక్కువ తక్కువలు, ఆడ పిల్లల మగపిల్లల మధ్య వ్యత్యాసం, స్త్రీలను, శూద్రులను తక్కువగా చూడటం మొదలైనవాటిని వెంటనే తొలగించాలి. నైతికంగా మాంసాహారం, మద్యం, బద్ధకం, పనిపట్ల అగౌరవం, పశువుల పట్ల నిర్దయ, భ్రష్టాచారాలు, దొంగతనం, మోసం, లంచగొండితనం, ఎక్కువలాభాలు తీసుకోవడం, అధిక సంతానం, అనవసర ఖర్చులు, సామాజిక కర్తవ్యాలపట్ల ఉదాసీనత, సమయాన్ని దుర్వినియోగం చేయడం, విశృంఖలత్వం మొదలైన అనేక చెడు ప్రవృత్తులు ప్రచారంలో ఉన్నాయి. వీటిని సహిస్తూ ఉంటే ఈ కేన్సర్‌తో సమాజమనే శరీరమంతా కుళ్ళిపోతుంది.

అన్ని క్షేత్రాలలోను అనాచారం వ్రేళ్ళూనుకుంటూ వస్తోంది. వీటివలన కలిగే నష్టాలను గురించి తెలిపి ప్రజలను చైతన్య వంతులను చేయాలి. లోకుల మనస్సులలో అవాంఛనీయమైన వాటిపట్ల అయిష్టాన్ని కలిగించాలి. ఈవిధమైన సంఘర్షణలను ముందుకు తీసుకువెళ్ళేవారు అనేక రకాలైన ఆక్రమణలను, దెబ్బలను ఎదుర్కొనవలసి ఉంటుంది. వీటిని సహనంతో భరించేందుకై ఎవరిలో ధైర్యం, శౌర్యం, సంయమనం, సాహసం ఉంటాయో వారు ఈ ఉద్యమాలను నిర్వహించాలి. సాధారణంగా 8 గంటలు జీవనోపాధికి, 7 గంటలు నిద్ర, విశ్రాంతికి, 5 గంటలు ఇంటిపనులు, శారీరక శ్రమ అన్నీ కలిపి 20 గంటలు. ఈవిధంగా ఖర్చుచేస్తే మిగిలిన 4 గంటలు సమాజ నిర్మాణానికై పైన చెప్పిన నాలుగు పద్ధతుల ద్వారా వినియోగించాలి. ప్రతి రోజు ఒక గంట సమయాన్ని, ఒక రూపాయిని ప్రారంభ సభ్యత్వ రుసుముగా నిర్ణయించుకోవాలి. సంతానంలో ఒక్కరు ఎక్కువగా ఉన్నట్లయితే వారి భారాన్ని పోషణను ఏవిధంగా భరిస్తామో అదేవిధంగా విశాల హృదయంతో యుగపరివర్తనను కూడా దేవతగా భావించినట్లయితే బీదవారు కూడా ఈ మహా ప్రయోజనంలో పాలుపంచుకోగలుగుతారు.

కుటుంబ బాధ్యతల నుండి ముక్తి పొందినవారు, సంపాదనాపరులైన పెద్ద పిల్లలు వారి కంటే చిన్న పిల్లల నిర్వహణ బాధ్యతలను భరించగలిగితే పూర్తి సమయాన్ని లోక కల్యాణం కోసం ఉపయోగించాలి. అవకాశం ఉన్నవారు పెన్షన్, ఫండ్స్ మొదలైనవాటితో తమ బాధ్యతలను నిర్వహిస్తూ ఉండాలి. సాధువులు, బ్రాహ్మణులు ప్రాచీన పరంపరను పునర్జీవింప చేయటానికై మనలోని ప్రతి ఒక్కరు జీవితంలోని అంతిమ భాగాన్ని వానప్రస్థ ప్రయోజనాలకై సమర్పించాలి. ఎవరి అంతరాత్మలో ఆదర్శవాదమైన ఆలోచనలు ఉప్పొంగుతాయో, లోకకల్యాణం కోసం అనుసరణీయమైన ఆదర్శాలను ఏర్పర్చగల కాంక్ష జాగృతమవుతుందో వారే యుగనిర్మాణ వ్యాపకత్వాన్ని, ప్రయోజనాన్ని సాహసంతో సాధించగలరు.

ఆత్మ నిర్మాణం, కుటుంబ నిర్మాణం, సమాజ నిర్మాణమనే మూడు విధులను సుసంపన్నం చేస్తూ, యుగనిర్మాణ సాధనలను పూర్తిచేయగలగాలి.

★★★

## ముందు మిమ్మల్ని మీరు తీర్చిదిద్దుకోండి

*ఎవ్వరైతే తమను తాము తీర్చిదిద్దుకున్నారో వారి జీవన విధానము వారిని అత్యంత సమర్థులనుగా తయారు చేసింది. అంతేగాక వారి వ్యక్తిత్వ వికాసం ఇతరులను కూడా సూదంటూ రాయిలా ఆకర్షించింది. గాంధీజీ, బుద్ధుడు తమను తాము తీర్చిదిద్దుకున్నారు. తత్ఫలితంగా వేలాదిమంది వారిని అనుసరించి నడిచారు. సమాజసేవ చేయుట మంచిదే. కానీ దీనికన్నా ముందుగా మీ వ్యక్తిత్వాన్ని సుసంపన్నం గావించుకొనుట ఎంతో అవసరము. మిమ్ములను మీరు సుదృఢం గావించుకోవాలి. మిమ్ముల మీరు ప్రక్షాళన చేసికోవాలి. మిమ్ముల మీరు పరిశుభ్రం గావించుకోవాలి. మిమ్ముల మీరు వికసింప చేసుకోవాలి. మిమ్ముల మీరు ప్రప్రథమంగా సమర్థులైన ఒక పనిముట్టుగా మలచుకోవాలి.*

*- పూజ్యగురుదేవుల వాఙ్మయం నుండి*

*అనువాదం : ఎ. వేణుగోపాలరెడ్డి*

**ఆరోగ్యంగా జీవించడంలోనే ఆనందం ఉన్నది**

# ఈ శతాబ్దికి అధిష్ఠాత - సూర్యుడు

ఈ బ్రహ్మాండములో భూమండలస్థాయికి చెందిన గ్రహము ఎంత వెతికినా కనిపించదు. ఇంత సుందరమైన, సువ్యవస్థితమైన, సునియోజితమైన, అగణితవిశేషతల స్థాయికి చెందిన గ్రహము ఎంత వెదికినా కనిపించదు. స్వర్గలోకము గురించి ఊహించ వచ్చు, కానీ భూలోకములో ఉన్నన్ని విశేషతలు, విచిత్రములను స్వర్గలోకములో కూడా ఊహించలేము. ఇందుమూలంగానే 'స్వర్గాదపీ గరీయసి' అనే నానుడి వచ్చింది. మన సౌర మండలంలో ఎన్నో గ్రహములు, ఉపగ్రహములు కనుక్కో బడినవి. వాటిలో చాలా గ్రహాలు ఆకారము దృష్టితో చూస్తే పృథ్వికంటే ఎన్నో రెట్లు పెద్దవి, కానీ ప్రాకృతికశోభ, ప్రాణి సముదాయము, వృక్షములు, వనస్పతులు మొదలైనవాటితో ఉండే పృథ్వికి ధీటైన గ్రహము మరొకటి లేదు. ఋతువుల యొక్క ఇటువంటి పరివర్తన అన్యత్రా ఎక్కడా సంభవము కాదు. లెక్కలేనన్ని శక్తుల విశేషతలు, విభూతుల భాండా గారముగా చెప్పబడుతున్న మనిషివంటి ప్రాణి ఇతరత్రా లభించుట కూడా సర్వదా దుర్లభమే. వీరిలో చాలామంది నిద్రాణస్థితిలోనే ఉంచవచ్చుగాక.

అన్యగ్రహములతో పోలిస్తే చిన్నదైన పృథ్విలో ఇంతటి సౌందర్యము, సౌష్ఠవము ఏ విధంగా సంభవమయినాయి? ఇందుకు గల భౌతిక కారణాలను పరిశీలిస్తే ప్రముఖంగా ఒకే తథ్యము మనముందుకొస్తుంది. అదేమిటంటే సూర్యుడు పృథ్వినుండి ఎంత దూరములో ఉండాలో సరిగ్గా అంతే దూరములో ఉండటము వలన ఇటువంటి పరిస్థితులు సంభవ మయ్యాయి. ఒకవేళ దూరము తక్కువగా ఉన్నట్లయితే పృథ్వి అగ్నిగుండముగా మారిపోయేది. ఒకవేళ కొంచెం దూరంగా ఉన్నట్లయితే చలి అధికముగా ఉండి ఎటువంటి కదలికలు దృష్టికి గోచరమయ్యేవికావు. సునిశ్చిత దూరము అనే సుయోగమువలన భూమి ఇన్ని విశేషతలను సంతరించు కోగలిగింది. ఈ విశేషతలు బ్రహ్మాండములో ఎంత వెతికినా ఎక్కడా కనిపించవు.

తత్త్వదర్శుల నుండి విజ్ఞానవేత్తల వరకు **'సూర్య ఆత్మ జగతఃస్థుషస్చ'** అనగా 'సూర్యుడు సమస్త జగత్తుకు ఆత్మ' అని ఒకే స్వరముతో ఒప్పుకుంటారు. పృథ్విపై ఆధిపత్యము సూర్యునికే ఇవ్వబడింది. ఈ తథ్యమును పతి-పత్ని, ప్రియురాలు-ప్రేమికుడులాంటి అనేక అలంకారములతో వేదాలతో అభివ్యక్తము చేయబడినది.

సూర్యుని కిరణములు భూమిపై పడినప్పుడు ఆ క్షేత్రములో ఉత్సాహము, పరాక్రమము ఉరకలు వేస్తాయి. వనస్పతులలో, ప్రాణులలో, పదార్థములలో కదలిక మొదలవుతుంది. సూర్యుడు అస్తమించగానే అందరిని సోమరితనము, అలసట, నిద్ర, అకర్మణ్యత ఆవరిస్తాయి. కదలికలు ఆగి విశ్రాంతి స్థితికి వెళ్ళిపోతాయి. సూర్య కిరణములు ప్రసరించని ప్రదేశాలలో తేమ, కుళ్ళుట, నీరసము, నిస్తబ్దత ఆవరించి ఉంటాయి. ఇటువంటి ప్రదేశాలలో విషాణువులు పెరుగుతాయి. ఎక్కడ సౌరఊర్జ ఎంత ప్రసరిస్తుందో అక్కడ అంత బలిష్ఠ, సుదృఢ వాతావరణము దృష్టిగోచరమవుతుంది.

శబ్దము, ప్రకాశము, వేడి అనేవి మూడు ప్రముఖ తత్త్వములుగా ఈ ప్రపంచములో చెప్పబడినాయి. అణువులు-పరమాణువులు మరియు వాటి ఘటకములతోపాటు తమతమ క్షేత్రములలో పరిభ్రమణము చేస్తూ నిరంతరం విభిన్న పదార్థముల స్వరూపములను ఈ తరంగములే నిర్మిస్తూ ఉంటాయి. వస్తువులు అనేక రంగులతో కనిపిస్తాయి. ఈ రంగులు ఎక్కడనుండి వస్తున్నాయి? సమాధానము సుస్పష్టము. వస్తువులు లేదా చెట్లు తమ అనురూపమైన కిరణములయందు ఉన్న రంగులను పీల్చుకుని అదే రంగుగలవిగా అవుతాయి. రంగులను తయారు చేయగలిగేది సూర్యుడొక్కడే. ఆయననే ఈ భూమిని విభిన్న ఘటకాలతో తన ప్రణాళిక ప్రకారము చిత్రకారుడులాగా రంగులతో నింపి తనలోని అద్భుత కళాకారుడిని మనకు పరిచయము చేశాడు.

పృథ్విపై అనేక రసాయనాలు లభ్యమవుతాయి. వాటి ఆధారంగానే వనస్పతులు, ప్రాణులయొక్క శరీరాలు నిర్మించ బడతాయి. ఈ రసాయనాలు కూడా సూర్యుడు మరియు పృథ్వి యొక్క సంయోగము వలన తయారవుతాయి. వాటినే మనము తినే పదార్థములనుండి పదార్థజగత్తు వరకు అనేక

**ఆరోగ్యం లేనప్పుడు ఎన్ని ఉన్నా ఉపయోగం ఉండదు**

ఇతర క్షేత్రములలో అంకురించి, పెరిగి తమదైనశైలిలో పని చేస్తూ చూడవచ్చు. వైజ్ఞానికుల ప్రకారము పృథ్విపై జీవన తత్త్వము ఎంత వికసించిందో, ఎన్ని కదలికలు ఉన్నాయో వాటన్నింటికి కేంద్రము సూర్యశక్తితోనే సన్నిహితమై ఉంటుంది. యాంగ్‌స్ట్రామ్ మరియు హ్యాగనిన్స్ వంటి వైజ్ఞానికులు తేల్చిన విషయము ఏమిటంటే సూర్యప్రభయందు సోడియం, కాల్సియమ్, బేరియమ్, జింక్, కాపర్, ఐరన్, మేంగనీస్, కోబాల్ట్, కాడ్మియమ్ వంటి ధాతువులను నిర్మించగలిగే సామర్థ్యము ఉన్నది. మానవీయ జీవనీశక్తి కూడా సూర్యుని నుండి ప్రాప్తించిన అనుదానమే. దీని లేమి వలననే మనిషి రోగగ్రస్తుడౌతాడు.

మానవుని శరీరములో అనేకానేక ప్రవృత్తులకు చెందిన జీవకోశికలు, ఊతకములు (ప్లెక్సెక్), క్షారములు, ప్రోటీన్స్, హార్మోన్స్, విటమిన్స్ మొదలైనవి లభిస్తాయి. ఇవన్నీ ప్రకృతి యొక్క అనుదానాలుగా భావిస్తాము. సూక్ష్మదృష్టితో చూస్తే ఈ భిన్నతలు ఆ ఆ స్థలాలలో సూర్యప్రభావము ఎంత స్థాయిలో, ఎంత పరిమాణములో, ఎంత వేగముగా పడుతోంది? అక్కడ ఏ ఘటకాలతో కలసి ఏ ప్రభావముతో మిశ్రితమై ఏ ప్రతిక్రియ ఉత్పన్నం చేస్తోంది అనేదాని మీద ఆధారపడతాయి. రసాయనాలతో పదార్థముల నిర్మాణము జరగడము చూస్తున్నాము. కానీ నిజానికి రసాయనాలు కూడా సూర్యకిరణముల ద్వారానే ఉత్పన్నమౌతాయి.

సృష్ట్యాది మొదలు ఇప్పటివరకు పృథ్విపై ఉన్న వాతావరణంలో, ప్రాణులలో, పదార్థములలో, ఋతువులలో చిత్రవిచిత్రమైన పరివర్తనలు జరుగుతూనే ఉన్నాయి. ఇందుకు మూలము పృథ్వి మరియు సూర్యుని మధ్య జరిగే ఇచ్చి పుచ్చుకోవటాలు, వాటివల్ల ఉత్పన్నమయ్యే ప్రతిక్రియలో మార్పు రావడమే ప్రముఖ కారణము. ప్రకృతి యొక్క పరిస్థితి ఏవిధముగా మారుతోంది, దానికి కారణమేమిటి అనేది శోధిస్తే బహిర్గతమైన సత్యమేమిటంటే రెండు గ్రహముల మధ్య వచ్చే మార్పులే ఈ ఎగుడుదిగుడులకు అసలు కారణం.

భవిష్యత్తును గురించి ఆలోచిస్తే సూర్యశక్తిని రాబోయే రోజులలో ఎంతవరకు, ఏ విధంగా ఉపయోగించడము సంభవమవుతుంది అనేదానిపై దృష్టి సారించాల్సివస్తుంది. మానవుని అన్ని ఆవశ్యకతలు 'శక్తి' (ఊర్జ)పై ఆధారపడినవే. భోజనము తయారీ, ధాతువులు తయారీ, జలయానము, భూయానము, వాయుయానము, కర్మాగారములను నడిపించుట, భూమినుండి నీరు వెతికితీయుట మొదలైన అనేక పనులకు ఇస్తానుసారము వాడే ఊర్జకు ప్రత్యామ్నాయము ఎక్కడినుండి లభిస్తుంది? దీనికి ఏకైక ఆధారము సూర్యుడే అని ప్రత్యుత్తరమివ్వాలి.

సూర్యుడు మెరుపుతో, వేడితో కూడిన ఒక రూపము అని అందరికీ తెలిసినదే. రెండవది ఆధ్యాత్మిక స్వరూపము అది అంతఃకరణములో ప్రేరణ, ప్రకాశము, సాహసము, ఉత్సాహము, పరాక్రమము ప్రసాదించుటతో సమర్థత కలిగి ఉంటుంది. దానిని ఆధ్యాత్మిక భాషలో 'సవిత' అని పిలుస్తాము. సూర్యుడు జడ అగ్నిపిండముకాదు. మీదుమిక్కిలి సచేతన ప్రాణశక్తి, ఆవాహనంతో ఆకర్షించినట్లయితే అది సాధకునికి ఓజస్సు, తేజస్సు, వర్చస్సులను ప్రసాదించుటలో సమర్థత కలిగి ఉంటుంది. కుంతీదేవి ఈ శక్తిని ఆవాహన చేసి సూర్య పుత్రుడు అయిన కర్ణుడికి జన్మనిచ్చింది. కర్ణుని శరీరానికి, మనస్సుకి కవచ-కుండలముల రూపములో ఈ సూర్య-సవితా శక్తియే రక్షణ కల్పించింది. అనేక ఇతర సందర్భాలలో మన పురాణేతి హాసాలలో సూర్యుని అనుగ్రహం ప్రాప్తించుకున్న సామర్థ్యములు వర్ణించబడి ఉన్నవి. రఘువంశీయుల ఆరాధ్య దైవము సూర్యుడే.

నవయుగములో జనమానసములను సంస్కరించుటకు ప్రఖర ప్రతిభాసంవర్ధన ఎంతో ఆవశ్యకము. మహామానవులను తయారుచేసి, వారిని వికసింపచేయుటకు సవిత యొక్క చేతన శక్తి ప్రయోగము మాత్రమే కోరదగినది. ఇందుకొరకు ఈ రోజులలో ఉచ్చస్తరీయ ఆత్మలు తమ సూక్ష్మశరీరములతో విశేష ప్రయోగములతో ప్రయత్నము చేస్తున్నారు.

ఈ రోజులలో అణ్వాయధాలనుండి ఉత్పన్నమయ్యే రేడియో ధార్మికతను ఎలా ఎదుర్కొనాలి, అనే విషయముపై ప్రసిద్ధ దార్శనికుడు ఆర్థర్ కోస్లర్ కూడ ఆధ్యాత్మిక ఉపచారములనే ఆశ్రయించాలని చెప్పాడు. బ్లిట్జ్ పత్రిక సంపాదకులు శ్రీ కరంజియాకి ఆయన చెప్పిన విషయములను పత్రిక "నవనీత" (మార్చి 1983)లో ప్రచురించింది. తన అభిప్రాయము తెలుపుతూ ఆయన, 'అణ్వాయుధాలకంటే ఎక్కువ సామర్థ్యము సావిత్రి-సవితా మంత్రమైన గాయత్రీమంత్రములో ఉన్నది'

**ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే మన ప్రథమ లక్ష్యం కావాలి**

అన్నారు. ఆయన విశ్వములోని కోట్లాది భారతీయులు గాయత్రీ మంత్రమును ఒకేసారి పురశ్చరణరూపముగా చేసినట్లయితే, ఆ అనుష్ఠానము నుండి ఉత్పన్నమైన ఊర్జ, బ్రహ్మాండములోని సూర్యుని కూడా ఛేదించగలిగే మిసైల్ అంత పనిచేస్తుంది. ఇంకా 'భర్గ'తో కలసి అణుశక్తిని కూడా నాశనము చేయగలదు.

ప్రాచీన కాలంలోని ఋషులవలె రాబోయే రోజులలో ఈ కాలానికి చెందిన తత్త్వజ్ఞానులు అనుభవపూర్వకంగా మానవమానసము ప్రకృతిలోకూడా ఈ మహాశక్తి ఉపయోగించి అవసరమైన పరిష్కారాలు, పరిమార్జనలు, పరివర్తనలు చేయుట సంభవమని తెలుసుకుంటారు. సూర్యపురాణము, అక్షుణ్యోపనిషత్తు, ఆదిత్యహృదయము మొదలైనవాటిలో సూర్యునియొక్క విశిష్ఠ క్షమతలు, సామర్థ్యము గురించి చెప్పబడినది. మరియు వాటిద్వారా జరిగే అనేక చికిత్సలకు సంకేతాలు ఇవ్వబడ్డాయి. శరీరము, మనస్సు మరియు భావ సంవేదనలకు ఈ శక్తిద్వారా ఉచ్చస్తరీయ లాభములను అందజేయవచ్చును. ఈ ప్రతిపాదనలకు సంబంధించి జరిగే పరిశోధనలు కాదనజాలనివిగా నిరూపించబడతాయి. రాబోయే రోజులలో సూర్యవిజ్ఞానమే ప్రముఖపాత్ర వహిస్తుంది. మీదుమిక్కిలి మానసోపచారముగా కూడా పనికొస్తుంది. సూర్య నమస్కారములు, సూర్యభేదన ప్రాణాయామములు, సూర్యోవ స్థానముల విధి ఉపచారముల అనుమానరహిత పరిణామములు అందరి ముందు ఉన్నాయి. దీనివల్ల సూర్యశక్తిపై విశ్వాసము పెరుగుతుంది.

## సూర్యధ్యానంతో పరిస్థితులను అనుకూలంగా మార్చుకోవచ్చు

ఎవరికి ఈ ప్రతిపాదనలపై దృఢవిశ్వాసము ఉన్నదో వారికొరకు సార్వజనీన ఉపాసనా విధానము తయారు చేయబడినది. అది ఈ ప్రకారంగా ఉంటుంది. **బ్రహ్మ ముహూర్తములో నిద్రలేచి యథాశక్తి శరీరమును మనస్సును శుద్ధిపరచుకొని కనులు మూసుకుని ప్రాతఃకాలంలో ఉదయిస్తున్న స్వర్ణిమ సవితను ధ్యానము చేయాలి. ఆ స్వర్ణిమ సూర్య కిరణములు తమ శరీరము లోపలికి ప్రవేశించడము వల్ల శరీర స్థితి చంద్రునివలె అవుతున్నదని భావన చెయ్యాలి. సూర్యునినుండి ప్రకాశమును గ్రహించిన చంద్రుడు మెరుస్తూ, తన శీతల ప్రకాశముతో రాత్రిని ప్రకాశింపజేసి అమృతమును కురిపిస్తాడు. ధ్యానస్థితిలో భావన ఎలా ఉండాలి అంటే సూర్య కిరణములు సాధకుని శరీరములో ప్రవేశించినాయి. శరీరములోని అంగ ప్రత్యంగములలో చంద్రుని అమృతజ్యోతి నిండిపోయింది. ఈ జ్యోతి ప్రపంచమంతా వ్యాపించి అమృత జ్యోతితో నిండిన వాతావరణమును నిర్మిస్తోంది. దానితో పదార్థములు, ప్రాణులు అనుప్రాణితమవుతున్నాయి. ఉపయోగకర వాతావరణములు నిర్మించబడుతున్నాయి. అవాంఛనీయతలు తొలగిపోతున్నాయి.**

గాయత్రీ మంత్రము, సూర్యమంత్రము. ఎవరికి గాయత్రీ మంత్రముపై శ్రద్ధ ఉంటుందో వారు పైన చెప్పిన ధ్యానముతో పాటు గాయత్రీమంత్రమును మానసికంగా జపించవచ్చు. ఎవరికి మంత్రజప విధానము నచ్చదో వారు కేవలము సూర్య కిరణములను తమ శరీరములోకి ఆవాహన చేసి దాని మూలముగా తయారయ్యే చంద్రోపమశరీరముతో అమృత జ్యోతి వితరణ ధ్యానమును మాత్రమే చేసుకుంటూ ఉండవచ్చు.

దీనికొరకు 15 నిమిషాల సమయమే నిర్ధారించబడినది. కారణము అందరు దీనిని ఆచరించుటకు వీలుగా ఉండాలి. ఒకే భావన ఒకే సమయములో లక్షల, కోట్లమంది కలసి చేస్తే ఆ సంయుక్తశక్తి నుండి ఉద్భవమయ్యే సూర్యచేతన మానవ సమాజముపై అధిక అనుగ్రహమును కురిపించగలదు, ఇటువంటి నమ్మకము మనకు ఉండాలి.

*- క్రాంతిధర్మి సాహిత్యం-2 నుండి*


దైవీశక్తుల తోడ్పాటుకై
కష్ట నష్టముల నివారణకై
చేసిన కృషి సత్ఫలితములనిచ్చుటకై
జ్ఞానము, సంపదల ఆర్జన కొరకై
జీవితంలో స్థిరపడుటకై

యుగశక్తి  గాయత్రి

మాసపత్రిక చదవండి !
చదివించండి !!

ప్రతుల కొరకై సంప్రదించండి:
ఫోన్: 040-23700722, 9949111175


**సోమరితనం వదలి పురుషార్థివి కావాలి**

రంగుల విజ్ఞానం

# రంగులలో అందమే కాదు శక్తి కూడా ఉన్నది

రెండవ ప్రపంచ యుద్ధం జరిగినప్పుడు రంగుల యొక్క ప్రభావం గురించి ఎన్నో విషయాలు వెలుగులోకి వచ్చాయి. "జీవితంపై రంగుల ప్రభావం" అనే విషయంపై చాలా దేశాలు పరిశోధనలు చేసాయి. వేరు వేరు రంగులు వేరు వేరు విధాలుగా మనో భావాలను మేల్కొల్పుతాయని, వాటిలో చమత్కారమైన శక్తి ఉందని కనుగొన్నారు. పెళ్ళిళ్ళకి, ఉత్సవాలకి, పర్వదినాలకి గుమ్మాలకి ఆకుపచ్చగా, పసుపు పచ్చగా, ఎర్రగా, నీలం రంగులో తోరణాలు కట్టి అలంకరించడం మన దేశంలో ఆచారం. అలా గుమ్మానికి రంగు రంగుల తోరణాలు కట్టడం వలన ఆ ఇంటికి సంబంధించిన వ్యక్తులకే కాక అక్కడకు వచ్చిన వారికి ఆనందం కలుగుతుంది. ఇది రంగులలోని రహస్యం.

జర్మనీలో కెమెరాలు తయారుచేసే ఒక ఫాక్టరీలో ఒక ప్రయోగం చేశారు. ఆ ఫాక్టరీలో గోడలు, దర్వాజాలు, తలుపులు, కిటికీలు అన్నిటికి ముదురు నీలం రంగు వేశారు. ఆ నీలిరంగు ప్రభావం వలన అక్కడి కార్మికులు పూర్వంకంటే ఎక్కువ వేగంగా పని చేయడం ప్రారంభించారు. ఉత్పత్తి పెరిగింది, రాబడి పెరిగింది. తరువాత దానిపైన ఏదో నల్లరంగు పూసారట దాని ప్రభావం వలన జరిగి కార్మికులలో నిరాశ, ఆలస్యం, ఉద్వేగం పెరిగి ఉత్పాదన పూర్తిగా పడిపోయింది.

చెప్పవచ్చేదేమంటే అందానికి, అలంకారానికి రంగులతో గట్టి సంబంధం ఉంది. సౌందర్యం అనేది ఆత్మకి సంబంధించిన ఒక గుణం. దానిని గురించి తగినంత వివరంగా తెలుసుకోలేకపోతే లాభం బదులు హాని జరగవచ్చు. ఇల్లు, గుమ్మాలు, కిటికీలు, గోడలపై చిత్రించే లతల రంగులు, వస్త్రాల రంగులు ఇవి ఏ రంగులో ఉంటే మనస్సులో ఎటువంటి భావాలు రేకెత్తిస్తాయి తెలుసుకొని ఉపయోగించుకుని, లాభం పొందవచ్చు.

కొంతమందికి ముదురు ఎరుపురంగు ఇష్టం ఉండదు. ఒక మానసిక చికిత్సకుని దగ్గరకి ఒక వ్యక్తి వచ్చి "నా బుర్రలో ఎప్పుడూ ఏదో సంక్షోభంగా ఉంటుంది, ఆవేశంగా ఉంటుంది. కారణం తెలియడంలేదు" అన్నాడట. చికిత్సకుడు సూక్ష్మంగా అన్ని విషయాలు పరీక్షించినా కారణం అతనికి కనిపించలేదు. ఒక రోజు ఆ డాక్టరు ఆ రోగి ఇంటికి వెళ్ళడట. వాళ్ళ ఇంట్లో గుమ్మాలకి, కిటికీలకి ఎర్రటి రంగు తెరలు వ్రేలాడుతున్నాయట. వాకబుచేస్తే ఆ రోగి భార్యకూడా ఎక్కువగా ఎరుపు రంగులు దుస్తులే ధరిస్తుందని తెలిసింది. ఇంట్లో ఉన్న ఎర్ర రంగు తెరలన్నీ తీసివేసి నీలం, ఆకుపచ్చ రంగుల తెరలు వేయమని సలహా ఇచ్చాడట వైద్యుడు. భార్య కూడా ఎర్రరంగు దుస్తులు వేయడం మాని వేరే రంగులు ధరించడం ప్రారంభించాక ఫలితాలు ఆశజనకంగా మారాయి. రోగి ఉద్విగ్నత, బాధ తగ్గసాగాయి.

భగవతి సరస్వతి జ్ఞానానికి, మాధుర్యానికి దేవత. ఆమె రూపకల్పనలో రంగులకి విశేష మహత్వం ఉంది. ఋషులు ఆమెను **యాకుందేందు తుషార హార ధవళా యా శుభ్ర వస్త్రావృతా** అని వర్ణించారు.

ఇక్కడ శ్వేత వర్ణం అంటే జ్ఞానానికి, గంభీరతకు, పవిత్రతకు చిహ్నము. అందువలననే పెళ్ళికాని కన్యల, విధవలను శ్వేత వస్త్రాలను ధరించమంటారు. అటువంటి వారిని చూస్తే ఎదుటివారిలో ద్వేషభావము, దుర్భావము రాదు, ఇందువలన విద్యాలయాలకు వెళ్ళేవారు శ్వేత వస్త్రాలు కాని, లేత రంగు దుస్తులు కాని ధరించాలి.

నీలం రంగులు ధరించిన వానిని చూస్తే ఉదారతా, సౌందర్య ప్రేరణ కలుగుతుందట. మాధ్యమిక తరగతుల విద్యార్థులపై నీలం రంగు ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. ఈ వయస్సు అబ్బాయిలకు, అమ్మాయిలకు నీలం రంగు వస్త్రాలు ధరింపచేస్తే అత్యంత లాభాన్నిస్తుంది అంటున్నారు పరిశోధకులు. **ట్యూబ్ లైటు ప్రకాశం నీలం రంగులో ఉంటే దోమలు పారిపోతాయని అమెరికాలో ఒక ప్రయోగం వల్ల తెలుసుకొన్నారు.** నీలం రంగు దోమలకి బాధాకరంగా ఉంటుందట. అక్కడ బూడిద రంగు ప్రయోగం చేసి ఇతర కీటకాల్ని రక్షించడంలో కృతకృత్యులయ్యారట.

ఎరుపు రంగంటే ఆక్రమణ, హింస, స్ఫూర్తికి ప్రతీక అని చెప్తారు. ఆంబోతుకు ఎర్రరంగు చూపిస్తే కంగారుపడుతుంది రెచ్చగొట్టబడుతుంది. నారింజ రంగు వీరత్వానికి, బలిదానానికి ప్రేరణనిస్తుంది. అందుచేత యుద్ధాలలో దీనిని ఉపయోగిస్తారు. మిలటరీలో ఉండే పెద్ద పెద్ద ఆఫీసర్ల భుజాలపై ఎర్రరంగు పట్టీ పెడతారు, టోపీపైన ఎర్రరంగు పట్టీలుంటాయి. వాటిని చూసి జవాన్లలో, రోషము, ఉషారు ఉద్భవిస్తాయి. ఈ రంగు వ్యక్తిగతంగా, కుటుంబంలో ఉపయోగించేది కాదు. నలుపు, బూడిదరంగు శక్తికి ప్రతీకలు. కానీ వీటిని అలంకారాలలో పాక్షికంగానే వాడతారు.

జీవకోటిని ప్రభావితం చేయడంలో గులాబీరంగుకి అగ్రస్థానం ఉందనే విషయం విదితమే! గులాబీ రంగు ప్రకాశంలో చెట్లు బాగా పెరుగుతాయి. పక్షులు వృద్ధి పొందుతాయి. జ్వరము, అటలమ్మ, జలకేసర మొదలయిన రోగాలపై గులాబి ప్రకాశం వలన ఆశాతీతమైన లాభాలు గోచరించాయి.

**మన స్వార్థం కంటే ఇతరుల అవసరాలు గుర్తుంచుకోవాలి**

ప్రసిద్ధ జీవ శాస్త్రజ్ఞుడు విక్టర్ ఇన్యూషియన్ మాలిక్యులర్ బయాలజీలో కొత్త ప్రయోగాల వలన "గులాబీ ప్రకాశంలోని జీవన కార్యకలాపాలకి ఆత్మ ప్రకృతితో కలయిక ఉంది" అని నిర్ధారించారు. 'ఆల్బర్ట్ జెంట్ జోజీ" (నోబుల్ పురస్కార విజేత – బయోకెమిస్ట్) "ప్రతి ప్రాణికి సంవేదన శీలతకు దాని స్థిరత్వానికి గులాబీరంగు చాలా అనుకూలిస్తుంది" అన్నారు. పూజలలో గులాబీరంగు వస్త్రాలు, లఘు సర్వతోభద్ర చక్రంలో ఎర్రరంగు ఉపయోగిస్తారు. స్త్రీలు గులాబిరంగు పాదాలకు పారాణిలాగా అత్తుకుంటారు, సింధూరాన్ని పాపిటలో దిద్దుకుంటారు. దీనివలన సౌందర్యం ఇనుమడించడమే కాక చూసేవాళ్ళ మనస్సులలో, భావంలో శక్తి, పవిత్రత వృద్ధి చేస్తాయి.

ఇన్యూశియన్ సూర్య కిరణాల గురించి విశ్లేషణ చేస్తూ "జీవన కార్యకలాపాలలో ఖర్చుఅయే శక్తి 660 నుంచి 680 మిల్లీ మైక్రాన్ దాకా మనిషి తిరిగి ఎలా పొందుతాడు, దానికి సౌరవర్ణక్రమం (స్పెక్ట్రమ్)లోని నారింజరంగు భాగం పరిశీలిస్తే సరిగా తెలుసుకోగలుగుతారు. ఇన్యూశియన్ ఈ పరిశోధన అయిదు సంవత్సరాల పాటు కొనసాగించాడు. ఎక్సరే ఉపకరణాల ద్వారా జంతువుల శరీరంలోనికి భయంకరమైన రేడియేషన్ ద్వారా జ్వరాలు పుట్టించాడు. గులాబీ ప్రకాశంతో దానికి వైద్యం చేసి 25% రోగగ్రస్త జంతువులని 20 రోజులలో పూర్తి ఆరోగ్య వంతులుగా చేశాడు.

హిందువులలో చిరకాలంగా ఒక ఆచారం ఉన్నది. ఇప్పటికీ రాజస్థాన్ ఉత్తరప్రదేశ్‌లలో గోడలపై రంగుల చిత్రాలు చిత్రించే అలవాటు ఉన్నది. దీనివలన తెలియకుండా రంగుల ప్రభావం మనుష్యులపై పడుతుంది. చాలామంది ఈ రంగుల వలన లాభం పొందవచ్చు. విద్యాలయాలలో, సార్వజనిక స్థలాలలో రంగు రంగుల డిజైన్లు, కళాకృతులు రచించడం, కిటికీలు, దర్వాజాలు రంగుల పరదాలు అలంకరించడం, వివిధ రంగులతో రచించిన సుభాషితాల వలన వందలకొలది మంది లాభం పొందుతున్నారు. పోను పోను జనం ఈ రంగుల గురించి బాగా తెలుసుకొని ఇంకా అమితమైన లాభాలు పొందగలరు.

పసుపు పచ్చరంగుకి ప్రేమకి సంబంధం ఉంది. భారతీయులకి ఈ విషయం ఎప్పుడో అవగతమయింది. ప్రకృతికి ప్రతిరూపంగా పచ్చని వస్త్రాలు ధరించే ఆచారం పురాతనమైంది. **పసుపురంగు బుద్ధిని వికసింపచేసేది, ఆరోగ్యవర్థకం అని చెపుతారు.** ఉపాసన, అనుష్ఠానంలో దీని మహత్వం చాలా ఉంది. ప్రాతఃకాలంలో పసుపు పచ్చని మధుపర్కాలు ధరింపచేస్తారు. ఈ రంగు ప్రభావంతో ప్రేమ, వివేకము వికసిస్తాయి. ఈరెండు దాంపత్య జీవితానికి, మానవ జీవన కల్యాణానికి చాలా సహాయం చేస్తాయి. ఉపాసన, పురశ్చరణకి ఈ రంగు దోహదం చేస్తుంది. అందువలన పచ్చరంగు విశిష్ఠత సంతరించుకుంది.

ఆకుపచ్చరంగు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని ఇస్తుంది. మేధాశక్తితో ఎక్కువ శ్రమ పడి పని చేసే వారికి, అస్వస్థులైన వారికి ఈ రంగు ఉపయోగించాలి. కొండలలో, కోనలలో విహరిస్తే అచ్చటి పచ్చదనం కళ్ళకి ఎంతో హాయినిస్తుంది. ప్రకృతి వికసించిన స్థలాలకు విహారానికి వెళ్ళే అవకాశం వస్తే తప్పక వినియోగించుకోవాలి. దీని వలన మనస్సుకి శరీరానికి అలసట దూరమయి హాయి కలుగుతుంది. ఇంటికి ఇరువైపులా ఆకుపచ్చని చెట్లు, లతలు కూరగాయలు పండించి లాభాన్వితులు కావచ్చు.

ఆకుపచ్చరంగుతో పనిచేసే శక్తి పెరుగుతుంది. వానా కాలంలో రైతులు ఒంటరిగా ఎంతపని చేయగలరో, జ్యేష్ఠమాసంలో అదే పనిని ఎంతోమంది రైతులు కలిసి చేయలేరు. ఒకసారి విమానాలు తయారుచేసే ఫాక్టరీకి ఇరుప్రక్కలా రంగులు ప్రయోగం చేశారు. ఇక్కడ ఆకుపచ్చ రంగును ఉపయోగించారు. కృత్రిమమైన ఆకుపచ్చరంగు సూర్యకిరణాలు ప్రసరింపచేసారు. తరువాత శ్రామికులు ఎక్కువ శక్తితో పని చేయడం ప్రారంభించారు.

జీవితాన్ని ప్రభావితం చేసే ముఖ్య రంగులు ఇవి. ఇతర రంగులు కూడా ప్రభావంలో తక్కువ ఏమీ కాదు. చాలా రంగుల కలయిక చాలా ఆకర్షణీయంగా ఉంటుంది. ఇంద్ర ధనస్సులోని ఏడురంగుల కలయిక మనోహరంగా ఉంటుంది. ధార్మిక దృష్టిలో గోధుమరంగుకి హిందువులు, భౌద్ధులు మహత్యం కల్పించారు. ఈ రంగు సాత్వికము పవిత్రము, జీవితంపై ప్రేమ, శ్రద్ధాభావాలు జాగృతం చేస్తుంది.

ఈ రంగులన్ని సూర్య కిరణాలలోనే ఉన్నాయి. సూర్యుని ప్రకాశాన్ని స్పెక్ట్రోమీటరు యంత్రంతో విడగొట్టినట్లయితే అది ఏడురంగులలో విభజింపబడతాయి. ప్రకృతిలో ఏరకమైన రంగుల కలయిక, విడిపోవుట అనేది సూర్య కిరణాల యొక్క లీల. మన జీవితంలో పరిస్థితి, వయస్సు, ఉపయోగం దృష్టిలో ఉంచుకొని రంగులను ఉపయోగించాలి. ఇది కూడా ఒక కళ. పూర్వం ఇళ్ళల్లో రంగురంగుల చిత్రాలు చిత్రించడం చిత్రాలు అలంకరించడం, వేషభాషలు ఎలా ఉండేవో వాటిని తిరిగి ఉపయోగంలోకి తేవాలి. ఈ రంగుల కళలను వికసింపచేయాలి. విద్యాలయాలలో గ్రంథాలయాలలో, దేవాలయాలలో రంగుల వెలుగులతో, పూలతో అలంకరించాలి. ఉత్సవాలలో, శుభకార్యాలలో ఆయా స్థలాలలో రంగు రంగులలో అలంకరించి ఒక విశిష్ఠత కల్పించి శోభామయంగా చేస్తే అందమే కాదు దాని వలన అంతరంగ గుణాల వికాసం, వృద్ధి, శక్తి కూడా ప్రతివారికి లభిస్తుంది. జీవితం రంగుల మయం చేసుకోవాలి.

**మధురమైన మాటలతో కలహం దరిచేరదు**

మనం - మన ఆరోగ్యం

# యోగసాధన ద్వారా రోగముల నిర్మూలన

మానవ శరీరనిర్మాణం ఎంతో అద్భుతమైనది. విచిత్ర మైనది కష్టతరమైనది కూడా. శరీరంలో చాలా నాడులున్నాయి. ఈ నాడులన్నింటి సహకారంతోనే శరీరమనే యంత్రం చక్కగా నడుస్తోంది. ఏదైనా ఒకనాడీ వ్యవస్థ తగిన రీతిలో లేకపోతే అది ఇతర నాడులపై ప్రభావం చూపుతుంది. దీని ప్రభావం చాలాకాలం వరకు ఉన్నట్లయితే రోగాలు ఉత్పన్నమౌతాయి. భిన్న భిన్న నాడులకు సంబంధించిన రోగాలు కూడా విభిన్నంగా ఉంటాయి. వీటిని ఆరోగ్యకరంగా ఉంచి చక్కగా నడపడానికి చాలా చికిత్సా పద్ధతులున్నాయి. యోగపద్ధతి ద్వారా ఈ జబ్బులను పోగొట్టవచ్చు. వైజ్ఞానికదృష్టితో చూసినట్లయితే ఈ వికృతులను అన్నింటినీ సమూలంగా నిర్మూలించవచ్చు.

శరీరంలోని నాడులన్నింటికీ విశిష్టమైన మహత్వముంది. కానీ జీవించడానికి శ్వాసక్రియ, భోజనం, మలమూత్రవిసర్జన అతి ముఖ్యమైన పనులు, దీని తర్వాత శరీరానికి ఆధారమైంది అస్థినాడులు. ఇవి చలనానికి ఆధారమైనవి కండరాలకు సంబంధించిన నాడులు. నాడులన్నీ చాలా ఆరోగ్యంగా ఉండడం అవశ్యకం. లేకపోతే శరీరం రోగగ్రస్థమవుతుంది.

ఆహారాన్ని జీర్ణంచేసే ప్రక్రియను జరుపు నాడులు ఆరోగ్యంగా ఉన్నప్పుడు మనిషి ఆరోగ్యంగా ప్రసన్నంగా ఉంటాడు. భోజనంలోని వివిధ రుచులను కడుపులోకి చేర్చి మనస్సుకు తృప్తిని కలిగించేవి జీర్ణనాడులే. దీనిలో ఏ విధమైన మార్పయినా చాలాకాలం ఉన్నట్లైతే నానారకాలైన రోగాలు చుట్టు ముడతాయి. లావెక్కడం ఒక సామాన్యమైన జబ్బు. ఇదేకాక మమ్స్, హెర్నియా, అల్సర్, హెపోటైటిస్, సిర్రోసిస్, డైవర్టిక్యులోసిస్, కొలోన్‌క్యాన్సర్, పైల్స్, డయేరియా, అజీర్తి, ఎసిడిటీ, ఎనోరేక్సియా లాంటి రోగాలు ప్రముఖమైనవి.

ఈ రోగాలన్నింటికీ యౌగిక మానేజ్‌మెంట్‌లో ఆసనాలు, ప్రాణాయామం, శోధనక్రియ, ధ్యానం లాంటి విధానాలు ఉన్నాయి. ఆసనాల్లో పవనముక్తాసనం, పశ్చిమోత్తానాసనం, భుజంగాసనం, గోముఖాసనం, అర్థ మత్స్యేంద్రియాసనం, మండూకాసనం, శశాంకాసనం, వజ్రాసనం మొదలైనవి ముఖ్యమైనవి. ప్రాణాయామంలో నాడీశోధన, భస్త్రికా, భ్రామరీ, శీతలీ, సీత్కారీ, అలాగే సూర్యభేదన ప్రాణయామాలు ఉపయోగకరమైనవి. శోధనక్రియలో నేతి, వమనం, లఘుశంకా ప్రక్షాళనం, కపాలభాతి క్రియలు చేయబడుతున్నాయి. యోగ నిద్ర, అజపాజపం కూడా ఈ రోగాలకు రామబాణం లాగా పనిచేస్తాయి.

శ్వాస ఆడుతుంటే జీవనం. ఆగిపోతే మరణం. జీవించ డానికి శ్వాసక్రియ అవసరం. శ్వాసలోని తేడా వల్ల రోగాలు వచ్చి చేరుతాయి. శ్వాస సంబంధమైన రోగాలు-జలుబు, ఇన్‌ఫ్లూఎంజా, సైనోసైటిస్, టాన్సిలైటిస్, ఫెరింజిటిస్, డిఫ్తీరియా, యాక్యూట్ బ్రాంకైటిస్, న్యుమోనియా, ఊపిరితిత్తుల వ్యాధులు ట్యూబర్‌క్యులోసిస్, బ్రాంకియల్ కార్సి నోమా మొదలైనవి. వీటికోసం గోముఖాసనం, భుజంగాసనం, ధనురాసనం చాలా ఉపయోగకరమైనవి. ప్రాణాయామంలో భ్రామరీ, భస్త్రికా, ఉజ్జాయీ, నాడీశోధన్, కపాలభాతి క్రియలు ముఖ్యమైనవి. నేతి, వమనము అవసరాన్ని బట్టి లఘుశంకా ప్రక్షాళనం కూడ చేయదగ్గవి. యోగనిద్ర కూడ ఈ రోగాలకు ఉపయోగకరమైంది.

జీర్ణం కానీ నిస్సారభాగం మలమూత్రరూపంలో శరీరంలో నుండి విసర్జింపబడుతుంది. లేకపోతే ఈ మాలిన్యం వల్ల శరీరం రోగగ్రస్తమవుతుంది. ఈ క్రియ సక్రమంగా జరుగకపోతే కిడ్నీ స్టోన్, గాట్, నెఫ్రొటైటిస్ మొదలైనవి వస్తాయి. వీటికి ప్రభావవంతమైన ఆసనం సూర్యనమస్కారం, త్రికోణాసనం, వజ్రాసనం, ఉష్ట్రాసనం, తాడాసనం, తిర్యక్ తాడాసనం, కటి చక్రాసనం, పశ్చిమోత్తానాసనం, మండూకాసనం యోగముద్ర మొదలైనవి. నాడీ శోధన్, భస్త్రికా, ఉజ్జాయి మరియు ఓంకార ఉచ్చారణవల్ల ఈ రోగాలను నియంత్రించవచ్చు. అగ్నిసారం, నౌలీ, వమనం, లఘుశంకా ప్రక్షాళన మొదలైన క్రియలు కూడా దీనికి ఉపయోగకరం. అశ్వినీముద్ర, ఉడ్డీయాన్, మూల బంధనం కూడా ఉపయోగకరం.

ఎముకలకు సంబంధించిన రోగాలు ఆస్టియో పోరోసిస్, రికెట్స్, ఆస్టియో మలఫేసియా, బోన్ ట్యూమర్, బోన్ ఇన్‌ఫెక్షన్ మొదలైన ఈ రోగాలను పవన ముక్తాసనం, భుజంగాసనం, సూర్యనమస్కారాలతో నివారించవచ్చు. నాడీ శోధన, భస్త్రికా ప్రాణాయామం వల్ల కూడా లాభం చేకూరుతుంది. నేతి,

**మాట్లాడే మాటలు తేనెవలే తియ్యగా ఉండాలి**

కుంజల్ కూడా ఉపయోగకరమైనవి. యోగనిద్ర, రిలేక్సేషన్ మొదలైనవి ఎముకల సంబంధమైన రోగాలను పోగొట్టుతాయి.

కండరాల నాడుల వల్ల నడవడం, దైనిక కార్యకలాపాలు జరుగుతాయి. వీటిలో తేడా వచ్చినప్పుడు మాయస్థేనియ గ్రేవీస్, మస్కులర్ డిస్ట్రాఫి మాయోటోనిక్ డిస్ట్రాఫి మొదలైన రోగాలు కలుగుతాయి. వీటిని పోగొట్టడానికి పవన ముక్తాసనం, మార్జరీ, తాడాసనం, తిర్యక్‌తాడాసనం, కటి చక్రాసనం అభ్యసించాలి. దీనికి ప్రాణాయామం, షట్‌కర్మలను ఉపయోగిం చుకోవచ్చు. ఎముకలు, కండారాల సంబంధం చాలా ఎక్కువగా ఉంటుంది. కనుక ఒకదాని ప్రభావం, ఇంకొక దానిమీద కూడా ఉంటుంది.

జలం శరీరం యొక్క ముఖ్య అంశం. ఈ జలం విభిన్న ద్రవాలు అనగా రక్తం, ప్లాస్మా మొదలైన రూపాల్లో శరీరంలోని కణాలన్నింటిలో ప్రవహిస్తుంది. వీటికి బాధ కలిగించే రోగాలు – రుమాటిక్ హార్ట్ డిసీజ్, ఎండోకార్డిటిస్, మాయోకార్డిటీస్, ఫెరీ కార్డిటిస్, ఎథిరోక్లెరోసిస్, కొరోనరీ హార్ట్ డిసీజ్, హైపర్ టెన్షన్ మొదలైనవి. ఈ రోగాల నుండి విముక్తి పొందడానికి పవన ముక్తాసనం, శవాసనం, శశాంకాసనం, వజ్రాసనం, గోముఖాసనం, సర్వాసనం, యోగముద్ర అవసరం, ప్రాణాయామాలలో నాడీ శోధనం, ఉజ్జాయి, భస్త్రికా, కపాలభాతి, శీతలీ, సీత్కారీ లాభదాయకాలు, **సోహంసాధన, ఓంకారం వలన బ్లడ్‌ప్రెజర్ శీఘ్రంగా నయమవుతుంది.**

జననేంద్రియాలకు సంబంధించినవి చాలా సున్నితమైన భాగాలు. దీనిలో రోగాలు సంక్రమించే ప్రమాదముంది. వీటికి సంబంధించిన రోగాలు – ఎన్‌లార్జ్‌డ్ ప్రోస్టేట్, కాన్సర్, సర్వైకల్ కాన్సర్, ట్రికోమోనాసిస్ సంక్రమణం, గనేరియా, సిఫిలిస్, జెనైటల్ హర్పిస్, ఎయిడ్స్, పెల్విక్ ఇన్ ఫ్లమేటరీ డిసీజ్, మెన్‌స్ట్రు అల్ సిన్‌డ్రోమ్ మొదలైనవి. ఆసనాలలో శశాంక భుజంగ, ధనురాసనం, పశ్చిమోత్తానాసనం, అర్థ మత్స్యేంద్రియం, పవన ముక్తాసనం, తాడాసనం, మార్జరీ, భద్రాసనం మొదలైనవి ఉపయోగకరం. క్రియలలో నేతి, జలనేతి, అగ్నిసారం ఉప యుక్తం. మూలబంధం, వజ్రోలీల ప్రభావం చాలా బాగా ఉంటుంది. నాడీశోధనం, **భస్త్రికా ప్రాణాయామం నిత్యం చేస్తే పుట్టుకతోవచ్చే రోగాలుపోతాయి.** నాదయోగం, విశిష్ట మంత్ర జపం వల్ల కూడా ఈ రోగాల ప్రభావం తగ్గిపోతుంది.

మన భౌతిక శరీరంలో జ్ఞానేంద్రియములు ముఖ్యమైనవి. వీటివల్లే మనకు వస్తువులను గురించి తెలుస్తుంది. ఇవి సరిగ్గా పనిచేయనప్పుడు కళ్ళలో, చెవుల్లో రకరకాలు రోగాలు ఉత్పన్న మవుతాయి. వీటికి కూడా యోగక్రియలు మంచివి. సర్వాంగా సనం, విపరీతకరణీ, జలనేతి, కపాలభాతి, నాడీ శోధన్, భ్రామరీ ప్రాణాయామములు ఉపయుక్తములు, ఇదేవిధంగా స్నాయుతంత్రములు ఇండోక్రైన్ సిస్టమ్, న్యూరోట్రాన్స్‌మీటర్‌కు సంబంధించిన రోగాలు కూడా చాలా ఎక్కువగా ఉంటున్నాయి. వీటికి కూడా యౌగిక క్రియలు అన్వేషించవలసి ఉన్నది. దీనికి సంబంధించిన పరిశోధనలు కూడా జరుపుతున్నారు.

సామాన్యంగా ఉండే రోగాలకు యోగప్రక్రియ చికిత్స చెప్పడం జరిగింది. వేరే ఏదైనా ఇతరత్రా జబ్బులకు యోగిక క్రియను తెలుసుకోవాలంటే యోగ్యుడైన మార్గదర్శకుని సంప్రదించవలసి ఉంటుంది. వ్యక్తిగత సమస్యలకు కూడా నిపుణుడైన యోగచికిత్సకుని వద్దకు వెళ్ళాలి. యౌగిక ప్రక్రియల ద్వారా రోగాలు నయమవుతాయి. యౌగిక ప్రక్రియల ప్రభావం రోగాల మీద నిశ్చయంగా పడుతుంది. ఈ ప్రభావం ఎలా పడుతుందనేది ప్రయోగం ద్వారా తెలుసుకోవచ్చు. సిద్ధాంత పరంగా తెలిసిన సత్యం ఏమిటంటే యమ, నియమ, ఆసన, ప్రాణాయామం, ధ్యానం, యౌగిక క్రియలు శరీరంలో ప్రాణ ప్రవాహానికి అడ్డు తొలగించి సరైనరీతిలో క్రియాశీలంగా చేస్తుంది. ప్రాణ ప్రవాహాన్ని సరైనరీతిలో సంచరింపచేయడానికి విభిన్న అంగాలకు విభిన్న ప్రక్రియలు ఉన్నాయి. దీనిని గురించి విశేషంగా తెలుసుకోదలచిన వారు దేవ సంస్కృతి విశ్వవిద్యాలయంలోని యోగవిభాగం వారిని సంప్రదించ వచ్చు. వారు తమ పరీక్షలను వైజ్ఞానికంగా జరుపుతున్నారు.

వాస్తవంలో యోగ కేవలం చికిత్సా ప్రణాళికే కాదు దీని వాస్తవిక ఉద్దేశ్యం మానవ శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతూ మానవీయ చేతనను ఊర్ధ్వగామి చేయడం, ఇదే యోగ యొక్క ప్రముఖ ఉద్దేశ్యం. శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడం ఎంతైనా అవసరం. ఎందుకంటే శరీర మాధ్యమంతోనే ఉన్నతమైన యౌగిక ప్రక్రియలను పొందవచ్చు. కనుక యోగ అనేది రోగాల్ని నిర్మూలించేదే కాకుండా మానవచేతన ద్వారా అలౌకిక మైన మణిమకుటాన్ని వెదకడం కొరకు కూడా ఉపయోగ పడుతుంది. అందువలన యోగ రహస్యాన్ని తెలుసుకోవడం కొరకు శరీరాన్నీ, మనస్సు ఆరోగ్యంగా ఉంచుతూ దైవీచేతనలో కలసిపోవాలి. యోగచికిత్స ద్వారా చైతన్యం యొక్క శిఖరాన్ని అధిరోహించే యాత్ర సాగించాలి.

★★★

**తియ్యగా మాట్లాడేవారికి ప్రతి విషయంలో విజయం వరిస్తుంది**

జీవించే కళ

# త్యాగమే జీవామృతం

ఆషాఢం, శ్రావణం, భాద్రపదం కూడా ముగిసిపోతుంది. కానీ ఒక్క నీటిచుక్క కూడా పడలేదు. జ్యేష్ఠమాసం పూర్తయి ఎన్నో రోజులైనా, ఆ తాపం ఇంకా మిగిలి ఉంది. ధాన్యాగారాలు ఖాళీ అవుతున్నాయి. ఎండిన గొంతు తడుపుకోవడానికి నీళ్ళు లేవు. ప్రచండవేడిని తట్టుకోవడానికి కాసిన చల్లటి నీళ్ళు లేవు. బావులు, సరస్సులు, నదులన్నీ ఎండిపోయాయి. ఎంతటి సంకట స్థితి! అంతటా హాహాకారాలు వినిపిస్తున్నాయి. దీనికి సమాధానమేంటి? ఎలా ఈ పరిస్థితిని తట్టుకోవాలి? బుద్ధి పనిచేయటం లేదు. ఉన్న ఆస్త్రాలేవీ దీనికి సమాధానం ఇవ్వలేకపోతున్నాయి. బ్రహ్మాస్త్రం వంటి అజేయమైన అస్త్రం కూడా అమ్ములపొదిలో లేదు. అయ్యో! భూమాత జన శూన్యమై పోతుందా! మానవబీజం ఏ మనువు దగ్గరా మిగిలి ఉండదు. సంవత్సరాల తరబడి చేసిన కఠోర సాధనాఫలితమైన ఈ సభ్యత చూస్తుండగానే సమసిపోతుందా! ప్రజ్ఞ కలత చెందసాగింది.

ఆకలితో అలమటిస్తున్న పసిప్రాణాలు, విలవిలలాడుతున్న పిల్లలు, నిరాహార తపమనే కఠోరవ్రతాన్ని చేబూనిన యువకులు, కొట్టుకుంటున్న ప్రాణాన్ని త్యజించే వృద్ధులతో వాతావరణం మరింత మరింత వేదనకు లోనైంది. అందరి ముఖాల్లో చావుకళ నిండిపోయింది. స్మశాన వైరాగ్యం ఇంటిల్లిపాదిని అలుము కుంది. ఉండీ ఉండీ వినిపించే చిన్నారుల ఆక్రందన స్మశానంలో వినిపించే హాహాకారాలులాగా అనిపించసాగింది. ఎక్కడ చూసినా బాధతో నిండిన కారు మబ్బులు అలుముకున్నాయి.

ఈ పరిస్థితి అంగీరస మహర్షికి తెలియందేమీ కాదు. తమ కుటీరంలో ఏకాంతంగా కూర్చుని ఈ విషయం మీద దీర్ఘంగా ఆలోచించసాగారు. జన సామాన్యుల లాగానే వారు చింతిస్తున్నారని వారి ముఖంలో మారే భావాలే చెపుతున్నాయి. 'మనకెందుకీ అనవసరమైన బాధ' అని కూడా అప్పుడప్పుడు మనసుకి అనిపిస్తుండేది. కానీ తక్షణమే అందుకు ఇంకొక ఆలోచనాధార హూంకరిస్తూ ప్రశ్నించేది. అయితే నువ్వు మౌనదర్శకుడిగా మిగిలిపోతావా? నీ అంతరాత్మ నిన్ను ధిక్కరించదా? సమాజంలో ఇంతటి జటిల సమస్య తలెత్తి నప్పుడు నీవు మాత్రం నీ ధ్యానం, సాధన, అంటూ నీ స్వార్థం, నీ ఉన్నతి గురించి మాత్రమే ఆలోచిస్తావా? నీ స్వంత ఉన్నతి కోసమా! లేదు! ఈ నీతుచ్ఛ ప్రయోజనం కోసం సమాజం నుండి విముఖడవు కాలేవు. నీవు సమాజంలో ఒక అంగానివి, దానిపట్ల నీ కర్తవ్యాన్ని ఉపేక్షించలేవు. నీ బాధ్యతకి నీవు తిలోదకాలు వదలలేవు. ఈ సంకట ఘడియలకు సమాధానం వెదకటమే నీ అతి పెద్ద సాధన, జీవితానికి సర్వోపరీ లక్ష్యం.

ఈ విధమైన ఆలోచనలతో మహర్షి సతమతమయ్యారు. ముఖంలో బాధ స్పష్టంగా కనిపించింది. నిర్ణయాత్మక బుద్ధి క్షీణించసాగింది. ఈ సందిగ్ధావస్థలో ఉండగానే అంతరాత్మ పలికింది, "నీవింకా సంశయిస్తున్నావా, లే, లేచి సమాధానం వెతుకు.

ఈ మహర్షి ముఖంలో దృఢత్వం కనిపించింది, కర్తవ్య బోధ జరిగింది. మళ్ళీ ఒకసారి తీవ్రంగా వారి ముఖకవళికలు మారాయి. కానీ ఈసారి నిరాకరణకు చింతన వల్ల లేదా మరే అపోహవల్లనో కాదు. కళ్ళు తళుక్కుమని మెరిసాయి. వరుణదేవుని పూజ, ఆరాధనలు జరిగితేనే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని వారికి అనిపించింది. ఇంకే! అడవి వదిలి జనారణ్యంలోకి కదిలివెళ్ళారు. వారిని తమ మధ్యలో చూసి అంతా పొంగిపోయారు. తప్పకుండా ఏదో పరిష్కారం తోనే మహర్షి తమ వద్దకు వచ్చారనుకున్నారు.

మరుసటిరోజే మహర్షి అంగీరస ఒక విశాలమైన సభను ప్రకటించారు. మర్నాడు ప్రజలంతా చెప్పిన స్థలంలో, సమయానికి హాజరైనారు. ఉద్బోధ మొదలైంది.

"ఆత్మీయులారా! మనకొచ్చిన ఈ విపత్తు ఖచ్చితంగా అత్యంత జటిలమైనది. కానీ ఏ పరిష్కారము లేనటువంటిదేమీ కాదు. ఈ విషమ పరిస్థితిని ఎదుర్కోవడానికి ఒక సమాధానం ఉంది, కానీ దానికొక అడ్డంకి ఉంది" అని మహర్షుల వారు

**వ్యక్తులు ఎలా ఉంటే సమాజం అలా ఉంటుంది**

కాస్త ఆగారు. సభ నుండి ప్రజలిలా అన్నారు "మహానుభావా! ఆ అడ్డంకి ఏమిటి? అది తప్పించడానికి మేము సాయశక్తులా ప్రయత్నిస్తాం. మీరు ఆజ్ఞాపించండి. అప్పుడు ఋషి పలుకులు ఇలా వినిపించాయి. "సమాధానం జటిలమైనది. బలిదానం కోరుకుంటోంది. నరమేధ యజ్ఞంలో బలివేదిక మీద నిలబడడానికి మీలో ఎవరు సిద్ధంగా ఉన్నారో చెప్పండి?

సభలో నిశ్శబ్దం నెలకొంది. మహర్షికి ఎటువంటి సమాధానం రాలేదు. కొంచంసేపు ఆగి మళ్ళీ మహర్షి వాక్కులు వినిపించాయి. "సరే ఈ పరిస్థితికి సమాధానంగా నన్ను నేనే ఆహుతి చేసుకుంటాను. మీలో ఎవరైనా వచ్చి నన్ను రాజ మండపస్తంభానికి కట్టి, బలిచ్చి ఈ ఆహుతి ప్రక్రియను పూర్తి చేయండి"

సభామండపం నుండి ఒక యువకుడు ఆగమని అరిచాడు "నన్ను నేను బలిచ్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాను" అంగీరస మహర్షి ఆశ్చర్యపోయారు. ఆ మాటలు వినిపించిన వైపుకి దృష్టి అనాయాసంగా మర్లింది. పధ్నాలుగేళ్ళ ఒక పిల్లవాడు గర్వంగా తనవైపుకి వస్తున్నాడు. అంగీరస మహర్షికి రెండు చేతులతో నమస్కరించి బలిస్తంభానికి తనను కట్టివేయాలని పట్టుబట్టాడు. ప్రేమపూర్వక దృష్టిసారించి మహర్షి మందహాసంతో "వత్సా! వద్దు, నీవు బాలకుడవు, ఈ కార్యానికి నేనే సరైనవాడను. నువ్వు చెప్పింది చేస్తే, రాబోయే తరాలు నన్ను నేను రక్షించుకోవడం కోసం ఒక బాలుని వధించామని ఆడిపోస్తారు" అన్నారు.

ఆ యువకుడు బిగ్గరగా నవ్వి "మీరు నన్ను బాలకుడను కుంటున్నారు. ఆర్యా! అది మీ ఇష్టం. వయస్సుని బట్టి, దేహపు ఒడ్డుపొడవులను బట్టి అలా అనుకోవచ్చు. కానీ పిన్న వయసు కారణంగా దయలేనివాడిగా, గౌరవరహితుడిగా మిగిలి పోవ డానికి నేను ఒప్పుకోను. అష్టావక్రుడు మరియు అభిమన్యుల సంగతి మీరు మరిచిపోలేదని నేను నమ్ముతున్నాను. వారి శరీరము యువకుల వలె ఉన్నది కానీ చైతన్యం శూరవీరులది, శూరవీరులు ఆయువు పరిగణించరు."

అదే అభిమానంతో పలుకుతూ పోయాడు "ఆ అష్టావక్రుడి, అభిమన్యుని అంశను నేను, ఉత్తరాధికారిని, మహానుభావా! నా నరనరాల్లో వారి రక్తమే ప్రవహిస్తుంది. ఆర్యుల వంటి సాహసం, గుండెల్లో దేవపుత్రులకున్న ఉల్లాసం ఉన్నాయి. నేను సమాజానికి ఏ మాత్రం పనికొచ్చినా, నాకది గర్వంగానే ఉంటుంది. మీరు జీవించి ఉంటే సమాజంలో రాబోయే విపత్తులకి మార్గదర్శనం దొరుకుతుంది. నాదేముంది, ఒక ఉత్తంకుడు లేకపోతే మరొకడు పుట్టుకొస్తాడు, కానీ మీరు లేక పోతే ఈ సమాజం ఎలా భరించగలదు? కాస్త ఆలోచించండి. మహర్షులైన మీరు నన్ను స్వీకరించెదరు గాక ముహుర్తం మించిపోతుంది. ఇక ఆలస్యం చేయకండి."

చేసేదిలేక అంగీరస మహర్షి బాలకుడైన ఉత్తంకుడిని తీసుకుని యజ్ఞమండపంలోని బలిస్థానానికి కట్టివేసారు. ఒక నడివయస్కుడు ఖడ్గాన్ని ఎత్తాడో లేదో, ఆకాశం తీవ్రంగా ఉరుముతూ కళ్ళుచెదిరే మెరుపులు కురిపించింది. అక్కడున్న వారు తలెత్తి చూసి సంతోషంతో నాట్యం చేయసాగారు. చూస్తుండగానే కుంభవృష్టిగా వర్షం కురిసింది. బాలకుడైన ఉత్తంకుని పరీక్ష పూర్తయ్యింది. అతని ఆత్మత్యాగానికి ప్రసన్నుడైన వరుణుడు, ఎన్నో ఏళ్ళగా కురవనంతటి వర్షాన్ని కురిపించాడు. నలువైపులనుండి ఉత్తంకుడికి జయజయధ్వనులు చేశారు. జ్యేష్ఠమాసపు తాపం తరువాత తుంపర్లగా పడే వర్షం మనుషులనే కాదు, పశుపక్ష్యాదులను కూడా ఉత్తేజపరుస్తుంది. ఇప్పుడు కూడా ఇలాంటి వాతావరణమే ఏర్పడింది. పరోపకారం కోసం స్వార్థత్యాగం చేసిన ఉత్తంకుని గొప్పతనం అయస్కాంతంలాగా భగవత్కృపను ఆకర్షించి కుంభవృష్టిగా అవతరించింది.

స్వయంగా ఉత్తంకుడు కూడా తన పరోపకార మహత్యం వల్ల కలిగిన ఫలితాన్ని చూసి నిశ్చేష్టుడయ్యాడు. ఎంతో కృతజ్ఞతా భావంతో మహర్షి ఎదుట వినమ్రంగా, "దేవ! త్యాగఫలం ఇంత గొప్పగా ఉంటుందని తెలిసి చకితుడనైనాను. నా శేషజీవితాన్ని మీలాగే తపస్సు, త్యాగంతో గడుపుకుంటాను. ఇంద్రియ భోగాలు, జీవితంలోని మరే కోరికలు నాకొద్దు" అని నివేదించుకున్నాడు. త్యాగము జీవితానికి అమృతం. ఈ విషయం తెలుసుకుని నిజంగానే బాలకుడైన ఉత్తంకుడు మహాత్ముడైన ఉత్తంకుడిగా మారి త్యాగానికి ప్రతీకగా నిలిచాడు.

*– అఖండజ్యోతి, జులై 1999*

*అనువాదం : శ్రీమతి జయలక్ష్మి*

**ఆలోచనలు మార్చుకోలేని వారు పరిస్థితులను మార్చుకోలేరు**

వ్యక్తి నిర్మాణము

# నాలుగు ఆదర్శములు - యుగధర్మము

21వ శతాబ్దిలో సామాన్యుల జీవితం నాలుగు ఆదర్శముల మేలు కలయికగా ఉంటుంది. 1. ఇంగిత జ్ఞానం (సమఝ్‌దారీ) 2. నిజాయితి (ఇమాన్‌దారీ) 3. బాధ్యత (జిమ్మేదారీ) 4. సాహసము (బహాదూరీ). ఈ నాలుగు ఆదర్శములు నాలుగు వేదముల సారము. ధర్మమునకు ఇవే నాలుగు పాదములు. అభినవ సమాజ వాతావరణము ఈ ఆదర్శములను స్వీకరించుటవలనే నిర్మించబడుతుంది. నవయుగము యొక్క నీతిశాస్త్రము, ధర్మశాస్త్రములు కూడా ఈ నాలుగు సత్యముల పైనే ఆధారపడి ఉన్నాయి. వీటిని అవహేళన చేయడం వలననే అనేక దుర్భావనలు, దుష్ప్రవృత్తులు చిగురించాయి.

**1. ఇంగిత జ్ఞానము (సమఝ్‌దారీ): త్వరగా వచ్చే లాభము కొరకు వెంపర్లాడి భవిష్యత్తులో రానున్న దాని దుష్పరిణామాలు అర్థము చేసుకోకపోవుటనే తెలివిలేనితనము లేక ఇంగిత జ్ఞానము లేకపోవుట అంటారు.** ఈ పరిస్థితే అనేక సమస్యలు, కష్టాలు, విపత్తులు, విభీషికలకు మూల కారణము.

పక్షులు కుప్పలుకుప్పలుగా తిండి సంపాదించుకోవాలనే లోభముతో వలలో చిక్కుకుంటాయి. చేప కూడా ఎరకోసము వచ్చి గాలములో చిక్కుకుని ప్రాణాలు పోగొట్టుకుంటుంది. బెల్లపు పాకమున్న పాత్రలోకి ముందు-వెనుక చూడకుండా వెళ్ళే ఈగలకు దుర్గతి పడుతుంది.

అసంయమపరులు, అనాచారులు, దుర్వ్యసనపరులు తాత్కాలిక లాభమునే చూస్తారు, కానీ ఈ తప్పిదమువలన రాబోయే రోజులలో ఎటువంటి దుష్పరిణామాలు ఎదుర్కోవాలి అనే విషయము గమనించుకోరు. దృష్టిదోషము ఉన్నవారు దగ్గరలో ఉన్నవే చూడగలుగుతారు. దూరంగా ఉన్న ఏ వస్తువు కనిపించదు. అందుచేత మాటమాటికి ఎదురుదెబ్బలు తింటూ, తడబడుతూ, క్రిందపడుతూ ఉంటారు.

ఈ రోజులలో వ్యక్తి మరియు సహజమునకు ఎదురుగా అనేక సమస్యలున్నాయి. వీటన్నింటికీ ఒకే కారణము తెలివిలేని తనము, ఇంగిత జ్ఞానము లేకపోవుట. అసంయమపరులు, పైపై మెరుగులకు ప్రాధాన్యతనిచ్చేవారు, అహంకారులు, దురలవాట్లకు బానిసలై తమ వ్యక్తిత్వమును హేయమైనదిగా మార్చుకుంటారు. తమకు తామే హానిని కలిగించుకుంటారు.

ఈ రోజులలో తెలివిలేనితనము మహమ్మారిలాగా అందరి నెత్తిన ఆవరించి ఉన్నది. భ్రష్టచింతనము, దుష్టఆచరణ ఈ కారణముగానే కలిగినాయి. **మానసిక స్థితియే పరిస్థితులకు జన్మనిస్తుంది.** మానవుడు దారితప్పిన దేవత అనేది సత్యము. మనిషి తన భాగ్యమును కూడా తనే నిర్మించుకుంటాడు, కొన సాగుతున్న ప్రవాహగతిని మార్చగలిగే పరిపూర్ణ సామర్థ్యము అతనికి ఉన్నది. అన్నివిధాల మనిషి దారితప్పడానికి కారణము సరైన దిశాబోధ లేకపోవడమే. ఆదర్శముల పట్ల శ్రద్ధ మరియు తర్క, తథ్య ప్రమాణములతో వివేకమును కూడా సమన్వయించ గలిగితే జీవితం అనే నావను కష్టాలు అనే తుఫాను నుండి దాటించటం చాలా సులభము.

**2. నిజాయితీ (ఇమాన్‌దారీ): ఇతరులు మనపట్ల ఏవిధంగా ప్రవర్తించాలని కోరుకుంటామో మనము కూడా ఇతరులపట్ల ఆ విధంగానే ప్రవర్తించాలి.** నిజాయితీకి ఇదే సమగ్ర పరిభాష. మనము ఇతరులనుండి స్నేహము, సహకారము, సద్భావనము, సద్వ్యవహారములను ఆశిస్తాము. సరిగ్గా అదే విధంగా మనము ఇతరులతో వ్యవహరించాలి. నిజాయితీ యొక్క సమస్త ఉదాహరణలు ఈ సత్యమునే నిరూపిస్తాయి. నీకు తప్పు అనిపించే పని ఇతరులపట్ల నీవు చేస్తే అది నిజాయితీ లేనితనము అవుతుంది.

మోసగించుట, కష్టము కలిగించుట, నిష్ఠూరములాడుట, అసభ్యముగా ప్రవర్తించుట, మనపట్ల ఇతరులు చేస్తే మనము సహించము. మరి అదే పని ఇతరులపట్ల మనము ఎందుకు చేయాలి? ఎదుటివారి స్థానములో మనమే ఉంటే వారినుండి మనము ఎటువంటి ప్రవర్తన ఆశిస్తాము? ప్రతి ప్రసంగము లోను, ప్రతిక్షేత్రములోను ఈ గీటురాయిపై మనము నిజా యితీగా ఉన్నామా లేదా నిర్ణయించుకోవాలి. నిజాయితీయే ధర్మము. దీని కొరకు పెద్ద పెద్ద గ్రంథాలు చదవవలసిన అవసరము లేదు. విద్వాంసులను అడుగవలసిన అవసరము లేదు. దానికి సంబంధించిన సుయోగ్యమైన న్యాయమూర్తి కేవలము మన అంతరాత్మే అవుతుంది. మనల్ని మనము ప్రతిసారి ప్రశ్నించు కోవాలి. మనము ఆచరిస్తున్నామో లేదో చూసుకోవాలి. ఇతరులు నిజాయితీ లేకుండా వ్యవహరించినా కానీ మనము ఆ స్థాయికి దిగజారిపోకూడదు.

**మనం ఎవరికి సహాయం చేయకపోతే మనకు ఎవరు సహాయం చేయరు**

**3. బాధ్యత (జిమ్మేదారీ): మానవుడు అనేక కర్తవ్యములు పాటించవలసి ఉంటుంది.** శరీరమును స్వచ్ఛంగా ఉంచు కొనుటకు ఆహార, విహారాలలో మర్యాదలను పాటించాలి. మనస్సును సంతులితంగా ఉంచుకొనుటకు సద్భావనలనే నింపు కోవాలి. ఆర్థిక సంకటములు పెరగకుండా నిర్వహణ చూసు కోవాలి. కుటుంబములోని సభ్యులను సుయోగ్యులుగా, స్వావలంబులుగా (ఎవరికాళ్ళ మీద వారు నిలబడుట), సంస్కారవంతులుగా ఉంచుటకు అనవతరం ప్రయత్నిస్తే ఎవరైనా సుఖముగా, సమున్నతులుగా ఉండ గలుగుతారు. ఈ బాధ్యతలను ఎవరు ఉపేక్షిస్తారో, వారు అనేక కష్టములు భరించవలసి ఉంటుంది. దుఃఖములను సుఖములను పంచుకోవడం, కలిసిమెలసి జీవించడము వంటి పద్ధతులు పాటించేవారు స్వయముగా శ్రేయస్సు పొందుతారు మరియు వారిని అనేకులు అనుకరిస్తారు.

సృష్టికర్త మనిషిని తన జ్యేష్ఠపుత్రుడిగా, యువరాజుగా సృష్టించాడు. మరియు సృష్టిని సువ్యస్థితముగా, సమున్నతముగా, సుసంస్కృతంగా తయారుచేసే బాధ్యతను అప్పగించాడు. ఆ బాధ్యతను పూర్తిచేయుటకు నిమగ్నుడైనప్పుడే అతను జీవిత లక్ష్యమును సాధించగలుగుతాడు. ఈ ఆధారము పైనే మానవుడు దేవమానవస్థాయిని పొందుతాడు. ఇంతతెలిసి లోభము, మోహము, అహంకారములలో ఇరుక్కుంటే సురదుర్లభమైన సుయోగమును పోగొట్టుకున్నవాడవుతాడు, అది భయంకరమైన తప్పు అవుతుంది. ఇటువంటి బాధ్యతారాహిత్యము ఈ రోజులలో ఎక్కడా కనిపించకూడదు.

**4. సాహసము (బహాదూరీ):** ఒక సమయములో బలవంతులు, బలహీనులపై విజయము సాధించి తమను తాము యోగ్యులుగా, శూరవీరులుగా భావించేవారు. ఇప్పుడు అటువంటి రీతులు మానవీయ శ్రేష్ఠతగా స్వీకరింపబడుటలేదు. పులులు లేళ్ళను, కుందేళ్ళను వేటాడుతాయి. పెద్ద చేప చిన్న చేపను మ్రింగుతుంది. దురాచారులు, బలహీనులపై దమనకాండ సాగించి వారిని పీడిస్తారు. వీరిని ఎవరైనా శూర వీరులు అని అంటారా? బందిపోట్లు, హంతకులు, కసాయివారు నిత్యము మరణకాండ జరుపుతూనే ఉంటారు. ఎందరి ప్రాణాలనో హరిస్తుంటారు. వారిని సహసవంతులు అనే గొప్పదనాన్ని ఎవరు, ఎక్కడ, ఎప్పుడు యిచ్చారు?

కాలము, సమాజము, సంస్కృతిని దీప్తివంతముచేస్తూ వ్యక్తి గొప్పతనము పొంగి పొరలినప్పుడే దానిని సాహసము, పరాక్రమము అంటారు. సత్రవృత్తి సంవర్ధన మరియు దుష్ప్రవృత్తి నిర్మూలన అనే రెండు పురుషార్థములకు ఇప్పుడు ఎంతటి ఆవశ్యకత ఉన్నదంటే ఇంతటి ఆవశ్యకత ఇంతకు ముందు ఎన్నడూ లేదు.

దుష్కర్మలు చేసేవారు అసంఖ్యాకముగా ఉన్నారు. అంధ విశ్వాసము, అనాచారములకు కొరత లేదు. నీరు పల్లానికే ప్రవహిస్తుంది. నికృష్టత వైపు వెళ్ళేవారి పూర్వజన్మల సంచిత సంస్కారములు కూడా వారిని చెడుమార్గము వైపే తోస్తాయి. నేటి కాలప్రవాహములో దుష్ప్రవృత్తులే నిండిఉన్నాయి. చెడు సాంగత్యములు, అవాంఛనీయ వాతావరణముల దుష్ప్ర భావము తక్కువ శక్తివంతమైనదేమీ కాదు. వీటన్నింటి సమన్వయముతో సామాన్యస్థాయి ప్రజలు పొట్టకూటికి, సంతానోత్పత్తికి మాత్రమే పరిమితమై హేయమైన జీవితము గడపవలసిన పరిస్థితి ఏర్పడింది. వీటన్నింటినీ ఎదుర్కొంటూ కూడా తమని తాము ఉచ్ఛస్తరీయ ఆదర్శవాదులుగా తీర్చిదిద్దు కొనే వారిని శూరవీరులు అనవచ్చు.

దుష్టజనులు తమతమ సమూహములను తయారుచేసు కుంటారు. పరస్పరము సహాయసహకారాలు అందించుకుంటారు. కాని సజ్జనులు వారి పనిలో మాత్రమే రుచి, తత్పరత చూపిస్తారు. **సమాజం యొక్క మేలుకొరకు మంచివారు అందరు కలసిమెలసి పనిచేయలేరు. ఈ లోపమును సరిచేసుకోవాలి.** వీరి యొక్క ఈ ఒక్క బలహీనత మిగిలిన అన్ని గుణములను, సామర్థ్యములను పనికిరానివానిగా చేస్తుంది.

ధర్మ-దర్శనము, ఆధ్యాత్మ-తత్త్వదర్శనము యొక్క అనేక నియమములు నిర్ధారితమై ఉన్నాయి. వాటి మధ్య ఉన్న అభిప్రాయభేదాలు, హెచ్చుతగ్గులు సాధారణముగా జన మానసములను ప్రభావితము చేస్తాయి. కానీ రాబోయే రోజులలో ఇవి పూర్తిగా మారిపోతాయి. **ఇంగితజ్ఞానము, నిజాయితి, బాధ్యత, సాహసము (సమఝ్‌దారీ, ఇమాన్‌దారీ, జిమ్మేదారీ, బహుదూరీ) యొక్క ఈ నాలుగు ఆదర్శముల పరిధిలోనే ఉత్కృష్టత యొక్క సమస్త సిద్ధాంతములు ఉంటాయి. ఇంత చిన్న ధర్మశాస్త్రముతో యుగానికి చెందిన సమస్యలకు సమాధానము లభించడము సంభవమే.**

రాబోయే రోజులలో ఆలోచనాపరులు ఆత్మనిరీక్షణ సాధనలో ఏదోఒక రూపములో సమ్మిళితము కావల్సి ఉంటుంది. పైన చెప్పిన నాలుగు ఆదర్శములు అంతఃకరణములో ఎంత లోతుగా ప్రవేశించాయో గమనించి కార్యరూపము రావడానికి ఎంత శ్రమపడవలసివచ్చిందో పరిశీలించి ఏదైనా లోటువుంటే దానిని సవరించుకునేందుకు భావనాశీలురైన ప్రతివ్యక్తి రాబోయే రోజులలో నిరంతరము ప్రయత్నము చేయ వలసి ఉన్నది.

*- క్రాంతిధర్మి సాహిత్యము-2 నుండి*

**చిన్నపాటి చిరునవ్వుతో ఎదుటివారిలో కొండలా పేరుకున్న కోపాన్ని దూదిపింజలా చేయవచ్చు**

స్వామిరామతీర్థ జయంతి ప్రత్యేకం

# భారతీయ ఆత్మను వెలికితీసే వేదాంతం



అమెరికాలో నివసించే రోజుల్లో ఒక స్త్రీ స్వామిరామతీర్థ దగ్గరకి వచ్చింది. బాద్‌షా రామ్ (రాజాధిరాజు రాముడని) పిలుచుకునే ఆ సాధువు యొక్క మహత్తును విని ఆ స్త్రీ తన బాధను వెళ్ళ బుచ్చింది. తమ దగ్గరకు వచ్చిన వారికి స్వామిరామతీర్థ ఆనందాన్ని, సుఖాన్ని పంచుతారని విన్నది. ప్రజలు ఏడుస్తూ ఆయన దగ్గరకొచ్చి నవ్వుతూ, ఆనందిస్తూ వెళ్ళేవారు. స్వామి కూడా ఎప్పుడూ నవ్వుతూ ఉండేవారు. ఆయన్ని ఎవరూ ఎప్పుడూ నిరుత్సాహంగా ఉండటం చూడలేదు. ఐశ్వర్యం, పదవుల మాయలో పడ్డవాళ్ళు ఆయన్ని ఎంత అవమానించినా కూడా ప్రసన్నంగానే కనిపించేవారు.

అలా జరిగినప్పుడల్లా ఆయన దానిని ఇలా వర్ణించేవారు, "రాజాధిరాజు రాముడికి ఇవాళ చాలా అవమానం జరిగింది. భలే సరదాగా ఉంది. చాలా తిట్లు తిన్నాడు, జనాలు చీదరించు కున్నారు" అంటూ కడుపుబ్బేలా నవ్వేవారు. బాధతో అక్కడి కొచ్చిన స్త్రీ తన కొడుకుని కోల్పోయింది. ఒంటరిది కాబట్టి దుఃఖం తట్టుకోలేకపోయింది. స్వామీజీనీ సుఖశాంతులు కావలంటూ కోరుకుంది. అప్పుడు స్వామీజీ, "రాముడు ఆనందం అమ్ముతాడు, కానీ దానికి తగిన వెల చెల్లించాలి" అన్నారు. వింటూనే ఆ మహిళ ఉత్సాహంతో ఎంత డబ్బైనా ఖర్చు పెడతానంటూ అరిచింది. మీరెంత చెప్తే అంత చెల్లిస్తాను, కాని నా చిత్తానికి శాంతి లభించాలి అంది. స్వామీజీ, "రామ రాజ్యంలో నీ నాణాలు చెల్లవు. ఆ ఆనంద రాజ్యపు నాణాలు చెల్లించాలి." అన్నారు.

ఏం చేయాలని అడిగింది ఆమె. స్వామి, "చాలా సంతోషం. నీకు ఆనంద రాజ్యంలో ప్రవేశం కావాలంటే ఈ చిన్న పిల్లవాడిని చేరదీయి. నీ కన్న బిడ్డలాగా ప్రేమించు." అంటూ ఒక నీగ్రో కుర్రవాడిని చూపించారు. ఆ పిల్లవాడు తల్లిదండ్రులను పోగొట్టుకున్న అనాథ. ఆ మహిళ కాస్త జంకింది. కాస్త కష్టం అన్నది. స్వామి కూడా అయితే ఆనందం కూడా కష్టమే అని చాలాసహజంగా జవాబిచ్చారు. స్వామి మాటల్లోని ప్రభావమో, ఆమెలో మేల్కొన్న ప్రేమనో, ముందు కాస్త తటపటాయించినా, తరువాత ఆ నీగ్రో కుర్రవాడిని చేరదీసింది. ఆమెలో ప్రేమతో పాటు సంగీతం పెల్లుబికింది. సిస్టర్ స్టెల్లా పేరుతో ప్రఖ్యాతి గాంచిన ఆమె చాలా కాలం వేదాంతాన్ని ప్రచారం చేసింది.

పాశ్చాత్య దేశాలకు మొట్టమొదటి సారి ఆధ్యాత్మికం, వేదాంతాలను పరిచయం చేసిన ఇద్దరు సన్యాసుల్లో ఒకరు స్వామి రామతీర్థ, మరొకరు స్వామి వివేకానంద. వ్యక్తిత్వం, ఆలోచనలు ఇద్దరివీ చాలావరకు ఒకటే అయినా, స్వామి రామతీర్థ చాలా విషయాల్లో విలక్షణంగా ఉండేవారు. వేదాంత సాధనకు ముఖ్యభావం ద్రష్టాస్థితి. స్వామి రామతీర్థ ఈ భావాన్ని పూర్ణంగా సిద్ధి పొందారని అందరూ అంటుండేవారు. కాబట్టి వారు తమ గురించి చెప్పాలన్నా మూడో వ్యక్తి గురించి మాట్లాడి నట్టు చెప్పేవారు. నేను ఇది చూసాను అని ఆయన ఎప్పుడూ అనలేదు. ఏదైనా చెప్పాలంటే రాముడు చూసాడు అనేవారు.

వేదాంతం అనగానే ప్రపంచం నుండి పారిపోవాలి, లేదా వదిలేసేయాలి అని ఉపదేశిస్తుంది అనుకుంటారు. చాలామంది వేదాంతులు సంసారం ఒక మిథ్య అని బోధిస్తూ, నిరుత్సాహంగా కనిపించడం వల్ల కూడా వేదాంతం అంటే ఏదో పలాయన వాదం అనిపిస్తూంటుంది. కానీ రామతీర్థుల వారి ఆనందోత్సాహాలు చూస్తే మాత్రం ఆధ్యాత్మం, వేదాంతం అనేవి ప్రపంచాన్ని వదిలేయమని చెప్పేవి కావనిపిస్తుంది. జీవితమంటే నిరుత్సాహం కాదు, ఆనందాన్ని పొందడం అంటారు ఆయన. పరమాత్మ దృష్టితో ప్రపంచాన్ని చూస్తే, నలుదిక్కులా ఆనందం, అందం, శుభమే కనిపిస్తుంది. ఆ దృష్టి యొక్క సీమలు పెరుగుతూనే ఉంటాయి, వికారమైనది ఏదీ మిగలదు.

స్వామి చిన్నతనమంతా చాలా కష్టాల్లో గడిచింది. కష్టాలు, సవాళ్ళతో పాటే ఆయన పుట్టారు. క్రీ.శ.1873వ సంవత్సరంలో దీపావళికి పంజాబ్‌లోని మురలివాలా అనే ఊళ్ళో పుట్టారు.

**ఓటమికి భయపడకండి**

పుట్టిన కొన్ని రోజుల్లోనే తల్లి చనిపోయింది. మేనత్తనే పెంచి పోషించింది. సాధ్వీమణి అయిన మేనత్త తనతో పాటే భజనలకీ, పూజలకీ, దైవదర్శనాలకీ రామతీర్థుని కూడా తీసుకుని వెళ్ళేది. ఆవిడ అండదండల్లోనే ఆయన శిక్షణ కొనసాగింది.

ముందు ఊళ్ళో, తరువాత బస్తీలో, ఉన్నత విద్యకి కూడా చాలా కష్టాలు ఎదుర్కొన్నారు. విద్యార్థిగా ఉన్నంతకాలం ఆయన ఆర్థిక పరిస్థితి చాలా దారుణంగా ఉండేది. చాలా సార్లు ఆకలితోనే పడుకునేవారు. అయినప్పటికీ ఆయన చాలా మేధావి. ఎప్పుడూ క్లాసులో మొదట నిలిచేవారు. బి.ఎ.లో మొదటి స్థానంలో వచ్చినందుకు నెలకు ఆరు రూపాయల స్కాలర్‌షిప్ లభించింది. అప్పుడు కాస్త ఇబ్బంది తగ్గినప్పటికీ, ఆయన ఆ ధనాన్ని ఇతర పేద విద్యార్థులకు సహాయంగా పంచేసేవారు.

లెక్కలంటే ఆయనకు చాలా ఇష్టం. కష్టమైన లెక్కలు చేయడం ఆయన వ్యసనం. రాత్రి తెల్లవార్లూ అలా కూర్చునే వారు. ఒకసారైతే పది కష్టమైన ప్రశ్నలు తీసుకుని సూర్యోదయానికల్లా పూర్తి చేయలేకపోతే తల నరుక్కుంటానని ప్రతిజ్ఞ చేసారు. సవాలుగా కాగితం, కలంతో పాటు మంచం కింద కత్తి కూడా సిద్ధంగా ఉంచుకున్నారు. తొమ్మిది ప్రశ్నలు మూడో ఝాముకే పూర్తయ్యాయి, కాని చివరిది చాలాకష్టంగా ఉండింది. ఎన్నిసార్లు ప్రయత్నించినా రాలేదు. సూర్యుడి తొలి కిరణం భూమి మీద పడిందో లేదో ఆయనకు తన ప్రతిజ్ఞ గుర్తొచ్చి కత్తి తీసారు. మెడ మీద పెట్టి గట్టిగా రక్తం వచ్చేట్టు నొక్కారు. రక్తపు చుక్కలు కొన్ని చిందాయో లేదో, ఒక్కసారిగా ప్రశ్నకు జవాబు విద్యుత్ కిరణం లాగా ఆకాశంలో వెలిగింది. ఆ జవాబు చూసి కత్తి దించారు. ఈ సంఘటన గురించి వ్యాఖ్యానిస్తూ స్వామీజీ, **"నీ అస్తిత్వాన్నంతా ఒడ్డినప్పుడు, తన పూర్తి సామర్థ్యంతో అస్తిత్వం నీకు సహాయపడుతుంది. సహాయం చేయడానికి పరిగెట్టుకుంటూ వస్తుంది.** కానీ పందెం పెట్టే ముందు పూర్తిగా ప్రయత్నించాలి. అంతే కానీ సవాలు ఎదురు కాగానే పారిపోకూడదు." అన్నారు.

విద్యార్థిగా ఉన్నప్పుడు ఆయన ఎదుర్కున్న కష్టాల్లో చాలా ప్రసిద్ధమైన కొన్నిటిని విన్నా ఆయన స్థిరత్వం గురించి తెలిసిపోతుంది. ఆయన జీవిత చరిత్ర రాసిన సర్దార్ పూరన్ సింగ్ ఒకచోట ఇలా వ్రాసారు, "ఒకసారి అన్ని నెలవారీ ఖర్చులు పోగా రోజుకు మూడు పైసలు మాత్రమే మిగిలేవి. ఏం పరవాలేదు అన్నది మనస్సు. ఈశ్వరుడు పరీక్షించాలనుకుంటున్నాడు, ఇంతలో ఆనందంగా ఉందాం. అప్పట్లో ఆయన ఒక పంజాబీ హోటల్‌కెళ్ళి పొద్దున భోజనానికై రెండు పైసలు ఖర్చు పెట్టేవారు. రాత్రి భోజనానికి ఒక పైసా. పొద్దున రెండు రొట్టెలు, పప్పు. రాత్రికి ఒక రొట్టె పప్పు. కానీ నిజానికి ఆయన ఇచ్చే డబ్బు రొట్టెలకే. పప్పు మాత్రం హోటల్ యజమాని ఉచితంగా ఇచ్చేవాడు. కొన్నాళ్ళు ఓపిక పట్టినా, ఒక రోజు చెప్పనే చెప్పాడు. అయ్యా పప్పు రోజూ ఉచితంగా ఇవ్వడం ఇబ్బందిగా ఉంది అని. ఆ రోజు నుండి స్వామి ఒంటి పూట భోజనంతోనే తృప్తి చెందేవారు."

ఇంతటి క్లిష్టపరిస్థితిల్లోనే స్వామి గణితంలో ఎం.ఎ చేసారు. 13 ప్రశ్నల్లో ఏవైనా తొమ్మిదింటికి జవాబులు రాయమంటే స్వామి యొక్క మేధ, ఆత్మవిశ్వాసానికి గుర్తుగా కాబోలు అన్నిటికీ జవాబులు వ్రాసి, ఏవైనా తొమ్మిదింటికి మార్కులు వేయమని వ్రాసారు. ఈ ప్రచండ ఆత్మవిశ్వాసానికి కారణం ఆ ఈశ్వరుడే అని అంటారాయన. "ఈ ప్రపంచంలో మనం నమ్మదగిన వస్తువు ఏదీ లేదు. ఆయనపై శ్రద్ధ ఉన్న వారి మీదనే ఈశ్వరుని కృప ఉంటుంది. వారే నిజమైన సాధువులు." అని ఒక చోట వ్రాసారు.

1896లో స్వామి రామతీర్థ లాహోర్‌లోని మిషన్ కాలేజీలో గణిత ప్రొఫెసర్‌గా నియమింపబడ్డారు. కేవలం నాలుగేళ్ళు ఉద్యోగం చేసారు. కొన్నాళ్ళే మిషన్ కాలేజీలో పని చేసారు, ఆ తరువాత ఓరియంటల్ కాలేజీలో రెండు గంటలు రీడర్‌షిప్ చేసారు. ఆ రోజుల్లోనే ఆధ్యాత్మికం, భక్తి ఆయనలో పుంజుకుంటున్నాయి. విద్యలో ఎంత తొందరగా ఉన్నత శిఖరాలకు చేరారో, సాధనలో కూడా అంత తొందరగానే ఉన్నత శిఖరాలు చేరుకున్నారు. 1900 సంవత్సరంలో లౌకిక జీవితానికి స్వస్తి చెప్పి ప్రొఫెసర్ తీర్థరామ్ నుండి స్వామి రామతీర్థ అయ్యారు.

సన్యాసం తీసుకున్న తరువాత స్వామి కేవలం ఆరు సంవత్సరాలే జీవించి ఉన్నారు. ఈ కాలంలోనే ఆయన జపాన్ మరియు అమెరికా దేశాలను పర్యటించారు. 1903లో జరిగిన ప్రపంచధర్మ సమ్మేళనంలో కూడా పాల్గొన్నారు. స్వామి వివేకానందుల వారు పాల్గొన్న చికాగో సమ్మేళనమంత ప్రసిద్ధి ఈ సమ్మేళనానికి రాలేదు. కానీ అమెరికాలోని విద్వాంసులు ఆయన్ని నడుస్తున్న ఏసు అవతారంగా గౌరవించేవారు. ఆయన ముఖ్య సందేశం ఈశ్వరుని మన జీవితాల్లో ప్రతిష్ఠించుకోవడం.

**గెలిస్తే వినయంగా ఉండు, ఓడిపోతే ఓర్పుగా ఉండు**

ఈశ్వరుడు మన నియతను నియమించేవాడిగా ఉన్నప్పుడే అన్నీ పద్ధతిగా ఉంటాయి. ఆయన మాటల్లో, "హే మనిషి! నీవే ఈశ్వరుడవు, శరీరం చుట్టూ తిరగడం మాని వేయాలి. శరీర చైతన్యం వదిలినప్పుడు ఈశ్వరీయ చైతన్యం దానంతటదే వచ్చేస్తుంది."

"రాజకుమారుడు బడికి వెళ్తున్నప్పుడు, తోటివారితో ఆడుతున్నప్పుడు కూడా తాను రాజకుమారుడిననే ఎరుకతోనే ఉంటాడు. అదే విధంగా ప్రతి ఒక్కరు తాను ఈశ్వరుని రాజ కుమారుడి లాగానే అన్ని పనులు చేయాలి." ఆయన స్వయంగా ఇదే స్థితిలో ఉండేవారు. శాన్‌ఫ్రాన్సిస్కో యాత్రలో ఆయన ఉత్సాహం చూసి ఆయన తోటి ప్రయాణికుడు ఆశ్చర్య పోయాడు. ఒడ్డు దగ్గరపడగానే ప్రయాణికులందరు సామాను సర్దుకుని అందరికన్నా ముందు నావ దిగడానికి తొందర పడుతున్నారు. స్వామి రామతీర్థ మాత్రం అలా ప్రశాంతంగా తమలో తామే నిమగ్నమై ఉండడం చూసి, "మీరు దిగక్కర్లేదా? మీ సామానేది? త్వరగా సర్దండి మళ్ళీ నిచ్చెన తీసేస్తారు" అన్నాడు. "ఈ శరీరంలో ఏముందో అవే తోడున్న సామాను. రాజాధిరాజు రాముడు అంతకు మించి ఏదీ ఉంచుకోడు" అన్నారు స్వామి. "మరి ధనము, వైభవాన్ని మాత్రమే పూజించే ఈ దేశంలో మీరేంచేస్తారు, ఎక్కడుంటారు?" అని తిరిగి ప్రశ్నించాడు. "రాముడిని పిలిపించి పంపించినవాడే అన్నీ చూసుకుంటాడు. దానితో రాముడికేం పని?". ఆ ప్రయాణికుడు మళ్ళీ అడిగాడు, "మీ స్నేహితుడెవరైనా ఉన్నారా? మీకెవరైనా తెలుసా?" స్వామి జవాబిచ్చారు, "ఓ, ఎందుకు లేరు? రాముడికి ఒకే మిత్రుడు తెలుసు, అది నువ్వే!"

ఆ పాశ్చాత్యుడు స్వామి ఆత్మవిశ్వాసానికి, మమకారానికి చాలా ప్రభావితుడైయ్యాడు. స్వామీజీ నివాసానికి ప్రారంభం లోని వ్యవస్థ ఆ వ్యక్తే చేసాడు. అతను దీక్ష తీసుకుని, ఆయన్ని గురువుగా ఆరాధించాడు కూడా. అందరినీ తనవారిగా చేసుకోవడం, లౌకిక-ఆత్మిక సాఫల్యం పొందడమే ధర్మము, ఆధ్యాత్మికం. నిష్ఠతో ఈ ధర్మాన్ని పాటిస్తే, జీవితం ఆనందంలో ఓలలాడుతుంది. 'సాఫల్యానికి రహస్యం' అనే ప్రసిద్ధ వ్యాఖ్యానం స్వామి స్వంతం. చికాగోలో స్వామి వివేకానందుని వక్తృత్వం కన్నా ఎక్కువ దీని గురించి చర్చించారు. జీవించేకళను నేర్పించే శిక్షకులు, వక్తలు, రచయితలు ఈ వ్యాఖ్యానానికి చాలా విస్తృతంగా పుస్తకాలు వ్రాసారు. స్వామి ఇందులో చెప్పిన ఏడు ఉపాయలను అవలంభించుకుంటే మనిషి, కుటుంబం, సమాజం యొక్క సర్వతోముఖ ఉన్నతి తథ్యం. ఆ సిద్ధాంతాల గురించి స్వామి ఇలా అంటారు, "సాఫల్యం సాధించడం అనేది ఒక అందరికి తెలిసిన రహస్యం. దీని గురించి ఎవరైనా ఏదో ఒకటి చెప్పగలరు, కాని ఆ సిద్ధాంతాలను నైపుణ్యంతో కార్య రూపం దాల్పించగలగడం అసలైన విషయం. ఏ వ్యక్తి అయినా, దేశమైనా, ఏ ఉపాయాలతో అభివృద్ధి సాధిస్తున్నా, దాని వెనక ఖచ్చితమైన ఆధారం ఏమీ లేనప్పుడు, పతనం అయ్యే అవకాశాలు కోకొల్లలుగా ఉంటాయి."

ఆ సిద్ధాంతాల వ్యాఖ్యానంలో స్వామి ఏడు సోపానాలు ఖచ్చితం అన్నారు. వాటి పేర్లు – పని (పరిశ్రమ), ఆత్మత్యాగం, ఆత్మ విస్మృతి (లక్ష్యం పట్ల తన్మయత్వం), సార్వభౌమిక ప్రేమ, ప్రసన్నత, నిర్భయం మరియు ఆత్మనిర్భరత. స్వామి ప్రకారం ఈ సోపానాలలో ఆధ్యాత్మికం యొక్క సమగ్ర భావన ఇమిడి ఉంది. ప్రపంచానికి ఇవ్వగలిగేది భారతదేశం దగ్గర చాలా ఉన్నా, ఇప్పుడు అది ఆత్మవంచనలో మునిగి ఉంది కాబట్టి పరాభవం పాలైంది. దేశంతో తాదాత్మ్యం చెందే దృష్టి వచ్చినప్పుడే ఉన్నతి దక్కుతుంది.

నేనే సంపూర్ణ భారతంగా విస్తరించాను, నా సర్వస్వం దేశానికి ధారపోస్తున్నాను అనే భావన స్వామి తమ కావ్యాత్మక భాషలో ఇలా వ్యక్తపరిచారు, "భారతదేశం నా శరీరం. కొమోరిన్ (కేరళ), తమిళనాడు నా కాళ్ళు, హిమాలయాలు నా తల. నా కేశాల నుండి గంగ ప్రవహిస్తుంది, తల నుండి బ్రహ్మపుత్ర, సింధు నదులు ప్రవహిస్తాయి. వింధ్యాచలం నా నడికట్టు. కోరమండలం, మలబార్లు నా కుడి, ఎడమ తొడలు."

కొన్ని వేదాంత సూత్రాలకు తామే బ్రహ్మ అని ప్రకటించడం లోని ఆ సహజత్వం అర్ధమవుతుంది. ఆ ప్రకటనల్లో ఆయనే స్వయంగా చైతన్యం, శివం, బ్రహ్మ, పరాత్పర సత్తా మొదలైన రూపాల్లో నిర్వచించారు. 'అహంభావం' పూర్తిగా లుప్తమై పోయాక వచ్చే స్థితి ఇది. స్వామిరామతీర్థ భరతవర్షం రూపంలో తమని తాము పరిచయం చేసుకున్నారు, అంటే అర్ధం తమ వ్యక్తిగత స్వార్ధాలు, ఆత్మచైతన్యం అన్నింటినీ భారతీయ చైతన్యంలో లయం చేసుకోవడమే. తమని తాము దేశం యొక్క ఆత్మలో లయం చేసుకునే వారు వందమంది పుట్టుకొచ్చినా, దేశం ఉన్నత శిఖరాలను చేరుకుంటుంది.

*– అఖండజ్యోతి, అక్టోబరు 2000*

*అనువాదం: శ్రీమతి జయలక్ష్మి*

**డబ్బుంటే దయాగుణంతో ఉండు, డబ్బు లేకపోతే నిజాయితీగా ఉండు**

బోధ కథ

# ఒక మాతృమూర్తి ఆవేదన

వెన్న-పటిక బెల్లం ఉన్న స్వర్ణపళ్ళెమును చేతనుంచుకొని మాతా దేవకి అంటుంది - "కృష్ణా! కుమారా! నీకు ఎంతో ఇష్టమైన వెన్న-పటిక బెల్లంతో కలిసి ఉన్న భోజనం నీ కొరకు సిద్ధంగా ఉంది. వచ్చి తిను-కుమారా!" కృష్ణుడంటున్నాడు - "సరే! అమ్మా!" తల్లిగారు భోజనాన్ని ఆయనకెదురు ఉంచగా, దాన్ని చూసి కూడా భుజించక మౌనంగా ఉన్న కుమారుని చూసి మాతా దేవకి అంది - "ఏమిటి నాయనా! తినవేమి?" అప్పుడు కృష్ణుడి కంటి నుండి రెండు కన్నీటి బొట్లు రాలటం చూసిన ఆమె, కృష్ణుని తల నిమురుతూ ఇలా అంది - "కుమారా! నీ ఈ అభాగ్యురాలైన తల్లి ఏ తప్పు చేసిందని, నీ కిష్టమైన భోజనం తినకుండా ఎందుచేత విలపిస్తున్నావు?"

గతించిన కాలంలో కృష్ణుని మదిలో జరిగిపోయిన ఏ స్మృతిలో జ్ఞప్తికి వచ్చి మనకు కలతబారిందో తెలియదు. గంభీరమైన మౌనంలో ఆయన పెంపుడు తల్లి యశోదామాతా గుర్తుకొచ్చింది. ఈ వెన్న పటికబెల్లంతో కూడిన తీపి గుర్తులతో యశోదామాతతోపాటు గోకులంలోని ఎన్నో మధురాను భూతులు ఒక్కసారిగా మనసులో నిండిపోయి, కలచివేయ సాగాయి. తాను చిన్నతనంలో చేసిన ఎన్నో తుంటరి చేష్టలు, ఎన్నో ఫిర్యాదులు, యశోదామాతా వాత్సల్యపూరిత ప్రేమలు, అన్నీ కలిసి నేడు తాను చూస్తున్న ఈ పళ్ళెం తనకు గుర్తు చేస్తున్నట్లు అయ్యింది! చిన్నతనంలో తనను తన ఒడిలోనికి తీసుకొని, అమ్మ కొసరి-కొసరి మృష్టాన్నాన్ని ఎలా తినిపించిందో... చివరకు పెద్దైన తరువాత కూడా మొదటి ముద్దను ప్రేమతో ఎలా నోటికందించేదో అన్నీ ఒకటొకటిగా కృష్ణుని మదిలో మెదలసాగాయి. ఒక్కోసారి నోటిలో ముద్ద పెట్టే సమయంలో తన దంతాలమధ్య ఆమె వేళ్ళు కూడా నలిగేవి. అప్పుడు అమ్మ పెద్దగా అరుస్తూ తండ్రిగారితో అనేది. "చూడు నందరాజా! మీ సుపుత్రుడు ఇంత పెద్దగా ఎదిగినా కూడా ఇంకా చిన్నతనం-చిలిపితనం పోలేదు. చిన్నతనపు తుంటరి తనపు చేష్ట ఇప్పుడు కూడా చేస్తున్నాడు?" అప్పుడు నందరాజు అమ్మతో ఇలా నచ్చచెప్పుధోరణిలో - "యశోదా కుమారుడు ఎంత ఎదిగినా తన తల్లిదండ్రుల వద్ద ఎప్పుడూ చిన్ననాటి చిలిపి పనులు చేయబూనటం సహజమే కదా!" అని అన్నాడు. ఆరోజు ఎందుకనో అమ్మ తనను ఒడిలో చేర్చుకొని కుమిలి- కుమిలి పెద్దగా ఏడవడంతో, తండ్రిగారు ఎంతగా ఓదార్చినా ఆపలేకపోయినప్పుడు, తాను మాతా యశోదాదేవిని ఓదార్చి అక్కున చేర్చుకొన్న విషయం మాటిమాటికి గుర్తుకొస్తున్నది.

కృష్ణుని కంటికెదురు, తాను గోకులం వదిలి మధురకు ప్రయాణమయ్యే విషయం కూడా ఈ రోజు గుర్తుకురాసాగింది. ఆనాడు తనను వదలి ఉండలేక ఆమె పడిన దారుణ విరహ వేదన నివారించలేనిది. ఆమె కాదు. గోకులంలోని వారెవ్వరికి తాను మధురకు చేరటం ఇష్టం లేదు. కాని మధురకు చేరటం తప్పనిసరి అయ్యింది. ఆరోజు అమ్మ ఉన్న మందిరానికి వచ్చి చూస్తే అమ్మ పరిస్థితి దారుణంగా ఉంది. ఏడ్చి-ఏడ్చి ఆమె కళ్ళు ఎర్రగా మారాయి. గొంతు పూడుకుపోయింది. తండ్రి గారు ఆమెకు ఎంత నచ్చచెప్పి, ఓదార్పు చేసినా కూడా ఆమెతోపాటు తండ్రిగారు కూడా వికల మనస్కులవటం స్వయంగా చూడటం జరిగింది. వారి నుండి చివరిసారి వీడ్కోలు తీసుకొనే సమయంలో తల్లిగారితో కృష్ణుడిలా అంటున్నాడు- "అమ్మా! నేను మరలా తిరిగి నీ వద్దకు తప్పక వస్తాను. అప్పుడు నాకు మరలా వెన్న - పటిక బెల్లాన్ని నీ చేతులతో నాకు తినిపించెదవు గాక. ఎప్పటివరకు నీ వద్దకు తిరిగిరానో అప్పటివరకు నేను నాకిష్టమైన ఈ వెన్న పటిక బెల్లమును ఎన్నడూ చేతితో ముట్టను."

కృష్ణుడు - దేవకీమాతతో, తాను యశోదామాతకు ఇచ్చిన మాటను తిరిగి గుర్తు చేస్తూ ఇలా అన్నాడు - "అమ్మా! ఒక ప్రక్క చూపు ప్రేమమయ వాత్సల్యం - నీవే చెప్పు అమ్మా ఇరువురి తల్లులకు పుత్రుడనైననే నేను ఎటువంటి ధర్మ సంకటంలో ఇరుక్కుపోయానో చూడు?

ఇప్పుడు ఈ విషయాలన్నీ దేవకీమాత - అర్జునుని మధ్య జరుగుచున్న మాటలు! విన్న అర్జునుడు జిజ్ఞాసతో తిరిగి దేవకీ దేవితో అడిగాడు - "మరి చివరకు ఏం చేసాడమ్మా... శ్రీ కృష్ణుడు...?"

అందుకు ఆమె ఇలా అంది- "చివరకు తాను ఏది

**బాధలో ఉన్నవారికి ఊరట కలిగించే మాటలు చెప్పాలి**

అనుకొన్నాడో అదే చేసాడు కన్నయ్య! నా ప్రేమ మమతలను పంచుటలో మోహం-స్వార్థంతో నిండి ఉంది. కానీ యశోదకు ఇచ్చిన వాగ్దానం స్వార్థపూరితమైంది కాదు... అది త్యాగంతో ఇవ్వబడింది. త్యాగం - బలిదానాలే ప్రేమకు పర్యాయంగా నిలబడుతుంది. ఎక్కడ స్వార్థరాహిత్యం ఉంటుందో అక్కడ ప్రేమ స్థిరంగా నిలచి ఉంటుంది. అందువల్లనే నా కుమారుడు కృష్ణుడు యశోదాదేవి ఇచ్చిన మాట మీద నిలుచుటయే ధర్మబద్ధమైనది. ఇటువంటి ప్రేమ కారణంగానే యశోద మాతృత్వం నా కన్నా ఎంతో విలువైంది. ఇటువంటి వాత్సల్య ప్రేమ కారణంగానే ఈ లోకం "యశోదా కృష్ణునికి ప్రియమైన మాతృదేవత" అని కొనియాడబడుతుంది."

అర్జునుడు ఇదంతా విని స్తబ్దుడయ్యాడు. అతని హృదయం ఆనందంతో నిండిపోయి, ఇంకా దేనిని వినుటకు సాధ్యం కాకుండాపోయింది. ఒక విధంగా అతడు చేతనను పోగొట్టు కున్న వానిగా మారాడు. దేవకీమాత నుండి మరికొన్ని మాటలు ఇలా వినబడసాగాయి. "అర్జునా! కృష్ణుణ్ణి నా చెంత చేర్చుకోవటం కొరకు పిచ్చిదానిగా మారాను! పధ్నాలుగు సంవత్సరాల తరువాత నేను ఎదురుచూసిన పిదపగాని అతణ్ణి నేను పొందలేక పోయాను. నేను విన్నదేమంటే కృష్ణునికి వెన్న-పటికబెల్లం ఎంతో ఇష్టమని. నా మనస్సులో యశోదా ఎడల ఈర్ష్య భావం నెలకొని ఉంది. అర్జున కుమారా! అధికారవంతమైన ఈ భావనలో అహంకారపు వాసన ఉంటుంది. **ఎక్కడ అహంకార ముంటుందో అక్కడ ప్రేమ ఉండదు,** స్వార్థముంటుంది. నాలో కృష్ణుని ఎడల అధికార భావముంది. అందువల్ల ఈ వెన్న - పటికబెల్లం భోజనంలో నా ప్రేమలేదు. నా స్వార్థమే ఉన్నది. ఇతరుల మనోభావాలను తెలుసుకోగల కృష్ణుడు, నాలోని ఈ మనోభావాన్ని కూడా తెలుసుకోగలిగాడు. ఆ భావన ఏదంటే, నేను యశోదాగా మారే మొండితనం చూపినట్లుగా నా పరిస్థితి అయ్యింది. అయినా కూడా అతడు నా మర్యాదను నిలిపి, ఏమనకుండానే కేవలం తన వచనబద్ధతని స్నేహ పూరితంగానే నాకు తెలియపరిచి, నాకు అసంతృప్తిని కలిగించ కుండా చూపాడు"

ఈ మాటలన్నింటిని అర్జునుడు కేవలం శాంతంగా, మౌనంగా వింటూ ఉండిపోయాడు. దేవకీమాత ఎక్కడైతే తాను కృష్ణునకు వెన్న-పటికబెల్లం తినిపించాలనుకున్నదో ఆ స్థానానికి అర్జునుణ్ణి తీసుకొనిపోయింది. "చూడు! చూడు!! అర్జునా చూడు! ఇక్కడే నేను నా హృదయంలో భాగమైన నా కన్నయ్యకు వెన్న-పటికబెల్లం తినిపించాలని నేను కూర్చున్న చోటు ఇదే! అయితే అప్పటినుండి నేటివరకు ఇక్కడకు కృష్ణుడు రానేలేదు. కంపిస్తున్న కంఠస్వరం వలె, ఆమె జర్జర శరీరం కూడా తూలిపోసాగింది. తూలిపడబోతున్న దేవకిని అర్జునుడు పొదిలి పట్టుకున్నాడు. కానీ అతని కంఠం కూడా కంపనతో కృష్ణా-కృష్ణా అంటూ మారుమ్రోగసాగింది.

అర్జునుడు పూజ్యులైన వసుదేవ-దేవకిలకు ప్రభాస క్షేత్రంలో జరిగిన కృష్ణుని మహాప్రయాణపు దారుణ ఉదంతాన్ని తెలుపుటకు వచ్చి, ఆ విషయాన్ని ఏ విషయాన్ని ఏ విధంగా ఈ వృద్ధదంపతులకు ఎలా తెలపాలో తెలియక కొట్టుమిట్టాడ సాగాడు. ఎల్లవేళలా కృష్ణ సాన్నిధ్యం పొందిన అర్జునుడు ఈనాడు కృష్ణవిహీనుడయ్యాడు. తనను ఘోర అభాగ్యునిగా భావించుకొంటూ, చేసేది లేక చివరకు దృఢ మనస్సును చిక్కబట్టుకొని వసుదేవునితో - "తండ్రీ! నా సఖుడు స్థూలదేహాన్ని వదలివెళ్ళిపోయాడు." పూడుకుపోయిన గొంతుతో ఈ మాట మాత్రమే చెప్పిన అర్జునుడు చైతన్యాన్ని కోల్పోయాడు. దేవకీమాత ఆ సమయంలో తన భవనంలో ఉంది. కన్నీరు నిండిన కళ్ళతో దుగ్ధ కంఠంతో ఇలా అన్నాడు - "తండ్రీ! మరి ఈ విషయాన్ని దేవకీమాతకు తెలియపర్చండి. ఆమెకు తెలుపుట నా వల్ల కాదు. నాకా ధైర్యం కూడా లేదు. తడిబారిన కళ్ళతో వసుదేవుడు అన్నాడు - "అలాగే మంచిది"

వసుదేవునితో కలసి అర్జునుడు దేవకిమాతకు ప్రణామాలు చేయటానికి చేరాడు. దేవకి ఒక్కసారిగా విషయం తెలిసి స్తంభించిపోయి తలగడ మీద వాలిపోయింది. అర్జునుడు దేవకీపాదలనంటి ప్రణామాలు సమర్పించాడు! అప్పుడు దేవకి ఇలా అంది - "ఇప్పుడు-ఇక నేను నా చేతులతో నా కన్నయ్య లాలాకు ఎన్నటికి వెన్న-పటిక బెల్లాన్ని తినిపించ లేను. అర్జునా ఎన్నటికీ ఇది నా వలన కాదు గదా!"

అర్జునకు తన ప్రాణాలను ఎవరో పిండినట్లు అయ్యింది. అతడు భారమైన హృదయంతో, వణుకుతున్న అడుగులతో భవనం నుండి బైటకొచ్చాడు. అర్జునునికి మదిలో దేవకిమాతా అన్ని మాటలు ప్రతిధ్వనించసాగాయి. దేవకి నీ కోసం ప్రతీక్షించుచున్నది కృష్ణా! దేవకి నీ కోసం ప్రతీక్షించుచున్నది కృష్ణా....!

*- అఖండజ్యోతి, జనవరి 2011*

*అనువాదం: జి. చెన్నకేశవరావు*

**అందరినీ అన్ని వేళల సంతృప్తి పరచాలంటే కుదరదు**

# విద్య-స్వావలంబనను, వివేకాన్ని పెంపొందించాలి

బెంగుళూరులోని చిక్‌పేట ఒక ప్రముఖ వ్యాపార కూడలి. 1000 దుకాణాలకు పైగా ఉన్నాయి. బట్టలు, గృహోప కరణాలు, ఆట బొమ్మలు మున్నగునవి టోకుగా విక్రయించుట జరుగుతుంది. నా విద్యా పరిశోధనలో భాగంగా కొంతమంది దుకాణదారులతో మాట్లాడుతూ వారు ఏ రీతిగా వ్యాపారం చేస్తూ ఉంటారు అనే దానిపై పరిశోధన చేయుట జరిగింది. దీనిలో భాగంగా, వారి విద్యార్హతలు చదువుకు వ్యాపారానికి గల సంబంధంపై పరిశోధన జరిపాను. ఎక్కువమంది రాజస్థాన్ నుండి వచ్చిన వారే! వీరంతా 18 నుండి 21 సంవత్సరముల వయస్సు వారే అగుట మరో విశేషం.

10వ తరగతి చదువుతూ మధ్యలో విరమించుకొని బట్టల దుకాణాన్ని బ్రహ్మదేవ్ నడుపుతున్నాడు. ఇతనితో జరిపిన సంభాషణను మీతో పంచుకుంటాను.

దుకాణం, కొనుగోలుదార్లతో క్రిక్కిరిసి ఉన్నది. నేను కూడా ఒక కొనుగోలుదారుని వలె ఆ షాపులో ప్రవేశించగానే అతను చక్కగా నవ్వుతూ నన్నులోనికి ఆహ్వానిస్తూ కన్నడంలో" అన్న బన్ని ఎన్ బెకెతు' (అనగా సోదరా మీకు ఏమి కావాలి?)" అన్నాడు. మా సంభాషణ కన్నడంలో సాగింది. దానిని తర్జుమా చేసి ఈ క్రింద ఇస్తున్నాను.

బ్రహ్మదేవ్: చెప్పండి సార్! మీకు ఎంత ఖరీదులో కావాలి?'

నేను: ముందు నాకు అన్ని చూపించండి. నాకు కావలసిన బట్టలను ఎన్నుకుంటాను.

బ్రహ్మదేవ్: తప్పకుండా సార్! బట్టలు అన్నీ రకాలు చూపించ సాగాడు. (ఈలోపు నేను కావలసినవి ఎంపిక చేసే సమయంలో కొన్ని ప్రశ్నలు సంధించసాగాను. నేను వచ్చిన పని అదే కాబట్టి.)

నేను: కన్నడం ఎలా నేర్చుకున్నావు?

బ్రహ్మదేవ్: సార్! ప్రజలతో మాట్లాడటం ద్వారా నేర్చుకున్నాను.

నేను: చాలా బాగా కన్నడం మాట్లాడుతున్నావే?

బ్రహ్మదేవ్: సార్! మొదట చాలా కష్టంగా ఉంది! కొనుగోలు దార్లతో మాట్లాడుతూ, మాట్లాడుతూ నాకు వచ్చింది. నేను బెంగుళూరు పౌరులకన్నా బాగా కన్నడం మాట్లాడతాను.

నేను: "చాలా గొప్పగా ఉంది. వ్యాపారం ఎప్పుడు ప్రారంభించారు.

బ్రహ్మదేవ్: "పది సంవత్సరాలు పూర్తి అయింది. నేను 10వ తరగతి తప్పాక ఈ వ్యాపారంలోకి మా మామద్వారానే ప్రవేశించాను.

నేను: "నీవు ఎన్ని భాషలు మాట్లాడగలవు?

బ్రహ్మదేవ్: నేను హిందీ, ఇంగ్లీషు, మరాఠీ, తమిళం, తెలుగు, మళయాళం కొంత మాట్లాడుతాను.

"ఓరి భగవంతుడా! ఇన్ని భాషలు ఎలా నేర్చుకున్నావు?"

"నా కొనుగోలుదార్లే ఈ భాషలన్నింటిని నేర్పారు" అని పెద్దగా నవ్వాడు.

"క్షమించాలి. ఏదో ఉండబట్టలేక నిన్ను ఒక ప్రశ్న అడుగుతున్నాను. ఏమి అనుకోవుగా? నీ నెలసరి వ్యాపారము ఎంత?"

"ఊ! ... ఇది పండుగల గిరాకీపై ఆధారపడి ఉంటుంది. సాధారణంగా నెలసరి అమ్మకాలు 8 నుండి 9 లక్షలు ఉంటుంది. పండుగ సమయాల్లో ఈ అమ్మకాలు 15 లక్షల వరకు ఉంటుంది. లాభం నెలకు 4 లక్షలు.

"ఏమి? ఓరి భగవంతుడో! ఆ సంఖ్యలు చాలాచాలా పెద్దవి. చాలా గొప్పవాడివయ్యా! నీవు అసాధ్యుడవే!

"ఏమి గొప్ప సార్? ఈ ఛిక్‌పేటలో నా అమ్మకాలు చాలా తక్కువ. ఇతరులు నాకు రెండింతలు చేస్తారు!"

"అర్థాంతరంగా నిలిచిపోయిన నీ చదువును పూర్తి చేయాలని నీకు అన్పించలేదా?"

"అయ్యా! నిజంగా చెప్పాలంటే నా కుటుంబంలో ఏ ఒక్కరు పూర్తిగా చదువుకోలేదు. నా చదువు పూర్తిచేయుటకు నాకు మరో 5-6 సంవత్సరాలు పడుతుంది. ఇది నాకు వృధా అనిపిస్తుంది. డబ్బు మరియు సమయం కూడా వృధా!

నా వ్యాపారంలో నా సమయాన్ని, ధనాన్ని పెట్టుబడిగా పెట్టాను. నేను ఒక్కటి గట్టిగా చెప్పగలను. 10 సంవత్సరాలు అనుభవముండి ఎంతగా చదువుకున్నవాడు సైతం, నా అంత సంపాదించజాలడు. మీరు ఏమంటారు సార్?

**ఎదగాలంటే సమస్యలు, సవాళ్ళు అవసరమే**

"ఆ...ఆ... నిజమే! కాని ఉన్నత చదువు చదివితే ఈ వ్యాపారంలో నీవు ఇంకా ఎదుగుటకు అది తోడ్పడి ఉండేది మరియు ఇంకా ఎక్కువ సంపాదించి ఉండేవాడివి కదా!"

"లేదు సార్! అని దృఢంగా చెప్పాడు. చదువు మనలో భయాన్ని పాదుకొల్పుతుంది! బ్రతకటానికి మరొకరి క్రింద పని చేయాలనే భావనను కలిగిస్తుంది. విద్య స్వతంత్రంగా బ్రతకటం నేర్పదు. నాతోపాటు చదివిన నా స్నేహితులు అనేకమంది ఉన్నారు. వారంతా డిగ్రీ కూడా పాసయ్యారు. వారెవ్వరు వ్యాపారంలో ప్రవేశించలేదు. వారంతా ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్నారు.

"అయితే! నీవు నీ చదువును పూర్తిచేయనందుకు బాధపడుటలేదన్నమాట"

"ఖచ్చితంగా బాధపడుట లేదు సార్! పై పెచ్చు నేను చాలా సంతోషంగా ఉన్నాను. (మా సంభాషణ మధ్యలో ఒక కొనుగోలుదారుడు 20 జతల బట్టలు, చీరలు కొన్నాడు. క్యాలుక్యులేటర్ వాడకుండా, బ్రహ్మదేవ్ లోలోపలే గుణించుకొని కొనుగోలుదారునికి అతను చెల్లించవలసిన సొమ్మును తెలియ జేశాడు. 15-20 నిమిషాల వ్యవధిలో రిబేటుతో సహా చెప్పాడు నోటి గణితంతోనే.)

"యజమాని! నీవు క్యాలుక్యులేటర్ వాడవు కదా"

"సార్! చదువుకున్న వారికి కావాలి క్యాలుక్యులేటర్ మరియు మొబైల్‌ఫోన్స్, కూడికలకు తీసివేతలకు నాకు అక్కర లేదు (పెద్దగా నవ్వుతూ).

"నేను నవ్వుతూ తలదించుకొన్నాను. (నేను ఆ సమయంలో క్యాలుక్యులేటర్ వాడుతున్నాను నేను కొన్నవానిని ఎంచు కొనుటకై)

"నేను గత పది సంవత్సరాల నుండి ఇలా కూడికలు, గుణింతాలు చేస్తూ ఉన్నాను క్రమం తప్పక. దీనిలో నేను నిష్ణాతుడనయ్యాను. నా లెక్కలో ఎన్నడు తప్పు దొర్లదు.

"తరువాత! నేను ఆ రోజంతా మా మధ్య జరిగిన సంభాషణపై ఆలోచిస్తూనే ఉన్నాను. దీనినుండి నేను గ్రహించిన దానిని ఈ క్రింద పొందుపర్చుచున్నాను.

1. ఉన్నత చదువులేని బ్రహ్మదేవ్ కొలువులేనివాడు కాలేదు. దీనికి భిన్నంగా అత్యున్నత శ్రేణి మార్కులతో ఉత్తీర్ణులై డిగ్రీలు పొందిన అనేకులు ఉద్యోగాలకై వెతుకులాడుచున్నారు.

2. ఉన్నత చదువు లేకున్నను చక్కగా మాట్లాడగలదు బ్రహ్మదేవ్. తనను తాను చక్కగా వ్యక్తం చేసుకుంటున్నాడు. దీనికి భిన్నంగా చదువుకున్న అనేకులు తమ భావాలను, ఖచ్చితంగా స్పష్టంగా తమని తాము వ్యక్తీకరించుకొనలేరని నేటి మన డిగ్రీలు పొందిన వారిని తప్పుపట్టుచున్నది పారిశ్రామిక రంగం.

3. ఉన్నత చదువులు లేని బ్రహ్మదేవ్ మెదడు, ఉన్నత చదువులు చదివిన వారి మెదడు కన్నా చాలా వేగంగా గణితాన్ని చేస్తుంది. గణితం చేయుటకు వీరికి మొబైల్ ఫోన్లు కావాలి.

4. ఉన్నత చదువులేని బ్రహ్మదేవ్‌కు తన ఉద్యోగం పోతుందేమో ననే భయం లేదు. దీనికి భిన్నంగా మన కంప్యూటర్ కంపెనీ ఉద్యోగులు దిన దినగండం నూరేళ్ళ ఆయుష్షులా జీవిస్తున్నారు.

ఇప్పుడు నా మదిలోని ప్రశ్న "ఉన్నత చదువు ఏ విధంగా విద్యార్థికి సహాయపడుతుంది? ఎక్కువ చదువు ఎక్కువ భయాన్ని మనిషిలో కలిగిస్తుందా?

మన విద్యావిధానం మారాలి! విద్య స్వావలంబనను అందించేదిగా ఉండాలి! విద్య మనిషిలో ఆత్మ విశ్వాసాన్ని కలిగించాలి. వివేకాన్ని పెంపొందించాలి. వ్యక్తిత్వాన్ని పెంపొం దించాలి. ధైర్యాన్ని నింపాలి. శ్రమించుట నేర్పేదిగా ఉండాలి.

*సేకరణ: ఎ. వేణుగోపాలరెడ్డి*

## సిగరెట్ నీదైతే పొగ కూడా నీదే

*బాబు రాజేంద్రప్రసాద్ నౌకలో తన గ్రామానికి పోతున్నాడు. నౌకలో ఒక ప్రయాణీకుడు సిగరెట్టు త్రాగుతున్నాడు. నౌకంతా పొగచుట్టివేసింది. పొగవల్ల రాజేంద్రబాబుకు దగ్గు మొదలైంది. ప్రయాణీకుడుతో అన్నాడు. "ఈ సిగరెట్టు నీదేనా?" దానికి అతడు" మరినాది కాకపోతే? నీదా?" అని దురుసుగా సమాధానం ఇచ్చాడు. నీ సిగరెట్టు నుండి వచ్చే పొగకూడ నీదేగా? మరి నీపొగను నీ దగ్గరే ఉంచుకోక ఇతరుల మీదకు వదులుతున్నా వేమిటి?" అని ప్రశ్నించాడు. ప్రయాణీకుడు సిగ్గుపడి సిగరెట్టును ఆవతల పారేశాడు.*

- *అనువాదం: పొన్నూరు హైమవతీశాస్త్రి*

**పరిస్థితులతో పోరాటమే మనిషి ఊపిరి**

పూజ్య గురుదేవుల అమృతవాణి

# ఆధ్యాత్మికత అంటే రొక్కబేరమే-2

*పరమపూజ్య గురుదేవులు తమ యొక్క ఈ ప్రస్తుత ప్రవచనంలో "ఆధ్యాత్మికతను" గురించి విస్తృతంగా పరిశీలన చేస్తూ, దానిని "రొక్కబేరం"గా నిర్ణయం చేస్తున్నారు. నేటికాలంలో అమలుజరుగుతున్న ఆధ్యాత్మికతను నకిలీ (కృత్రిమమైనది) దనే చెప్పవచ్చు, అసలైన ఆధ్యాత్మికత యొక్క ఫలితాలు రొక్కబేరం వలే ఆక్షణాన్నే హస్తగతమౌతాయి. (రొక్కబేరం అంటే ఈ చేతితో డబ్బులిచ్చి ఆ చేత్తో మనకు కావలసిన వస్తువునందుకోవటం) నకిలీ ఆధ్యాత్మికత లేదా భౌతికవాద దృష్టికోణం విషయానికొస్తే, అక్కడ ఆధ్యాత్మిక విభూతులు మనం మరణించిన పిదపనో లేదా మరొక లోకంలోనో వాటికొరకు ఎదురుచూడవలసి వస్తుందని చెప్తూ పూజ్య గురుదేవులు దృష్టికోణంలో మార్పుచేసుకున్న వెంటనే అతనికి ఈ ప్రపంచంలో అంతరంగ సంతృప్తి ఉంటే దైవీ అనుగ్రహము వంటి  సమస్త సంపదలు అందుబాటులోకి రాగలవు అని పూజ్యగురుదేవులు ప్రవచిస్తున్నారు. రండి! వారి అమృతవాణిని మరింతగా హృదయంగమం చేసుకుందాం.*

కల్పవృక్షాన్ని ఆధ్యాత్మికత ప్రసాదించిన ఒక వరంగా భావించవచ్చు. నిజమైన ఆధ్యాత్మికత కలిగి ఉన్న వ్యక్తి కల్పవృక్షం క్రింద కూర్చున్న వ్యక్తికి ఎలాంటి వరాలు లభిస్తాయో అటువంటి లాభాలను ఆనందాన్నీ పొందగలడు. అతడి కోరికలన్నీ నెరవేరి తీరుతాయి.



ఋషిపరంపరకు చెందిన మానవులందరూ "పరిపూర్ణులు"గా అవుతారని చెప్పటంలో ఎలాంటి సందేహము లేదు. "పైథాగరస్" ను గురించి మీకందరికీ తెలుసు. ఆయనకు ఇల్లు, వాకిలి, ఆహార పదార్థాలు ఏమీ లేవు. ఆఖరుకు వస్త్రాలు కూడా లేవు కనుక నగ్నంగానే సంచరిస్తుంటాడు. ఒకరోజు ఆయన వద్దకు సికిందర్ వచ్చి ఏమి కావాలో కోరుకొనమని చెప్పాడు. పైథాగరస్ తనకేమీ అవసరం లేదని చెప్పగా, సికిందర్ తన వంటి మహారాజు కోరుకొనమని చెప్పినా ఏమీ వద్దని తిరస్కరించిన ఈ సన్యాసిని చూసి అలాకాదు, మీరు ఏదో ఒకటి కోరుకొనవలసిందే ఇల్లు, బట్టలు, ఏదైనా వస్తువులో... తప్పక చెప్పండి మీ కోరిక తీరుస్తాను" అన్నాడు. పదేపదే తిరస్కరిస్తే, మహారాజు బాధపడతాడని భావించి "ఉదయం పూట బాగా చలిగా ఉంటున్నది నాకు వెచ్చదనం కావాలి" అన్నాడు పైథాగరస్. రాజు వెంటనే "అదెంత భాగ్యం. క్షణంలో ఏర్పాటు చేస్తాను" అని సేవకులను పిలిచి, చలిమంట వేసేందుకు కావలసిన ప్రయత్నాలు చెయ్యండి అని ఆజ్ఞాపించాడు. చలిమంటలో లభించే వేడి నాకవసరంలేదు. రాజా! కొద్దిగా సూర్యుని నుండి వేడిమిని తెప్పించండి" అన్నాడు పైథాగరస్. "అది నాకు సాధ్యం కానిపని. నా పరిధిలో ఉన్న పనులేమైనా చెప్పండి" అన్నాడు రాజు. అప్పుడు సికిందర్ తూర్పుకు అభిముఖంగా నిలబడి ఉన్నాడు. సూర్యుడు అప్పుడప్పుడే ఉదయిస్తున్నాడు. కొద్దికొద్దిగా పైకి వస్తున్న సూర్యకిరణాల నుండి వచ్చే వేడిమి పైథాగరస్ శరీరాన్ని తాకనున్నది. పైథాగరస్ రాజుతోటి "దయచేసి చిన్న సహాయం చెయ్యండి. తూర్పునుండి కదలి వెళ్ళి పడమర దిక్కున కూర్చోండి. సూర్యకిరణాలు నా వంటిని స్పృశిస్తే నాకు కావలసిన వేడి లభిస్తుంది. నా ఈ కోరికను తమరు తీర్చగలరుగదా! అన్నాడు. సికిందర్ నిశ్శబ్దంగా ఒక్కక్షణం కూర్చుని, అక్కడ నుండి కదలి వెళ్ళిపోయాడు.

## ఒక ప్రత్యేకమైన లక్ష్యంతోనే ఏర్పడింది ఈ ప్రపంచం

మనం ఈ ప్రపంచంలో నుండి ముళ్ళను ఏరిపారెయ్యలేము. అవి విశ్వవ్యాప్తంగా ఎంతెంత ప్రదేశంలో విస్తరించి ఉన్నాయో వాటిని ఏరివెయ్యటమనేది మన పరిధికి మించి,

**మన వైఫల్యానికి మనమే బాధ్యులము**

మన నియంత్రణకు సాధ్యంకానిపని. అయితే మనం చెయ్యగలిగినది ఒకటి ఉంది. మనం మన పాదాలకు దృఢమైన పాదరక్షలను ధరించి బయటకు వెళ్ళగలం. అప్పుడు ముళ్ళు ఉన్నా, కంకరరాళ్ళు ఉన్నా మనకు ఎలాంటి హాని కలుగకుండా సురక్షితంగా, హాయిగా నడిచి వెళ్ళిపోగలం.

ఈ ప్రపంచానికి మనమేమీ గుత్తాధికారులం కాము. ఇది మన ఇష్టాఇష్టాలకనుగుణంగా ఏమీ నడవటంలేదు. ఈ ప్రపంచం మన ఒక్కరిదే కాదు. ఈ ప్రపంచం ఎంతమంది మనుష్యుల కోసం, ఎన్ని ప్రయోజనాల కోసం నిర్మించబడిందో, అసలు దీనిని ఎవరు నిర్మించారో... మనకేం తెలుసు? భగవంతుడు ఒక ప్రత్యేకమైన ప్రయోజనం కోసమే ఈ ప్రపంచాన్ని ఏర్పరిచాడు. "మాకు ఎప్పుడూ దుఃఖం కలుగకూడదు. మాయింట్లో సర్వదా సంతోషాలు విరజిమ్మాలి" అని మీరు కోరుకుంటే అది సాధ్యంకానిపని. ఒకరికి లాభం వచ్చినప్పుడు, మరొకరికి నష్టం కలిగితీరుతుంది. ఒకరి ఇంట్లో ఒకరు మరణిస్తే మరొక ఇంట్లో ఒక బిడ్డ జన్మిస్తుంది. ఇది ఇలా సాగిపోతూనే ఉంటుంది.

## ఆప్తకాములని ఎవరిని అంటారు?

ఈ ప్రకారంగా ప్రపంచంలో ఒకవిధమైన సంతులన స్థాపించబడుతూ ఉంటుంది. మనం ప్రపంచాన్ని మార్చలేం. కానీ మన కోరికలను మార్చుకొనగలం. పరిస్థితులకు అనుగుణంగా మీరు మీ కోరికలను మార్చుకొనగలిగితే "ఆప్త కాములు" అని చెప్పబడేవారికి ఎలాంటి సుఖం లభిస్తుందో, అదే మీకు లభించితీరుతుంది. ప్రతి ఒక్క "మనోరథము" నెరవేరినటుల భావించబడుతుంది. గొప్పగొప్ప ఆకాంక్షలు నెరవేరినప్పుడు మనకు ఎంతో ఆనందం కలుగుతుంది. కోరికలను మార్చు కొనటం వలన కూడా అంతటి ఆనందాన్నే పొందగలము. అయితే ఇందుకు ఒక షరతు ఉన్నది. కోరికలను మార్చు కొంటూ, మీరు ఆధ్యాత్మికవాదాన్ని ఆసరాగా తీసుకోవాలి. భౌతిక వాదాన్ని ఆశ్రయించినట్లైతే, జీవితకాల మంతా మీరు "మా కోర్కెలు నెరవేరలేదు" అన్న ఫిర్యాదుతోనే బ్రతుకు గడపవలసి వస్తుంది. గొప్ప గొప్ప మహాత్ములు, సిద్ధులు, దేవతలు... ఎవరు ఎంత సహాయం చేసినా "మేము ఈ ప్రపంచం నుండి అసంతృప్తితోనే వెళ్ళి పోతున్నాము" అన్న మీ ఫిర్యాదు ఆవిధంగానే ఉండిపోతుంది.

సికిందర్‌కు మరణకాలం ఆసన్నమైనప్పుడు, ఆయన తాను సంపాదించిన ఆస్తులన్నింటినీ తీసుకురమ్మని, వాటిని తాను వెంట తీసుకుపోదలచాననీ తన సేవకులను ఆదేశించాడు. ఆస్తులన్నింటినీ తీసుకుపోవటమన్నది ఎటువంటి పరిస్థితుల లోనూ సాధ్యం కాదు. రావణాసురుడు కూడా అసంతృప్తి నిండిన హృదయంతో నిస్సహాయమైన చూపులతో ఈ ప్రపంచం నుండి నిష్క్రమించాడు. కేవలం ఆప్తకాములుగా బ్రతుకు సాగించినప్పుడే అలౌకికమైన ఆనందాన్ని పొందగలము.

## సత్సంగమని దేనినంటారు?

సాధారణంగా ప్రజలు ఆధ్యాత్మిక సిద్ధాంతాలను కేవలం చెప్పటానికి, వినటానికి మాత్రమే పరిమితం చేస్తుంటారు. "గురువుగారు వ్యాఖ్యానం చెప్తారు, సత్సంగం జరుగుతుంది. వెళ్ళి విని వద్దాం" అనుకుంటారు. మేము ఆవిధంగా ఎప్పుడూ ఆలోచించలేదు. ఆధ్యాత్మిక సిద్ధాంతాలను విని అర్థం చేసుకొని హృదయంలోకి తీసుకొనటమేకాదు, వాటిని క్రియాన్వితం చెయ్యగలిగినప్పుడే ఆధ్యాత్మికతకు ఫలితం సిద్ధిస్తుంది. మేక గడ్డిని నమిలితిని, తర్వాత దానిని పాలగా ఎలా మార్చుతుందో అలాగే ఆధ్యాత్మిక సిద్ధాంతాలను మనం జీవితంలో 'ఓతప్రోతం' కావించుకొనగలిగినప్పుడే అని ఫలవంతమైన శాంతిని ప్రసాదించగలుగుతాయి.

ఏవ్యక్తి అయినా మా యొక్క ప్రతి మనోరథము నెరవేరింది. ఒక్కకోరిక కూడా అసంపూర్తిగా మిగిలిపోలేదు అని గుండె మీద చెయ్యి వేసుకొని చెప్పగలిగినాడు అంటే ఆ మనిషి జీవితం సఫలీకృతమైనట్లుగా భావించగలము. సంస్కృతంలో ఇటువంటివారిని ఆప్తకాములు అంటారు. కల్పవృక్షం క్రింద కూర్చుని మాకు లభించిన ఆ ఆనందాన్ని మీరు పొందగలరు.

కర్మకాండలు, క్రియాకలాపాలను మాధ్యమంగా చేసుకొని మేము మానవుని దృష్టికోణాన్ని సంస్కరించి, అతనిలో పరివర్తనను తీసుకురావటమే లక్ష్యంగా పెట్టుకున్నాము. మా లక్ష్యం సంపూర్ణంగా నెరవేరినది, అదియే ఆధ్యాత్మికత. ఇటువంటి ఆధ్యాత్మికతను మేము జీవితంలో అమలుపరిచే ప్రయత్నం చేశాము, దాని ఫలితంగానే "ఆప్తకాములం" కాగలిగినాము.

బుద్ధభగవానుని శిష్యుడైన ఆనందుడు "బుద్ధభగవానుల వారు రాత్రంతా ఒకప్రక్కనే పడుకుని నిద్రిస్తారు. రెండవ వైపుకు తిరగనైనా తిరగరు" అని శిష్యులైన ప్రజలతో చెప్పేవాడట.

**మన వైఫల్యానికి ఇతరులో, కాలమో అంటే కుదరదు**

ఒకసారి ప్రజలు స్వయంగా దానిని వీక్షించారట కూడా! స్వామీ! తమకు ఇంత గాఢంగా నిద్ర ఎలా పడుతుంది" అని ఆశ్చర్యంతో ప్రశ్నించారట.

### ఆలోచనలే యమదూతలు

నిశ్చింతంగా ఉండటం వల్లనే మాకు చక్కటి నిద్రపడుతుంది అని చెప్తూ, భగవానులు ఇంకా ఇలా బోధించారు. ఆలోచనలు మనిషిని కృంగదీస్తాయి. వాటి భారాన్ని మోయలేక మనిషి చింతాక్రాంతుడౌతాడు. జీవితమంతా అశాంతితో నిండిపోతుంది. ఆలోచనల వల్ల జీవితం సగం నశిస్తే, వ్యాధుల వల్ల మిగతా సగం వ్యర్థమైపోతుంది. త్రాసులో సమస్యలను-వ్యాధులను ఉంచినట్లైతే త్రాసు సమస్యల వైపే అధిక భారాన్ని సూచిస్తుంది. ఆలోచనలు మనిషిని ఎంతగా వేధిస్తాయో, బాధిస్తాయో, కృంగ దీస్తాయో! వాటిని యమదూతలతో పోల్చవచ్చు. సమస్యలు రెండవరకం యమదూతలే! అని చెప్పారు.

### అవసరాలను సరిగ్గా గుర్తించి వెలకట్టండి

(అవసరాలకు ఖచ్చితమైన విలువనియ్యండి)

ఎంత అవసరమో అంతమేరకే జీవితాన్ని పరిమితం చేసుకోవాలి. ఏది అవసరం? ఏది అనవసరం? ఇది కొరుకుడుపడని ప్రశ్న. ఈ అంశాన్ని గీటురాయి మీద పెట్టి మనం కోరుకుంటున్నవన్నీ నిజంగా అవసరమైనవా? కావా? అని పరీక్షిస్తే మనకే నవ్వు వస్తుంది. నిజంగా చెప్పాలంటే జంతువుల కన్నా కూడా మన మౌలిక అవసరాలు చాలా తక్కువ. ఒక మేకకు, గేదెకు ఎంత మేత కావాలో చూస్తే దానికన్నా మానవుడు తీసుకునే ఆహారం చాలా స్వల్పం. ఆరంగుళాల ఈ పొట్టకు 4 రొట్టెలు పెడితే (కడుపు) నిండిపోతుంది. బట్టలు కూడా అంతే. వీలయినంత తక్కువ ఖర్చులో వస్త్రాలు ధరించగలం. ఇక ఆఖరు అవసరం ఇల్లు. భగవంతుడు మనకు కూడా ఏదో ఒక చిన్న వసతి చూపించకపోడు. ప్రతి ఒక్కరికి మౌలిక అవసరాలు ఏదో ఒకవిధంగా తీరుతాయి. దొరికినదానితో మనం సంతృప్తి చెందటం అలవరచుకోవాలి. కోర్కెలను పెంచుకుంటూ పోకూడదు.

తలపైనుండి కోరికల మూట అనే భారాన్ని తగ్గించుకున్నట్లైతే మీరు సంతోషంగా, శాంతిగా, చిరునవ్వుతో, నిశ్చింతగా జీవించగలరు. అంతేకాదు, మీ జీవితం మరొక 20 సంవత్సరాలు పొడిగింపబడగలదు, అయితే కోరికలను తగ్గించుకొని, ఏ పనీ చెయ్యకుండా సోమరిగానో, దొంగతనం చేసో బ్రతుకమని చెప్పటం మా అభిమతం కాదు. మనిషి కష్టపడాలి, సంపాదించాలి. అది తప్పనిసరి.

### సంపాదన అనేది తప్పని సరి

ప్రతి మనిషి పని చెయ్యాలి, సంపాదించాలి. ఎందుకంటే సమాజానికి మనిషి అవసరం చాలా ఉంది. మన ఇంట్లో బియ్యం ఉండవచ్చు, కానీ ప్రక్క ఇంట్లో లేవు. మన కుటుంబ సభ్యులకు వస్త్రాలున్నాయి. ప్రక్కవారికి లేవు. దేశంలో ఉత్పత్తిని పెంచటానికి, పంటలు పండించటానికి, అభివృద్ధి సాధించటానికి ప్రతి ఒక్క వ్యక్తి శ్రమించితీరాలి. మాకు తినడానికి కావలసినంత తిండి ఉన్నది కాబట్టి మేము పనిచెయ్యవలసిన అవసరంలేదు అని ఎవరైనా భావిస్తే, అది చాలా తప్పు. సోమరితనాన్ని మేము ప్రోత్సహించము. ప్రతిమనిషి సుఖంగా, శాంతిగా, సంతోషంగా జీవించాలి అనే సిద్ధాంతాన్ని మేము సమర్థిస్తాము. మనిషి క్రియాశీలుడై జీవించాలి.

అత్యంత పొదుపుతో కూడిన జీవితాన్ని గడిపాము మేము. అసలు మనిషికి కావలసిన ముఖ్యమైన అవసరాలు ఏమేమి ఉన్నాయి? అని బాగా జాగ్రత్తగా పరిశీలిస్తే, ఈ శరీరం జీవించి ఉండటానికి ప్రథమంగా కావలిసింది ఆహారం. గడ్డి కోసుకునే వ్యక్తి కూడా కడుపునింపుకోగలుగుతున్నాడు. మనం ఆమాత్రం సంపాదించుకొనలేమా? అని ఆలోచించాం. ఆరోజు నుంచి మాకు శాంతి లభించింది. సంతోషమనే టానిక్ త్రాగుతూ మేము ఈ 66 సంవత్సరాల వయస్సులో కూడా ఉత్సాహంగా ఉండగలుతున్నాము. వయస్సుపరంగా మాకు 66 సంవత్సరాలైనప్పటికీ, మానసికంగా మేము 17 సం॥ల వయస్సు ఉన్న వ్యక్తి వలె జీవిస్తున్నాము. ఆలోచనల కారణంగా, కోరికల కారణంగా, తీవ్రమైన ఆకాంక్షల కారణంగా మానవుని శక్తులు క్షయమైపోతుంటాయి. మాకు అలాంటి సమస్యలు లేవు కాబట్టి మేము నిశ్చింతంగా, సంతోషంగా ఉండగలగటమే కాదు, మా వద్దకు వచ్చేవారి కోరికలను తీర్చి-వారికి ఆనందాన్ని ఇవ్వగలుగుతున్నాము. ఆప్తకాములైనవారికి మాత్రమే ఇది సాధ్యపడుతుంది. *(సశేషం)*

*- అఖండజ్యోతి, ఫిబ్రవరి 2016*

*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

**ఓడిపోయామంటే ఆ దారి మూసుకున్నట్లే, కానీ అక్కడే అనేక దారులు తెరచుకుని ఉంటాయి**

# యువక్రాంతి సంవత్సరం 2016-వృక్షగంగ అభియానానికి వివిధ ప్రయోగాలు



క్రితం సంచికలో భాగీరథీ జలాభిషేకం గురించి చదివాం. వృక్షగంగా అభియానం కూడా దీనితో ముడిపడిందే. దీనికి సంబంధించిన విభిన్న అంశాలను ఈ సంచికలో తెలుసుకుందాం. శాంతికుంజ్‌లోని యువత విభాగం నుండి మిగిలిన వివరాలు తెలుసుకోగలరు.

**1. శ్రీరామ స్మృతి ఉపవనాలు:** పరమపూజ్య గురుదేవుల పేరు మీద 2400 శ్రీరామస్మృతి ఉప వనాలు ఏర్పర్చాలని సంకల్పం తీసుకోవడం జరిగింది. నగరాలలో, పట్టణాలలో సార్వజనిక స్థలాలలో అన్నింటికన్నా ఉపయోగకరమైన, రచనాత్మకమైన సేవా ప్రాజెక్టు -ఉపవనాలు స్థాపించటం. దీనివల్ల మానవ సమాజానికి మంచి ఆరోగ్యం, పర్యావరణ సంరక్షణ మరియు స్మృతి ఉప వనాలను నిర్వహించే వ్యక్తులు లేదా సంస్థలకు స్వావలంబనగా కూడా ఉపయోగ పడుతుంది. స్మృతి ఉపవనాల స్వరూపం విధిగా నిర్ణయించ బడింది. ఇందులో ఆక్యుప్రెషర్ మార్గం, ప్రాకృతిక ఆహారం, పక్షుల ఆహార గృహం, సాధనా కేంద్రం, ఓషధవాటిక, గ్రహ-నక్షత్ర-రాశి వాటికలు వంటి శారీరిక, మానసిక ఆరోగ్య వర్ధక ఏర్పాట్లు చేసుకోవచ్చు. దీనికి నమూనా హరిద్వార్‌లోని దేవ సంస్కృతి విశ్వ విద్యాలయంలో ఏర్పాటు చేయబడింది. ఈ ఏర్పాటును ఉదాహరణగా తీసుకుని పలుచోట్ల అటువంటి ఉపవనాలు ఏర్పాటు చేయవచ్చు.

**ఉపవనం యూనిట్:** ఆక్యుప్రెషర్ మార్గం, పిరమిడ్ యజ్ఞశాల, వాస్తు వృక్ష మండలం, నవగ్రహ వృక్ష మండలం, దేవ వృక్షం, కల్పవృక్షం, హరిశంకరి, త్రివేణి, పక్షివిహారి, చిరుధాన్యాల వాటిక, ధ్యాన-ప్రాణాయామ స్థలం, ప్రాకృతిక ఆహార కేంద్రం.

**ఆక్యుప్రెషర్ మార్గం:** ప్రతిరోజు పొద్దున పరగడపున దీర్ఘశ్వాస తీసుకుంటూ, చెప్పులు లేకుండా 10-15 నిమిషాలు దీనిపై నడవడం వల్ల అరికాలిలో ఉన్న అన్ని పాయింట్లు సక్రియ మవుతాయి. ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ఆరోగ్యకరమైన గాలిని పీల్చడం కోసం ఉదయం లేదా సాయంత్రం నడవడానికి వెళ్తే వాహనాలు వదిలే కలుషిత వాయువు లేదా రోడ్డు పక్కన చెత్తనుంచి వచ్చే కంపే పీలుస్తాం. కానీ ఇక్కడి ఆరోగ్య కరమైన ఉద్యానవనంలో నాటిన ఓషధీయ మొక్కలు తాము వదిలే గాలి ద్వారా వాతావరణాన్ని ప్రాణతత్త్వంతో నింపి ఆరోగ్యకరంగా మారుస్తాయి. ఈ ఆక్యుప్రెషర్‌మార్గంలో నడుస్తూ, దీర్ఘశ్వాస తీసుకునే వారికి చాలా లాభాలు కలుగుతాయి. పూర్ణ ఆరోగ్యవంతులు అవుతారు, జీవితంలో సకారాత్మక (positive) శక్తి పెరుగుతుంది. దాంతో సుఖ సమృద్ధులు పెరుగుతాయి. ఈ ఆరోగ్యవనం మధ్యలో విభిన్న దివ్యవృక్షాలు-నవగ్రహ వాటిక, రాశి వాటిక మొదలైన అనేక దివ్య ఓషధ వృక్ష సమూహాలు నాటాలి. నడుస్తున్నప్పుడు ఈ దివ్య వృక్షాలకు ప్రదక్షిణ చేస్తాం. దాని వల్ల వాటి సాత్త్విక శక్తులు పొందగలం. దానితో పాటే గ్రహ నక్షత్రాల సంబంధిత సమస్యలు కూడా పోతాయి.

**ధ్యాన కేంద్రం:** ఈనాటి ఉరుకుల పరుగుల జీవనశైలి వలన కలిగే ఒత్తిడి నుండి ముక్తి, మానసిక శాంతి మరియు అంతరా ళాల్లోని దివ్యత్వ అనుభూతి కోసం ఇదొక మంచి ఉపాయం.

**యోగ స్థలం:** యోగంతో రోగములను పోగొట్టుకోండి. ప్రకృతి సన్నిధిలో సామూహికంగా మరియు వ్యక్తిగతంగా ఆసన ప్రాణాయామాలు చేయడానికి ఇది ఉపయుక్తమైన స్థలం. సర్వాంగయోగ, ప్రజ్ఞాయోగాల ప్రశిక్షణ ఇక్కడ అందించవచ్చు.

**సంగీత చికిత్స:** ఆరోగ్యవనంలో అనేక రాగాలతో సంగీతం మరియు మంత్ర స్వరాలు తనువును, మనసును ఉత్సాహపరిచి ఆనందోత్సాహాలతో నింపుతుంది.

**పిరమిడ్ యజ్ఞశాల (యజ్ఞ చికిత్స):** అన్ని రకాలైన రోగాణువుల నుండి శరీరాన్ని దూరంగా ఉంచడానికి, మానసిక రోగాలనుండి విముక్తి పొందడానికి, జీవనీశక్తి పెంచుకోవ డానికి యజ్ఞం చాలా మంచి ఉపాయం. యజ్ఞాగ్ని ద్వారా హవన సామాగ్రిలోని దివ్య ఓషధుల శక్తి వేల రెట్లు పెరిగి శ్వాసద్వారా, చర్మంద్వారా సంపూర్ణ శరీరానికి తక్షణం అందు

ఓటమి గుర్తుండే పాఠాలను నేర్పుతుంది

తుంది. కేవలం యజ్ఞచికిత్స నిమిత్తం మాత్రమే దీనిని ఆరోగ్య ఉపవనంలో ఏర్పాటు చేయబడాలి.

**భగవతీ మాత ప్రాకృతిక ఆహార కేంద్రం:** జీవితంలో చాలా వరకు రోగాలు పద్ధతి లేని ఆహార విహారాల వల్లే వస్తాయి. ప్రస్తుతం లభిస్తున్న ఆధునిక ఫాస్ట్ ఫుడ్స్‌లో ఆరోగ్యం వెతికినా దొరకదు. ఆనపకాయ, కాకరకాయ, పాలకూర, టమాట, కీర, కారట్, ఉసిరి, అలొవీరా రసం మొదలైనవి ఇక్కడ అందు బాటులో ఉంచాలి. రోజు ఇంట్లో ఇవన్నీ అందుబాటులో ఉండకపోవడం వల్ల ఫాస్ట్ ఫుడ్స్ జోలికి వెళ్ళి రోగాలను కూడా కొనుక్కుంటున్నాం.

**గోధుమ గడ్డి రసం:** దీనిని ప్రకృతి ప్రసాదించిన ఆకుపచ్చ రక్తం అంటారు. హిమోగ్లోబిన్ పెంచుతుంది, రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. ఊబకాయాన్ని తగ్గిస్తుంది, బి.పి. సామాన్యంగా మారుస్తుంది. చర్మం మృదువుగా ఉంచుతుంది. మహిళల రోగాలకు బాగా ఉపయోగపడుతుంది. ఇందులోని బి-12 విటమిన్ కాన్సర్ రోగ నివారణకు అత్యంత లాభకారి.

**ఎలొవీరా రసం (కలబంద):** శరీరంలోని సమస్త రోగాణువు లను బైటికి నెట్టేసి సంపూర్ణ ఆరోగ్యాన్నిస్తుంది, ఎలర్జీలు పోతాయి. కడుపులో రోగాలు, మధుమేహం అన్నింటినీ నయం చేస్తుంది. కొవ్వు శాతం సామాన్యంగా ఉండేట్టు చేస్తుంది. కాలేయం, మూత్రపిండాలలోని వికారాలు దూరం చేస్తుంది. హెచ్.ఐ.వి. సంక్రమణాన్ని అదుపుచేస్తుంది. సోరియాసిస్ మరియు కాన్సర్ వంటి అసాధ్యమైన రోగాలకు ఉపశమనాన్ని ఇస్తుంది.

**ఆనపకాయ రసం (సొరకాయ):** గుండె జబ్బులు, నిద్ర లేమి, మూత్ర రోగాలు, కాలేయ సమస్యలు, చెవులు కళ్ళ సమస్యలకు, మధుమేహానికి చాలా ఉపయోగకారి.

**కాకరకాయ రసం:** మధుమేహానికి రామబాణ ఓషధం. కడుపులో రోగాలు, మూలశంక వ్యాధి, కలరా, కామెర్లు, రక్త సమస్యలు, చర్మరోగాలకు లాభదాయకం.

**పాలకూర రసం:** అన్ని రక్తసంబంధ రోగాలు, కడుపులో ఇబ్బందులు, ముఖ సౌందర్యం పెంచడానికి, మధుమేహం, ఊబకాయం, పళ్ళు చిగుళ్ళ రోగాలు, మలబద్ధకం మొదలైన వాటికి లాభదాయకం.

**బీట్‌రూట్ రసం:** ఇది శరీరంలో క్యాన్సర్, ట్యూమర్ వంటివి రానివ్వదు. మలబద్ధకం మరియు మూలశంకకు అత్యంత లాభకారి, రక్తహీనతను నయం చేస్తుంది. జ్ఞాపకశక్తి పెంచుతుంది మరియు మానసిక దౌర్బల్యం లేకుండా చేస్తుంది.

**క్యారెట్ రసం:** కళ్ళలో వెలుగు, చర్మ సౌందర్యం పెంచి, రక్త శోధనకు బాగా పని చేస్తుంది.

**కొబ్బరి పాలు:** శరీరానికి శక్తిని ఇస్తుంది. ఎండిపోవడం, టి.బి. వంటివి పోతాయి. పొడి దగ్గు, గొంతులో మంట, ఛాతిలో నొప్పి, మచ్చలకు లాభదాయకం.

**నిమ్మకాయ-తేనె నీళ్ళు:** రక్తంలో హిమొగ్లోబిన్ పెంచుతుంది, శరీరాన్ని దృఢపరుస్తుంది, కొవ్వు తగ్గిస్తుంది, ఊబకాయం తగ్గుతుంది.

**మొలకలు:** కడుపులోని వికారాలన్నీ పోతాయి. ఎ,ఇ,కె విటమిన్లు లభిస్తాయి. నిత్యం తినడం వల్ల వంధ్యత్వం ఉండదు.

**పళ్ళు:** విటమిన్లు మరియు ఖనిజాలు లభించి రోగాలు రానివ్వదు. మలబద్ధకం, ఊబకాయం తగ్గుతుంది. రోజూ తినడం వల్ల ప్రాకృతిక చక్కెరలు లభించి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది. శరీరం అందంగా, దృఢంగా. స్ఫూర్తితో నిండి ఉంటుంది.

నగరంలో, కాలనీల మధ్య సార్వజనికంగా ఉపయోగించే పార్కులు, వ్యక్తిగత పార్కులనైనా సరే, దత్తతు తీసుకుని లేదా భూములను సేకరించి శ్రీరామ స్మృతి ఉపవనాలను వికసింప చేయవచ్చు. వాటిని వ్యక్తిగతంగా కానీ సంస్థాగతంగా కానీ నిర్వహించవచ్చు.

**2. శ్రీరామస్మృతి వన పర్వతాలు:** మధ్యప్రదేశ్ మరియు చుట్టుపక్కల కొండ ప్రాంతాలనీ, భూఖండాలని దత్తత తీసుకుని స్థానీయ గాయత్రీ పరివార్ శాఖలు వాటిని పచ్చగా మార్చేసాయి. ప్రభుత్వం నుండి సహకారం, అనుమతి తీసుకుని ఇటువంటి ప్రయత్నాలు మిగిలిన చోట్లలో కూడా చేయాలి.

**3. శ్రీరామ స్మృతి వాటికలు:** ఒకప్పుడు ఊళ్ళల్లో ప్రతి ఇంటిలో ఒక చిన్న ఉద్యానవనం ఉండేది. అందులో మామిడి, అరటి, జామ, బొప్పాయి, నేరేడు మరియు స్థానీయ పళ్ళ చెట్లు పెంచేవారు. ఈ పరంపర మళ్ళీ అలవాటు చేసుకోవాలి. ఊళ్ళో ఒక చోట కొన్ని చెట్లు నాటి వాటికలుగా తయారు

**ఓటమి తరువాత మిగిలిన వారే నీవారే, నీతో ఉండేవారు**

చేయాలి. అక్కడ ఆరోగ్య సంవర్ధన, పిల్లలు ఆడుకోవడానికి, సంస్కారాలకీ, సాధనలకీ మొదలైన వాటికి వీలుగా ఉంచాలి.

**4. కుండీల్లో ఆరోగ్యం:** నగరాల్లో, పట్టణాల్లో చెట్లు నాటే స్థలం ఉండని ఇళ్ళు, వాటి వాకిట్లలో గానీ, మేడ మీద గాని పూలకుండీలలోనే కాయగూరలు, ఓషధుల వాటికలు ఏర్పాటు చేసుకుని పచ్చదనాన్ని పెంచుకోవచ్చు. ఇటువంటి ప్రయోగాలు ఆరోగ్యాన్ని పెంచడమే కాక ఆర్థిక లాభాలను కూడా ఇస్తాయి. తాజా కూరలు కూడా అందుబాటులో ఉంటాయి.

**5. లక్ష అశోక వాటికలు ఏర్పాటు చేయడం:** 'ఆత్మకథ' పుస్తకంలో పరమపూజ్య గురుదేవులు ఐదు సంకల్పాల గురించి చెప్పారు. 1. లక్ష యజ్ఞాలు, 2. లక్ష నరరత్నాలు, 3. లక్ష అశోక వాటికలు, 4. లక్ష గ్రామతీర్థాలు, 5. లక్ష సంవత్సరాల సమయదానం. ఈ పని పూర్తి చేయాల్సిన బాధ్యత గాయత్రీ పరివారానిదే. శక్తిపీఠాల్లో, ఇంటి చుట్టుపక్కలా ఎక్కువ అశోక చెట్లు ఉండడం చాలా మంచిది. అశోకవనంలోనే సీతకు ఆశ్రయం లభించింది. హనుమంతుడు కూడా ఆ చెట్ల కొమ్మల్లోనే దాక్కున్నాడు. ఆయుర్వేదంలో మహిళల రోగాలకి ఇది ఖచ్చితమైన మందుగా పేర్కొన్నారు. పురుషుల్లో బలం, దారుఢ్యం పెంచే శక్తివంతమైన వృక్షమిది. సాధనలకి అశోక వనం అనువైన చోటు. ఇక దాని శోభ అసాధారణమైనది.

**6. ఓషధ వాటిక:** శక్తిపీఠాల్లో తులసి, తిప్పతీగ, పుదీనా, కలబంద, కాలమేఘ, ఉత్తరేణి, అశ్వగంధ, నేరేడు, గోరింట, కృష్ణ తులసి, కర్పూర తులసి, పునర్నవ (అటిక మామిడి) మొదలైన మొక్కలను కుండీలలోగానీ నేలలో గానీ నాటవచ్చు. వీటిలోని ఓషధ గుణాల జాబితా తయారు చేసి ఆ కాగితాలను అంటిస్తే, వచ్చే పోయే పరిజనులు వారి అవసరాలను బట్టి ఇళ్ళల్లో కూడా పెంచుకుంటారు. ఇంటి చుట్టుపక్కల ఏవైనా పార్కులుంటే వాటిలో వేప, అశోక, ఉసిరి, మారేడు, టినోస్పోర (తిప్పతీగ) మొదలైన ఓషధ గుణాలున్న చెట్లను నాటాలి.

**7. కూరల వాటిక:** నగరాల్లో, వీలున్న చోట్లలో పెరటితోటలు నాటుకోవాలి. అలా కుదరని పక్షాన వాకిట్లో, మేడమీదనో తొట్లలో కూరగాయల మొక్కలు నాటాలి. వీలైనంత వరకు ప్రాకృతిక ఎరువులను వాడాలి. రసాయనిక ఎరువులు, క్రిమి సంహారకాలు లేని స్వచ్ఛమైన తాజా కూరలు పెరుగుతాయి. ఆర్థికంగా కూడా సహాయకారిగా ఉంటాయి.

**నూతన ప్రయోగం:** మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని షుమారు 75 చిన్నపెద్ద ఎండిపోయిన కొండప్రాంతాల్లో వేల సంఖ్యలో చెట్లను నాటే బాధ్యత గాయత్రి పరివార్ సభ్యులు స్థానికుల సహాయంతో పూర్తిచేసారు. 2007-08లో మట్టి దిబ్బల్లా కనిపించిన కొండలు ఇప్పుడు పచ్చటి వనాలుగా మారిపోయాయి.

**సులభంగా జరగలేదు:** సంకల్పించుకున్న పరిజనులు ఊరూరా వెళ్ళి సభలు ఏర్పాటు చేసారు. గ్రామీణులలో చైతన్యం తీసుకొచ్చి, దంపతులు తరు పుత్రులను (చెట్లను) దత్తతు తీసుకునేట్టుగా ప్రేరణ నిచ్చారు. సంకల్పంతో పాటు స్థానికుల సహకారం, చైతన్యం దొరికినప్పుడు ఒక్కో చోట 1100, 2400 దంపతులు, ముఖ్యంగా అన్ని జాతులు, వర్గాలు, సముదాయాల కుటుంబాలు ఈ కార్యక్రమంలో సంకల్పపూర్వకంగా పాల్గొన్నాయి. ఊళ్ళల్లో ఔత్సాహికులైన యువతను కమిటీలుగా ఏర్పర్చి వారికి కార్య ప్రణాళిక తెలియచెప్పడం జరిగేది. భవిష్యత్తు కార్యకలాపాలను నిర్వహించే బాధ్యత కూడా అప్పగించబడేది. ఇదే తరుపుత్ర మహాయజ్ఞ కార్యక్రమం.

**తరుపుత్ర మహాయజ్ఞానికి ముందు ప్రక్రియ:** చెట్లు నాటాలనుకున్న ఒక రోజు ముందు నిర్ణయించుకున్న భూమిని అందుకు తగినట్టుగా తయారు చేసేవారు. మొక్కలకి కావలసిన నీటివ్యవస్థ కూడా సిద్ధం చేసేవారు. నీటి వ్యవస్థ లేని చోట టాంకర్ల ఏర్పాట్లు కూడా చేసారు. అందరి సహకారంతో అవసరాన్ని బట్టి గుంతలు తవ్వి, ఎరువు వేసి వాటికి క్రమసంఖ్య ఇచ్చేవారు. సంకల్పం తీసుకున్న కుటుంబాలకు టోకెన్ నెంబర్లు ఇచ్చారు. అనుకున్న రోజు అన్ని కుటుంబాలు, అనుకున్న సమయానికి, నిశ్చయించుకున్న చోటు దగ్గర కలిసేవారు. టోకెన్ నంబర్ల ప్రకారం చెట్టు కోసం తవ్విన గుంత దగ్గర కూర్చునేవారు. సంక్షిప్త యజ్ఞప్రక్రియ తర్వాత అందరూ వారి వారికిచ్చిన మొక్కల్ని నాటేవారు. ఆ మొక్కని తరుపుత్రులుగా భావించి, అవి వాటంతటవే పెరిగేంత వరకు పోషణ బాధ్యతను తీసుకున్నారు. నీటిలేమి సమస్యకు పరిష్కారంగా పరిస్థితిని బట్టి కొండ అంచుల్లో వర్షపు నీటి నిలవల కోసం శ్రీరామ స్మృతి సరోవరాలు కూడా నిర్మించబడుతున్నాయి.

*- అఖండజ్యోతి, సెప్టెంబరు 2016*

*అనువాదం: ఎం. విశ్వనాథ్ ప్రసాద్*

**ఈనాటి ఓటమి రేపటి విజయానికి పునాది కావచ్చు**

ఆయుర్వేద వైద్యం-19

# అనేక రోగాలకు ఒకే ఔషధము 'జిల్లేడు'

జిల్లేడు ఒక ఉత్తమ ఔషధం అయినందున ఆయుర్వేదంలో దీనిని నిత్య ఓషధిగా గుర్తించారు. దీనిలో రెండు రంగులు ఉన్నాయి. వంగ పండు రంగు పూలు మొదటిది. తెలుపు రంగు పూలు రెండవది. తెల్లని పూలుగల చెట్టును పూజిస్తారు. రెండు రకాల జిల్లేడు చెట్లు ఓషధులుగా గుర్తించడమైనది. నవగ్రహ వాటికలలో ఒక గ్రహము సూర్యగ్రహమై ఉన్నది. దీనికి ప్రతీకగా జిల్లేడు చెట్టును పూజిస్తారు. వేసవికాలములో కూడా నీటి అవసరములేని చెట్టు ఇది. అగ్నితత్వము కలిగిన చెట్టు ఇది. దీని రసాయన ధర్మము పరుసవేది అంత ఉత్తమమైనది.

జిల్లేడు పాలు రుచిరహితంగా, వేడిగా, క్షారవంతంగా ఉంటాయి. నులిపురుగులు, వాతరోగమును, మొలలను, వాయువును, ఉదర రోగాలను, కుష్టురోగాలను నివారిస్తుంది. ఇది గొప్ప విరేచనకారి. దీనిని సేవించుటచే పిత్తస్రావము నియంత్రించబడుతుంది.

### ఇంటిలో ఉపయోగం

**జిల్లేడు చెట్టు వేరు, బెరడు:** చెమట పట్టించే శ్వాస బాధను (ఆయాసాన్ని నివారించుటకై వేడితో కూడి వాంతికి కారణమైన సిఫలిస్‌ను నివారిస్తుంది.

**జిల్లేడు పూలు:** బలకారకము, కొద్దిపాటి దానితోనే జఠరాగ్నిని పెంచేది. నోటి నుండి లాలాజలం వచ్చుట, మొలలవ్యాధి, దగ్గు నివారణ కలిగిస్తుంది. వంగ పువ్వు రంగు జిల్లేడు పూల రసం ఎక్కువ లాభాన్ని ఇస్తాయి.

**గమనిక:** జిల్లేడు చెట్ల పాలు తీక్షణంగా ఉంటాయి. దీనిని తగు జాగరూకతలతో సేవించవలసి ఉంటుంది. కళ్ళలో జిల్లేడు పాలు పడినచో మిగుల హానికరము. కావున కళ్ళలో పడనీయ రాదు.

**చెవి రోగాల నివారించుటకై:** జిల్లేడు ఆకుల రంగు పండు బారి పచ్చగా ఉన్నప్పుడు, నీళ్ళలో ముంచి కడిగి, తుడిచి, దానిపై ఆవు నెయ్యి వేసి నిప్పులపై వేడి చేసి, ఆకుల రసాన్ని చెవిలో వేసిన చెవిపోటు నివారణ జరుగుతుంది.

**చెవుడు ఏర్పడినప్పుడు:** రంధ్రాలు పడని పచ్చని రంగులో ఉన్న జిల్లేడు ఆకులను తీసి నిప్పులపై వేడి చేసి, దాని రసాన్ని చెవిలో పిండిన చెవుడు నివారణ జరుగును.

**దంతాల రోగాలపై:** 1) జిల్లేడు చెట్టు వేరుతో దంతాలను తోమినచో దంతాల వ్యాధులు నివారింపబడతాయి. 2) జిల్లేడు వేరు బెరడును నీటిలో నానబెట్టి దానిని దంతాలపై రుద్దిన దంతాలలోని క్రిములు నశిస్తాయి.

**దగ్గు నివారణకై:** జిల్లేడు పూల యొక్క రసం మరియు నల్ల మిరియాలు సమానపాళ్ళలో తీసికొని బాగా కలిపి ఆవగింజ పరిమాణంలో గోళీలుగా చేసి రోజుకు 4 సార్లు ఒక్కొక్క గోలీ చొప్పున నీటితో సేవించిన, ఆయాసం, దగ్గు, మూర్ఛ మున్నగు జబ్బులు నివారణ జరుగుతుంది.

**కలరా నివారణ:** జిల్లేడు పూవుల రెబ్బలును విడదీసి వీనిలో లవంగాలు 12 గ్రాములు తీసికొని, 12 గ్రాముల నల్ల మిరియాలు, 20 గ్రాములు అల్లం కలిసి, శనగగింజ పరిమాణంలో గోలీల్లా చేసి, కలరా సోకిన రోగికి ఒక్క గోలీ ఇచ్చిన త్వరితంగా లాభం చేకూరుతుంది.

**వాత రోగులకు:** విప్పారని జిల్లేడు పూల మొగ్గలను సొంఠిని, నల్ల మిరియాలను, వెదురు చెట్లు ఆకులను సమానపాళ్ళలో తీసికొని, కలిసి శనగగింజ పరిమాణంలో సేవించిన వాతరోగం నుండి నివారణ లభించును.

**తలనొప్పి నివారణ:** పిడకల భస్మాన్ని (బూడిదను) జిల్లేడు పాలతో కలిపి, ఆ మిశ్రమాన్ని ఎండబెట్టి ఆ చూర్ణాన్ని సీసాలో భద్రపరచుకోవాలి. దీనిని నస్యంలా పీల్చిన తుమ్ములు వచ్చి తలనొప్పి నివారింపబడుతుంది. దీనితోపాటు జలుబు, మూర్ఛలో కూడా గుణం కనిపిస్తుంది. జిల్లేడు పాలు 2 చుక్కలు సేవించి నంతనే త్వరగా నొప్పి తగ్గిపోతుంది.

**ఎలుక కరచినంతనే:** జిల్లేడు చెట్టు ఒక పువ్వు, నల్ల మిరియాలతో కలిపి చూర్ణం చేసి నీటితో సేవించిన విషం హరించబడుతుంది.

**మూర్ఛ మరియు అపస్మారక స్థితి:** 1) జిల్లేడు చెట్టు తాజా పువ్వులు మరియు నల్ల మిరియాలు సమానంగా తీసికొని

**గెలుపు శాశ్వతం కాదు, ఓటమి అంతిమం కాదు**

ఆవగింజ పరిమాణంలో తయారు చేసి మూడుసార్లు సేవించిన మూర్ఛ శ్వాస, బంధనం, నరాల బలహీనలతలు హరించ బడతాయి.

2) ప్రతిరోజు మధ్యాహ్నం రెండు తర్వాత, జిల్లేడు పాలు రోగిపాదాలపై నల్ల మిరియాల పొడితో కలిపి రోగి పాదాలపై మర్దించి మేజోళ్ళు (సాక్సులు) ధరించి పాదాలు తడువకుండా చూడాలి. 40 రోజులపాటు ఈ చికిత్సను చేసిన రోగనివారణ జరుగుతుంది.

**కందిరీగల కాటు:** కందిరీగలు కుట్టిన చోట జిల్లేడు పాలు రాయుటచేత ఉపశమనం లభిస్తుంది. వాపు కూడా నివారింపబడుతుంది.

**పాదరసం విషం నివారణ:** జిల్లేడు కొమ్మను లేక కాండాన్ని కాల్చి కర్ర బొగ్గును తయారుచెయ్యాలి. దీనిని పటిక బెల్లాన్ని చేర్చి (సమానంగా) బాగా కలిపి లేహ్యంగా చేసి రోజూ 6 గ్రాముల చొప్పున సేవించిన మూత్రం వెంట వెలికి పంపబడు తుంది. ఎర్ర కారాన్ని మరియు చింతపండును ఈ సమయ మందు వాడరాదు.

**కుక్క కాటు నివారణ:** జిల్లేడు వేరు మెత్తని చూర్ణాన్ని 3 ఆవగింజల పరిమాణంలో తీసికొని, 2 గ్రాముల బెల్లం చేసి ఉదయం, సాయంత్రం సేవించాలి. 40 రోజులపాటు తీసికోవాలి. నూనె, పులుపు తగలరాదు.

**పసికర్లు నివారణ:** జిల్లేడు చెట్టున పండిన ఆకును తీసికొని నీటిలో కడగాలి. దానిపై 2 చిటికెల తినే సున్నాన్ని వేసి బాగా పిచికి రెండు గోళీలను తయారుచేసి ఉదయం సాయంత్రం నీటితో తీసికోవాలి. భోజనంలో అన్నముతోపాటు పెరుగు తినాలి. ఇది తప్ప మరో ఆహారాన్ని తినరాదు. ఒక్క రోజు ఈ విధంగా చేస్తే గుణం కనిపిస్తుంది. కారం, పులుపు, నూనె మున్నగు మరియు వేడిచేసే పదార్థాలను రెండు నెలల పాటు తినరాదు.

**సంతానలేమి దోష నివారణకై:** తెల్ల జిల్లేడు చెట్టు వేరును బాగా నలిపి మెత్తని చూర్ణం చెయ్యాలి. ప్రతిదినము 2 గింజల పరిమాణంలో ఆవు నేతితో సేవించిన లాభకారిగా ఉంటుంది.

**కీళ్ళ నొప్పులు:** జిల్లేడు పాలు నొప్పి ఉన్న కీళ్ళ స్థానంలో మర్దించిన బాధ తగ్గుతుంది.

**కుష్టు రోగము ఇతర చర్మరోగ నివారణకై:** జిల్లేడు వేరు బెరడును చూర్ణం చేసి 2 శనగ గింజల పరిమాణంలో, 2 శనగ గింజల పరిమాణం శొంఠి చూర్ణాన్ని తేనెతో కలిపి, రోజూ 3 సార్లు సేవించాలి. రోగం పూర్తిగా తగ్గిపోయేవరకు దీనిని చాలా రోజుల పాటు వాడాలి.

**తెల్ల కుష్టు నివారణకై:** జిల్లేడు పాలతో మరియు పసుపురంగు చూర్ణాన్ని కలిపి రోజూ తగ్గేవరకు పూత పూయాలి.

**గజ్జి నివారణకై:** జిల్లేడు వేరును చూర్ణం చేసి పెరుగుతో కలిపి లేపనంగా తయారు చేయాలి లేనిచో జిల్లేడు పాలను, సమానపాళ్ళలో తేనెను కలిపి గజ్జిపై రాసిన గజ్జి నివారణ జరుగుతుంది.

**ఎగ్జిమా (తామర) నివారణ:** జిల్లేడు పాలు 1 తులం, 5 తులాలు ఆవ నూనె ఉడికించండి. పాలు పూర్తిగా ఇగిరిపోగానే చల్లార్చి సీసాలో నింపుకోవాలి. రోజూ 2 సార్లు ఎగ్జిమాపై మర్దించాలి.

**కోతలు, గాయాలైనప్పుడు:** జిల్లేడు వేరు బెరడుని చూర్ణం చేసికొని, సమభాగం దేశీ బెల్లాన్ని కలిపి ఉంచుకొని, రోజు నీటితోపాటు ఉదయం సాయంత్రం 3-3 గ్రాముల చొప్పున సేవించిన లాభకారి.

**చలి జ్వరం నివారణకై:** జిల్లేడు పూల రెమ్మలను బెల్లంతో కలిపి శనగ గింజంత గోళీలు తయారు చేసికోవాలి. జ్వరం వచ్చే 1 గంట ముందు 1 లేక 2 గోళీలను నీటితో తీసికోవాలి.

*- అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

## ఈ రెండు పైసలు తీసికోండి

*"రాధ చైల్డు" దగ్గరకు ఒక కమ్యూనిష్టు మిత్రుడు వచ్చాడు. "మిష్టర్! రాధాచైల్డ్! మీరు ఇంత ధనాన్ని జమ చేశారు కదా! ఇది చాలా అన్యాయం. ఈ ధనం మీద మీకే కాదు. సమాజానికి కూడా హక్కుంది." అన్నాడు. "అవును నిజమే" అంటూ ఒక కాగితం మీద లెక్కగట్టడం మొదలు పెట్టాడు. జేబులో నుండి రెండు పైసలు బైటకు తీశాడు. ఇదిగో తీసికోండి. మీ వంతు రెండు పైసలు. నా సంపదను జనసంఖ్యలో లెక్కచూస్తే మనిషికి రెండు పైసల వంతున వస్తుంది." అని ఇవ్వబోయాడు. మిత్రుడు బిత్తరపోయాడు.*

*- అనువాదం: పొన్నూరు హైమవతీశాస్త్రి*

**వైఫల్యం నిరాశకు కారణం కాకూడదు**

# స్ఫూర్తిదాయక గాయత్రీపరివార్ సభ్యులు - 29

## శ్రీ పేర్ల వెంకటేశ్వరరావు - మంగళగిరి



శ్రీమతి & శ్రీ పేర్ల సత్యవతి అప్పారావు దంపతులకు 24 ఫిబ్రవరి 1954లో శ్రీ వెంకటేశ్వరరావుగారు మంగళగిరిలో జన్మించారు. ఉన్నత పాఠశాల విద్యను మంగళగిరిలోనే పూర్తిచేసి వారసత్వంగా లభించిన కిరాణా వ్యాపారంలో ప్రవేశించారు. తదుపరి హోల్‌సేల్ వ్యాపారాన్ని చేపట్టారు. దీనిలో అనుభవాన్ని పొందిన తదుపరి 1990 ప్రాంతంలో పేరెన్నికగన్న గోద్రెజ్, ఇమామి, డాబర్, దుర్గా మున్నగు కంపెనీ లకు పంపిణీదారుగా వ్యవహరించారు. తన సహచరుడైన శ్రీ భోజనపల్లి ప్రసాద్‌గారితోపాటుగా తాను కూడా గాయత్రీ పరివార్‌తో జోడింపబడ్డారు. డా॥ తుమ్మూరి శివరామ కృష్ణారెడ్డి 1993లో వీరికి మంత్రదీక్షను ఇచ్చుట జరిగింది. ఆనాటి నుండి అత్యంత భక్తిశ్రద్ధలతో గాయత్రీ యజ్ఞాన్ని సంస్కారాలను అభ్యసించి మంగళగిరి చుట్టుప్రక్కల గ్రామాలలో అనేక యజ్ఞాలు, దీపయజ్ఞాలతోపాటు షోడశ సంస్కారాలు ప్రజలకు అందజేయుట జరుగుచున్నది.

1971లో వీరి జీవితంలోనికి కుమారి కుసుమ కుమారీదేవి వీరి అర్ధాంగిగా ప్రవేశించుట జరిగింది. అఖిల విశ్వగాయత్రీ పరివార్, మంగళగిరిశాఖను, ఒక ప్రజ్ఞాపీఠంగా ప్రారంభించి ప్రజలకు గాయత్రీ యజ్ఞాన్ని, సంస్కారాలను అందుబాటు లోనికి తీసికొని వచ్చుట జరిగింది.

అట్లే ప్రతి సంవత్సరము కార్తీక మాసము, కార్తీక పౌర్ణమి తదుపరి వచ్చెడి ఆదివారమునాడు గాయత్రీ సామూహిక యజ్ఞాన్ని చేసి తదుపరి అన్న సంతర్పణ చేయుట ఆనవాయితీగా మారింది. అట్లే మంగళగిరిలోని గాయత్రీ పరివార్ సభ్యులు ఏప్రిల్ నుండి మార్చి నెలాఖరు వరకు ప్రోగు చేసిన రోజువారి నగదు అంశ దానాన్ని సంవత్సరం ఆఖరుకు శాంతికుంజ్, హరిద్వార్ సంస్థకు పంపించుట ఒక అలవాటుగా చేసికొన్నారు. దీనిలో భాగంగా 2016 మార్చిలో రూ.26,000/-. 2015 మార్చి ఆఖరు నాటికి పదిహేడు వేల పైచిలుక అంశదానాన్ని శాంతికుంజ్ హరిద్వార్‌కు పంపించారు. ఇదేవిధంగా గత ఐదుసంవత్సరాల నుండి శాంతికుంజ్, హరిద్వార్‌కు ఈ నగదు అంశదానాన్ని క్రమంతప్పక పంపించుచున్నారు. ఈ ప్రజ్ఞాపీఠానికి శ్రీ వెంకటేశ్వరరావుగారు కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

అట్లే దసరా పండుగ 9 రోజులు మరియు శ్రీరామనవమి 9 రోజులు అనుష్ఠానాన్ని చేయుట వెంకటేశ్వరరావుగారి జీవితంలో ఒక భాగంగా మారింది. దీనిని గత ఏడు సం॥ల నుండి కొనసాగించుచున్నారు. 2016, ఆగస్టు 12 నుండి 23 వరకు జరిగిన కృష్ణానదీ పుష్కరాల సందర్భంగా, పుష్కర యాత్రికులకు 12 రోజుల పాటు నిరాటంకంగా, పితృ తర్పణ, యజ్ఞనిర్వహణ, భోజన ప్రసాద సౌకర్యాల కల్పించుటలో గణనీయమైన కృషిచేసిన శ్రీ వెంకటేశ్వర్లుగారిని చేతనా కేంద్రము అభినందించుచున్నది.

వీరికి, వీరి కుటుంబానికి ఆయురారోగ్యాల ప్రసాదించి, ఆశీస్సులనందించవలసిందిగా పూజ్యగురుసత్తాను యుగశక్తి గాయత్రి ప్రార్థించుచున్నది.

## శ్రీ భోజనపల్లి ప్రసాద్ - మంగళగిరి



శ్రీమతి & శ్రీ కోరాకు స్వరాజ్యలక్ష్మి - కుటుంబ రావు పుణ్య దంపతులకు రెండవ సంతానముగా ఫిబ్రవరి మాసం 1956లో ఏలూరు పట్టణము, పశ్చిమ గోదావరిలో ప్రసాద్ జన్మించారు. తన 5వ యేట మాతామహుల స్వగ్రామమైన మంగళగిరి గ్రామం గుంటూరు జిల్లాకు వచ్చి, మంగళగిరిలో తన ఉన్నత పాఠశాల విద్యాభ్యాసాన్ని పూర్తి చేశారు. తదుపరి విజయవాడ పట్టణములోని శ్రామిక విద్యాపీఠము ద్వారా హోమియో వైద్య విద్యను అభ్యసించారు. అటు పిమ్మట యుక్త వయస్సు రాగానే తన పెద్ద మేనమామగారైన శ్రీ భోజనపల్లి హరగోపాల కృష్ణమూర్తి వద్ద వ్యాపార మెళకువలు ఆకళింపు చేసుకుంటూ, అత్యంత వినయ విధేయతలతో వారికి చేదోడు, వాదోడుగా నిలచి, వారి విశ్వాసాన్ని ప్రేమను చూరగొన్న ప్రసాద్ మిక్కిలి వినయశీలి. మేనల్లునిలోని వినయసంపదకు, చురుకుదనానికి, శ్రద్ధాసక్తులకు ముచ్చటపడి, భగవంతుడిచ్చిన సంతానమని మేనల్లుని దత్తత తీసికొని తనకు గల సంతానలేమిని పూడ్చుకొని తన కన్నబిడ్డలా ప్రేమానురాగాల పంచుతూ వ్యాపార

**వైఫల్యం క్రొత్త ప్రేరణకు పునాది కావాలి**

మెళకువలతోపాటు ఆధ్యాత్మిక చింతనను కూడా తన దత్త కుమారుడైన ప్రసాద్‌లో ప్రవేశపెట్టుట జరిగింది.

ప్రసాద్ జీవితంలో వ్యాపార ఎదుగుదలతోపాటు ఆధ్యాత్మిక ఎదుగుదల కూడా దినదిన ప్రవర్ధమానం కాసాగింది. దీనితో తన నివాసం చుట్టు ప్రక్కల జరిగెడి ఆధ్యాత్మిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ, ఆయా కార్యక్రమాలకు అవసరమైన శారీరిక సేవతోపాటు ధనసేవలను కూడా అందించుటను అలవాటు చేసికొన్నారు. దీనితో అనేక ఆధ్యాత్మిక సంస్థలు మంగళగిరి పట్టణములో తమ కార్యక్రమాల ప్రారంభించేవేళ భోజనపల్లి ప్రసాద్‌గారి సేవలందుకొనుట ఒక పరిపాటిగా మారింది. దీనితో అయ్యప్పస్వామి సేవాదళ్, భవానీమాత అనుచరులు, షిర్డిసాయి సేవాదళ్‌లాంటి సంస్థలలో బాధ్యతగల పదవుల చేపట్టి వారి కార్యక్రమాలకు గుర్తింపు కలిగేలా చేశారు. ఈ రీతిగా శ్రీ భోజనపల్లిప్రసాద్‌గారు, గాయత్రీ పరివార్ ప్రముఖులైన డా॥ తుమ్మూరి శివరామకృష్ణారెడ్డిగారి ద్వారా గాయత్రీ పరివార్‌లో 1992లో ప్రవేశించుట జరిగింది. అట్లే ఆ సమయంలో మంగళగిరి మున్సిపాలిటీలో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌గా విధుల నిర్వర్తించుచున్న శ్రీ యల్లమందగారు కూడా గాయత్రీ కార్యక్రమాలు చేయిస్తూ, ప్రసాద్‌ను కూడా సంస్థకు మరింత దగ్గరగా చేర్చారు. దీని ఫలితంగా మంగళగిరిలో పెట్టిన దీప యజ్ఞంలో ప్రసాద్‌గారికి శ్రీ తుమ్మూరిగారి ద్వారా గురుదీక్షను ఇప్పించుట జరిగింది. ఆనాటినుండి ప్రసాద్ గారి వ్యాపార జీవితంతోపాటు ఆధ్యాత్మిక జీవనం కూడా ప్రగతి మార్గాన్ని పట్టింది. గాయత్రీ శక్తిపీఠము నారాకోడూరు ప్రారంభదశ నుండి శ్రీ ప్రసాద్ తన సేవలనందిస్తూ వచ్చారు. తత్ఫలితంగా శక్తిపీఠం ట్రస్టులో సభ్యులుగా చేరుట జరిగింది.

ఆనాటి నుండి పలు ఆధ్యాత్మిక సంస్థల ఎదుగుదలకు తన వంతు సహకారాన్ని అందిస్తూ తేనెటీగ పలు పూవుల నుండి మకరందాన్ని గ్రోలిన రీతిలో, పలు ఆధ్యాత్మిక సంస్థల నుండి ఆధ్యాత్మిక జ్ఞానాన్ని గ్రోలుతూ ప్రసాద్ ఎదుగసాగారు. తన నిత్యజీవన యానాన్ని ఒక యజ్ఞంగా మార్చుకొని, ఉపాసన, సాధన మరియు ఆరాధనల ద్వారా తన జీవితాన్ని పండించుకొంటూ, పూజ్యగురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్యుని అడుగు జాడల్లో నడువనారంభించారు.

వీరి వివాహం కుమారి శ్యామలాదేవి (తాడికొండ గ్రామం, గుంటూరు జిల్లా) గారితో జరిగింది. తన జీవితంలో అర్ధాంగిగా, శ్యామల ప్రవేశంతో, ప్రసాద్‌గారు శ్యామసుందరునికి మరింత దగ్గరవసాగారు. ఈ రీతిగా ఈ ఆదర్శ దంపతులు సామాజిక, ఆధ్యాత్మిక రంగాలలో తమదంటూ ఒక ముద్రను వేస్తూ ఆయా కార్యక్రమాల సాఫల్యతకు తమ సంపూర్ణ సహకారాన్ని అందించుట నిత్యకృత్యంగా మారింది.

పై రీతిగా తమ జీవితాలను మలచుకున్న వీరి గృహాన్ని 2002 ప్రాంతంలో అఖిల విశ్వగాయత్రీ పరివార్ అధినేత శ్రీప్రణవ్‌పండ్యాగారు సందర్శించి వీరికి ఆశీస్సులందించుట జరిగింది. అదే సమయంలో మంగళగిరి పట్టణంలో కొలువై యున్న శ్రీ లక్ష్మీనృసింహస్వామిని కూడా శ్రీ ప్రణవ్ పండ్యాగారు దర్శించుకొని స్వామి ఆశీస్సులనందుకొన్నారు.

2003లో 108 కుండముల గాయత్రీ మహాయజ్ఞాన్ని పురస్కరించుకొని మంగళగిరి చుట్టుప్రక్కల అనేక గ్రామాలలో గాయత్రీ ప్రచారాన్ని చేపట్టి వ్యాప్తిచేయుట జరిగింది. దీనికి ముందు అనేక గ్రామాల్లో ఏకకుండీ, పంచకుండీ, నవకుండీ మరియు 24 కుండముల యజ్ఞములు చేశారు, చేస్తున్నారు.

భోజనపల్లి ప్రసాద్‌గారిలోని ఒక విశిష్టత కాళ్ళకు పాదరక్షలు లేకుండా గత 7 సంవత్సరాల నుండి నడచుట అలవరచుకొన్నారు. దీనికి కారణము పంచభూతాలలో ఒకటైన భూమిని అనుక్షణము తాకుతూ జీవించాలనే, మరియొకటి భూ అయస్కాంతశక్తిని అనుక్షణము తన పాదాల ద్వారా తన శరీర అంగాలకు అందాలనే ఆలోచనల ప్రతిఫలంగా ఇది రూపుదాల్చింది. మండుటెండలో గ్రీష్మఋతువులో సైతం పాద రక్షలు లేకుండా నడచిపోగల స్థాయికి ఎదిగారు శ్రీ ప్రసాద్.

2016 ఆగస్టు 12 నుండి 23 వరకు కృష్ణానదీ పుష్కరాల సందర్భంగా గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం వెంకట పాలెం గ్రామం వద్ద ఏర్పాటుచేసిన పుష్కరఘాట్ వద్ద పుష్కర యాత్రికులకు గాయత్రీ పరివార్ పద్ధతిలో పితృతర్పణాలను, గాయత్రీ యజ్ఞాన్ని తదుపరి భోజన ప్రసాదాలను గాయత్రీ పరివార్ మంగళగిరిశాఖ ద్వారా అందించుటలో ప్రధాన పాత్ర పోషించిన శ్రీ ప్రసాద్‌గారు అభినందనీయులు. గాయత్రీ చేతనా కేంద్రము వీరిని అభినందించుచున్నది.

పై రీతిగా ఒక విశిష్టమైన జీవితాన్ని గడుపుచూ ఉపాసన, సాధన మరియు ఆరాధనల త్రిపుటిలో తన జీవితాన్ని పండించుకుంటూ ఎదుగుతూ 2018లో అశ్వమేధ యజ్ఞాన్ని మంగళగిరిలో జరిపించాలనే తీవ్రకాంక్షతో, అనుక్షణము పూజ్య గురుదేవులు వందనీయ మాతాజీల ఆశీస్సుల కోరుచూ, నిత్యము ప్రార్థించుచున్న వీరిని, వీరి కుటుంబాన్ని ఆ గురుసత్తా ఆశీర్వదించాలని యుగశక్తి గాయత్రి మనసారా కోరుకొనుచున్నది.

**క్రింద పడ్డా పైకి లేచినవాడే హీరో**

వార్తలు

# ఉభయ తెలుగు రాష్ట్రాలలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## కృష్ణానదీ పుష్కరాలు

దృఢ సంకల్పానికి ప్రతీకగా మంగళగిరి పట్టణ గాయత్రీ పరివార్ శాఖ నిర్వహించిన కృష్ణా పుష్కరాలు నిలుస్తాయి.

అఖిల విశ్వగాయత్రీ పరివార్‌లో భాగంగా రూపుదాల్చిన గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణ గాయత్రీ పరివార్ శాఖ 70 మంది సభ్యులతో గత 10 సంవత్సరాల నుండి క్రియా శీలకంగా పనిచేయుచున్నది. మంగళగిరి పట్టణ చుట్టుప్రక్కల నున్న గ్రామాలలో గాయత్రీ యజ్ఞము, సంస్కారాలపట్ల ప్రజలలో అవగాహనను పెంచుతూ, పరమపూజ్య గురుదేవులు వందనీయ మాతాజీల పావన సందేశాన్ని అందిస్తూ యుగ నిర్మాణ దిశగా తమ వంతు కర్తవ్యాన్ని పోషిస్తూ ప్రగతి మార్గంలో నడుస్తున్నది.

బహుకొద్దిపాటి వనరులు కలిగియున్న ఈ శాఖ, కృష్ణానదీ పుష్కరాల సందర్భంగా వచ్చే ప్రజానీకానికి గాయత్రీ పరివార్ విధి విధానం ద్వారా పితృతర్పణలు, యజ్ఞము, తదుపరి భోజన ప్రసాద వితరణ చేయాలనే దృఢ సత్సంకల్పాన్ని గైకొని పట్టుదలతో కార్యాచరణకు పూనుకొన్నారు.

దాతల నుండి ధనాన్ని, వస్తు సామాగ్రిని అంశదానముగా స్వీకరించి కార్యక్రమాన్ని కృష్ణానదీ తీరానికి ఆనుకొని ఉన్న వెంకటపాలెం పుష్కరఘాట్‌లో, శ్రీ మంతెన సత్యన్నారాయణ రాజుగారి ప్రకృతి వైద్యశాల ప్రక్కన ప్రారంభించి 12 రోజుల పాటు నిర్విఘ్నంగా కొనసాగించారు. 12 ఆగస్టు 2016 ఉదయం గం॥ 5.35 ని॥లకు ప్రారంభమైన పుష్కర స్నానాలు 23వ తేది ఆగస్టు 2016 సాయంత్రము 5 గం॥ల సమయానికి ముగిశాయి. ఈ 12 రోజుల యావత్ కార్యక్రమానికి సారథ్యం వహించిన మంగళగిరి గాయత్రీ పరివార్‌శాఖ అధ్యక్షులు శ్రీ ప్రసాద్‌గారు అందించిన కృష్ణానదీ పుష్కర కార్యక్రమ జమా ఖర్చులను ఈ క్రింద పొందుపొరచుట జరిగింది.

**అంశదానములు:** నగదు: రూ. 17,40,000/–; వస్తువుల విలువ: రూ.3,00,000/–; ఖర్చులు: 13,86,000/–; మిగులు: 3,60,000/–; పితృతర్పణలు ఇచ్చిన వారి సంఖ్య: 5,000; నవకుండీ గాయత్రీ యజ్ఞములో పాల్గొన్న వారి సంఖ్య: 4,000; భోజన ప్రసాదముల స్వీకరించిన వారి సంఖ్య: 30,000; సగటున రోజుకు 2,500 మంది

మంగళగిరి గాయత్రీపరివార్ శాఖ వెంకటపాలెం గ్రామ పుష్కరఘాట్‌లో నిర్వహించిన పై కార్యక్రమం నిరక్షరాస్యుల నుండి అక్షరాస్యుల వరకు అందరిని విశేషంగా ప్రభావితం చేసింది. ముఖ్యంగా పితృతర్పణ కార్యక్రమంలో 32 తర్పణాలు, అటు తండ్రిగారి తరపున 3 తరాలు, తల్లిగారి తరపున 3 తరాల వారికి అర్పించుట, అనాథలుగా మరణించిన వారికి తర్పణాలు విడచుట, గురువుకు తర్పణను విడచుట, ప్రమాదాలలో (విమాన, సముద్ర, భూమిపై) మరణించిన వారికి సైతం, పశుపక్ష్యాదులకు సైతం తర్పణల విడచుట, అనేకులలో భావోద్వేగాల రేకెత్తించింది. వారిని ఆలోచనా పరుల గావించింది. గాయత్రీ పరివార్ వ్యవస్థాపకులైన పరమ పూజ్య గురుదేవులు, వందనీయ మాతాజీల ఆలోచనా సరళికి ఇది ఒక మచ్చుతునక.

అట్లే గాయత్రీ యజ్ఞములో పాల్గొని స్వహస్తాలతో, అర్థవంతంగా గాయత్రీ యజ్ఞాన్ని చేసిన వారందరి మనస్సులలో నూతన ఉత్తేజాన్ని నింపి నూతన ఆలోచనా రీతికి బీజాలను నాటింది.

పై రెండు కార్యక్రమాలలో పాల్గొన్న అధిక సంఖ్యాకుల్లో ఒక నూతన చైతన్యం పొడచూపింది. నివురు గప్పి, మరుగున పడ్డ భారతీయ సంస్కృతి తిరిగి వెలుగును సంతరించుకొన్న అనుభూతిని కలిగించింది.

ఇట్టి చరిత్రాత్మక కార్యక్రమాన్ని చేపట్టి పట్టుదలగా ప్రారంభ అవాంతరాలను అధిగమిస్తూ సఫలీకృతం గావించిన గాయత్రీ పరివార్ మంగళగిరిశాఖను యుగశక్తి గాయత్రి మనసారా అభినందించుచున్నది. ప్రేరణాత్మకంగా నిలిచిన మంగళగిరిశాఖకు అఖండ గురుసత్తా ఆశీస్సులు పుష్కలంగా లభించుగాక.

గెలవాలన్న తపన లేకపోతే ఓటమికి దగ్గరయినట్లే

ఈ సందర్భంగా నాగార్జున హైస్కూలు పెదవడ్లపూడి యాజమాన్యానికి, బోధనా సిబ్బందికి మరియు అధినేత శ్రీ రాఘవయ్యగారికి మా హృదయపూర్వక అభినందనలు. కార్యక్రమ సఫలతకు వీరందించిన సహాయ సహకారాలు సర్వులకు ఆదర్శప్రాయం, అనుసరణీయం. వీరికి ఆ ఆఖండ గురుసత్తా ఆయురారోగ్యాలను, సకల సంపద సంపత్తులను ప్రసాదించుగాక.

శాంతికుంజ్ హరిద్వార్ ప్రతినిధులకు మరియు విశాఖ పట్నం నుండి పిలువగానే వచ్చి 12 రోజుల తమ సేవలం దించిన శ్రీమతి సావిత్రి నర్సింగరావుగారికి చేతనా కేంద్రం ప్రత్యేక అభినందనలు తెలుపుచున్నది.

అట్లే నంబూరు నుండి విచ్చేసి 12 రోజులు తమ సేవల నందించిన శ్రీ బ్రహ్మారెడ్డిగారికి మరియు బి.ఎల్.ఎన్. మూర్తి ఎర్రబాలెంవారికి యుగశక్తి గాయత్రి అభినందనల తెలుపు చున్నది. వీరందరికి అఖండగురు సత్తా ఆయురారోగ్యాల ప్రసాదించి, సుఖ సంపత్తులనందించుగాక.

గాయత్రీ శక్తిపీఠం నారాకోడూరు, గుంటూరు జిల్లా శాఖ వారి ఆధ్వర్యంలో సాహిత్య విక్రయశాల నిర్వహించడమైనది. దాదాపు రూ. 20,000/- సాహిత్యం, మరో రూ.20000/- విలువైన మంత్ర శాలువాలు, ధోతీలు, జపమాలలు, తదితర సామాగ్రి విక్రయించబడినది.

మంగళగిరిశాఖ సభ్యులు, శ్రీ భోజనపల్లి ప్రసాద్, శ్రీ పేర్ల వెంకటేశ్వరరావు, శ్రీ తాతారావు, శ్రీమతి రమాదేవి (ఎర్రబాలెం), శ్రీ శేషిరెడ్డి, శ్రీ భిక్షారావు మున్నగు వారందరికి యుగశక్తి గాయత్రి అభినందనలు తెలుపుచున్నది. ఇదే స్ఫూర్తితో, ఇంతకుమించిన ఉత్సాహంతో రానున్న అశ్వమేధ యజ్ఞం (2018)లో ప్రముఖ పాత్రను వీరు పోషించెదరని, ఆ శక్తిసంపత్తుల వీరికి ప్రసాదించమని గురుసత్తాను గాయత్రీ మాతను యుగశక్తి గాయత్రి ప్రార్థించుచున్నది.

## కర్నూలు జిల్లాలో

ఓబులేశునిపల్లె, కర్నూలు పట్టణశివారులో నివాసం ఉంటున్న శ్రీ ఎమ్.నర్సప్ప, శ్రీ జి.నాగరాజు గాయత్రీ పరివార్ విశిష్ట కార్యకర్తల సారథ్యంలో గురుపూర్ణిమ ఉత్సవాలు శ్రీ లక్ష్మీ జగన్నాథస్వామి గట్టు దేవాలయ ప్రాంగణంలో గాయత్రి యజ్ఞముతో నిర్వహింపబడ్డాయి. దీనిలో శ్రీ వి. శివుడు, ఎస్. మదన్‌శేఖర్, శ్రీ జగన్నాథరెడ్డి (భజన బృందం) చంద్రశేఖర్‌గార్లు పాల్గొన్నారు. అన్న ప్రసాద వితరణతోపాటు యుగశక్తి గాయత్రి మాసపత్రిక 50 కాపీలు అందజేయుట జరిగింది.

## గుంటూరు జిల్లా అమరావతిలో

గాయత్రీ పరివార్ వరిష్ట కార్యకర్త అయిన డా॥ శ్రీరాం (తెనాలి) గారి సారథ్యంలో నవకుండీ గాయత్రీ యజ్ఞం సాయిబాబ మందిర ప్రాంగణం అమరావతి, ఆంజనేయ విగ్రహమునకు ఎదురుగా కృష్ణా పుష్కరాల సందర్భంగా నిర్వహింపబడింది. ఈ యజ్ఞములో వందల సంఖ్యలో పుష్కర యాత్రికులు పాల్గొనుట జరిగింది.

## యజ్ఞ శృంఖలలో గాయత్రీ జ్ఞానమందిరం

గాయత్రీ జ్ఞానమందిరం, పాతబోయినపల్లి, స్వర్ణధామనగర్ సారథ్యంలో ఆగస్టు 2016లో ఈ క్రింది కార్యక్రమాలను నిర్వహించారు.

**01.08.2016** - నిజామాబాద్ జిల్లా కామారెడ్డి సమీపంలోని దోమకొండ మం॥, జనగాం 11 కుండీల యజ్ఞము 300 మంది పాల్గొన్నారు.

**12.08.2016** - మెదక్ జిల్లా అన్నారం గ్రామం దుండిగుల్ వద్ద 11 కుండీల యజ్ఞము. 400 మంది పాల్గొన్నారు. రామచంద్రారెడ్డి, పార్శ్వనాథ్‌లు సహకరించారు.

**18.08.2016** - రాఖీపౌర్ణమి సందర్భంగా గాయత్రీ జ్ఞాన మందిరం 9 కుండముల యజ్ఞము. 500 మంది పాల్గొన్నారు.

**22.08.2016** - నిజామాబాద్ జిల్లా తాడ్వాయి గ్రామంలో 11 కుండముల యజ్ఞము.

**24.08.2016** - కామారెడ్డి, బ్రాహ్మణపల్లి గ్రామంలో 12 మంది సభ్యులతో ప్రజ్ఞామండలి ప్రారంభం. అదేరోజు బీచుపేట గ్రామంలో దీపయజ్ఞం.

**27.08.2016** - 24 కుండముల యజ్ఞము బీచ్‌పేట గ్రామంలో జరిపారు.

**28.08.2016** - కామారెడ్డిలోని విద్యానగర్ కాలనీలో 24 కుండముల యజ్ఞం.

**30.08.2016** - తెర్లు మద్ది గ్రామంలో 5 కుండముల యజ్ఞం.

**నీలోని లోపాన్ని సరిదిద్దడానికి దేవుడు వేసే ఉలిదెబ్బే ఓటమి**